బుధవారం
5-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 135
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పాక్‌కు అమెరికా షాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌కు అమెరికా షాకిచ్చింది. పాకిస్థాన్‌లో 845 మిలియన్ డాలర్లు విలువ చేసే ప్రాజెక్టులను నిలిపివేసింది. ప్రపంచ వ్యాప్తంగా యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఏఐడీ) నిధుల్లో కోతలు విధించాలన్న అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు ఈ మేరకు చర్యలు తీసుకుంది. అయితే ఈ ఆకస్మిక పరిణామంతో పాకిస్థాన్ గందరగోళానికి గురవుతోంది. అక్కడ కొన్ని వందల ఉద్యోగాలు పోయే పరిస్థితి ఏర్పడింది. కీలక అభివృద్ధి కార్యక్రమాలు స్తంభించిపోయినట్లు మీడియా నివేదికలు పేర్కొన్నాయి.

స్థానిక పోరులో బీసీలకు 42% సీట్లిస్తాం

మీరు సిద్ధమా... బీఆర్ఎస్, బీజేపీకి రేవంత్ సవాల్

- అసెంబ్లీలో కులగణన సర్వే నివేదిక ప్రవేశపెట్టిన సీఎం
- ఇచ్చినమాటకు కట్టుబడ్డామని... చరిత్ర సృష్టించామని వెల్లడి

విశాలాంధ్ర-హైదరాబాద్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం సీట్లు బీసీలకు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని దానికి అనుగుణంగా బీజేపీ, బీఆర్ఎస్‌లు సిద్ధంగా ఉన్నాయా అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. మంగళవారం సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య రాజకీయ కుల సర్వే-2024 నివేదికను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అలాగే శాసనమండలిలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఈ నివేదికను ప్రవేశపెట్టారు. అంతకుముందు కులగణన సర్వే పై చర్చించిన రాష్ట్రం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో బలహీనవర్గాలకు సంబంధించి ఇప్పటి వరకు సహేతుక సమాచారం లేనందున రిజర్వేషన్లు అమలులో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 1931 తరువాత భారతదేశంలో ఇప్పటి వరకు బలహీన వర్గాల సంఖ్య ఎంతో తేల్చలేదని అలాగే జనాభా లెక్కల్లోనూ బలహీనవర్గాల లెక్కలు పొందుపరచలేదని వివరించారు. అందుకే భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ రాష్ట్రంలో కులగణన చేస్తామని మాట ఇచ్చారని... దానికి అనుగుణంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. కులగణన ప్రక్రియను పూర్తి చేసి నేడు నివేదికను సభలో ప్రవేశపెట్టామని, ప్రతీ గ్రామం, తండాల్లో ఎన్యూమరేటర్లు పకడ్బందీగా వివరాలు సేకరించారని పేర్కొన్నారు. ప్రతీ 150 ఇళ్లను ఒక యూనిట్ గా గుర్తించి ఎన్యూమరేటర్లను కేటాయించి వివరాలు సేకరించామని, అలాగే 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజులు కష్టపడి ఈ నివేదికను రూపొందించారన్నారు. ప్రభుత్వం రూ.160 కోట్లు ఖర్చుచేసి పకడ్బందీ నివేదికను రూపొందించడం జరిగిందని తెలిపారు. పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తరువాత సభలో ప్రవేశపెట్టామని, 56 శాతం ఉన్న బీసీలకు సముచిత గౌరవం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచేలా నివేదికను రూపొందించడానికి కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. ఇప్పటికీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పద్మారావు, డీకే అరుణ కులగణన సర్వేలో పాల్గొనలేదని దుయ్యబట్టారు. కేవలం తన భూముల వివరాలు చెప్పాల్సి వస్తుందనే కేసీఆర్ కుటుంబం సర్వేలో పాల్గొనలేదని విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే అధికారిక డాక్యుమెంట్

- మిగతా 2 లో

బడ్జెట్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు అవశ్యం

వామపక్షాల పిలుపు - ఆర్థిక బిల్లుకు 8 సవరణలు

న్యూఢిల్లీ: పేదలకు వ్యతిరేకంగా... కార్పొరేట్‌లకు అనుకూలంగా 'గొప్పల' బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని వామపక్షాలు విమర్శించాయి. సంపన్నుల బడ్జెట్‌ను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించాయి. బడ్జెట్‌లో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను డిమాండ్ చేశాయి. ప్రజా అనుకూల విధానాలతో బడ్జెట్ ఉండాలని కేంద్రానికి సంయుక్త ప్రకటనలో స్పష్టంచేశాయి. కేంద్రబడ్జెట్ దేశ ప్రజలను మోసం చేసేదిగా ఉందని దుయ్యబట్టాయి. బడ్జెట్ కోసం ప్రత్యామ్నాయ ప్రతిపాదనలకు సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పీ, ఏఐఎఫ్‌బీ పిలుపునిచ్చాయి. కనీస అవసరాలు తీర్చే విషయంలోనూ దేశ ప్రజలను మభ్యపెట్టే విధంగా బడ్జెట్‌ను కేంద్రం తీసుకువచ్చిందని విమర్శించాయి. ప్రజల్లో తగ్గిన కొనుగోలు శక్తి పెరిగేందుకు, నిరుద్యోగ నియంత్రణ, అరకొర వేతనాల మెరుగునకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేకపోవడాన్ని ఆక్షేపించాయి. గొప్పల బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వ్యాఖ్యానించాయి. సంపన్నులు, దిగ్గజ సంస్థలపై పన్నుల విధించడం ద్వారా వనరులను సమకూర్చుకోవడానికి బదులు... ప్రభుత్వ పెట్టుబడులను విస్తరించడం ద్వారా ఉపాధి కల్పించడమే కాకుండా కనీస వేతనానికి హామీకి బదులుగా ప్రైవేటు పెట్టుబడులకు బడ్జెట్ పెద్ద పీట వేసిందని దుయ్యబట్టాయి. విద్యుత్ రంగ ప్రైవేటీకరణలో కేంద్రం దూకుడు ప్రదర్శిస్తోందని ఆక్షేపించాయి. నిరుద్యోగం, ఆహార ధరలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి, సామాజిక సంక్షేమం, పట్టణాభివృద్ధి వంటి కీలకాంశాలను బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో విస్మరించినట్లు పేర్కొన్నాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి డిమాండ్ ఉన్నప్పటికీ కేటాయింపు రూ.86వేల

- మిగతా 2 లో

ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం: సీఎం

విశాలాంధ్ర- హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అమలుకు చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో ఎస్సీ ఉపకులాల వర్గీకరణ ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో సంక్లిష్టమైన సమస్యకు పరిష్కారం చూపడానికి కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు వర్గీకరణకు శాశ్వత పరిష్కారం తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దళితులకు అన్ని రంగాల్లో అపార అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. తాను 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, తన రాజకీయ జీవితంలో ఆత్మసంతృప్తిని కలిగించిన రోజు ఇదేనని వ్యాఖ్యానించారు. ఇలాంటి అవకాశం తనకు రావడం సంతోషంగా ఉందని, ఇది చరిత్రపుటల్లో శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. నాడు ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు వాయిదా తీర్మానం ఇస్తే...సభ నుంచి తనను బయటకు పంపించారని గుర్తుచేశారు. కానీ నేడు సభా నాయకుడిగా వర్గీకరణ అమలుకు సభలో నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. ఇది బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే సాధ్యమైందన్నారు. రంగుల గోడలు... అద్దాల మేడలు కాదు... చివరి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించాలన్న అంబేద్కర్ ఆశయానికి అనుగుణంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇందుకు సభ్యులందరి సహకారం ఉండాలని కోరారు.

ఢిల్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఫిబ్రవరి 05 బుధవారం మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనుండగా, ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుంది. ఈసారి జరగనున్న ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొననున్నారు. మొత్తం 1.55 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 83.49 లక్షలు

- మిగతా 2 లో

రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన

న్యూఢిల్లీ: ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే లోక్‌సభలో సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. వాస్తవాలను వక్రీకరించి భారత్ పరువు పోయేలా మాట్లాడినందుకుగాను రాహుల్‌గాంధీపై సభాహక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రక్రియ ప్రారంభించాలని స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు దూబే స్పీకర్‌కు మంగళవారం లేఖ రాశారు. మేక్ ఇన్ ఇండియా ఫెయిలనందుకే చైనా భారత్‌ను ఆక్రమించిందని రాహుల్ అవాస్తవాలు మాట్లాడారని స్పీకర్‌కు

- మిగతా 2 లో

స్థానిక సంస్థలకే అధికారాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భవన నిర్మాణ అనుమతులపై అధికారాలను స్థానిక సంస్థలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకే భవన నిర్మాణ అనుమతులను సరళతరం చేస్తూ ఆదేశాలిచ్చింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ కింద ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ అనుమతులపై మంగళవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంత స్థానిక సంస్థలే ఇక నుంచి అనుమతులు ఇచ్చేలా ఈ

- మిగతా 2 లో

సర్వేతో బలహీన వర్గాల సంక్షేమం

డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, రాష్ట్రంలోని ఇతర బలహీన వర్గాల సంక్షేమానికి విధానాల రూపకల్పనకు ప్రభుత్వం కుటుంబ సర్వే సమాచారాన్ని ఉపయోగిస్తుందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో మొత్తం బీసీల సంఖ్య 56.33 శాతం అని సమగ్ర ఇంటింటి సర్వే ద్వారా తేలిందన్నారు. ఈ సంఖ్యల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, బడ్జెట్లో కేటాయింపులకు సర్వే సమాచారాన్ని వినియోగిస్తామని చెప్పారు. మంగళవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను శాసనమండలిలో ప్రవేశపెట్టిన సందర్భంగా సభ్యుల ప్రశ్నలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. సర్వే సమాచారం ఆధారంగా సమగ్రత, పారదర్శకత ప్రాతిపదికగా నడిచే పాలనకు నూతన దశ ప్రారంభాన్ని ఈ సర్వే సూచిస్తుందన్నారు. ఈ సర్వే సమాచారం ఆధారంగా రాబోయే రోజుల్లో చాలా చేయబోతున్నట్లు తెలిపారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సర్వే స్పష్టం చేస్తుందన్నారు. రాష్ట్రంలో 3.56 లక్షల మంది సర్వేలో పాల్గొనలేదని...ఇందులో కేసీఆర్, కేటీఆర్, హరీష్, పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి వారు ఉన్నారని ఎద్దేవా చేశారు. వారు ఇప్పుడు ఆసక్తి కనబరిచి సమాచారం ఇస్తే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గతంలో వారు చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఏం చేసుకున్నారో ఎవరికీ తెలియదన్నారు. రాష్ట్రంలో కులగణనపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి శాస్త్రీయ సర్వే జరగలేదని, ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఇది మొదటిదన్నారు.

అంకెల గారడీతో అనుమానాలు సృష్టించొద్దు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర- హైదరాబాద్ : సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో సామాజిక ఆర్థిక,విద్య, ఉద్యోగ, రాజకీయ కులగణన సర్వే నిర్వహించామన్నారు. అంకెల గారడీతో అనవసరంగా ప్రజల్లో అపోహలు, అనుమానాలు సృష్టించ వద్దని ఆయన విపక్షాలకు హితవు పలికారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో ఓసీల శాతం 21శాతం ఉండగా... ఇప్పుడది 15శాతంకు తగ్గిందన్నారు. అదే విధంగా అదే సమగ్ర సర్వేలో బీసీల శాతం 51శాతం ఉండగా... 56 శాతానికి పెరిగిందన్నారు. గణాంకాలు ఇంత స్పష్టంగా ఉంటే ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. సద్విమర్శలను హుందాగా స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని,తప్పులు గుర్తిస్తే సరిదిద్దుకోవడంలో వెనక్కు పోమని తేల్చి చెప్పారు. ప్రతిపక్షాలకు

- మిగతా 2 లో

అంతరాలు లేని సమాజమే ధ్యేయం

- సీపీఐ సీనియర్ నేత చాడ వెంకట్‌రెడ్డి
- జనగామలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర-జనగామ: దేశ సంపద ప్రజలందరికీ చెందాలని, అంతరాలు లేని సమాజ నిర్మాణానికి సీపీఐ సుదీర్ఘ కాలంగా ఉద్యమిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం జనగామలో ప్రిస్టన్ గ్రౌండ్ నుండి కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... సీపీఐ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ లోని కాన్పూర్‌లో పుట్టిందని, దేశవ్యాప్తంగా దున్నేవాడికి భూమి కావాలంటూ భూ పోరాటాలు చేసి పేదలకు లక్షలాది ఎకరాలు భూమి పంచిందని తెలిపారు. కుల,మత తత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా శాంతి కోసం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచిందన్నారు. తెలంగాణ ప్రాంతంలో నైజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడి... దొరల గడీల నుండి 3వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాలను పేదలకు పంచిందని... ఈక్రమంలో 4,500 మంది సీపీఐ నాయకులు, కార్యకర్తలు రక్త తర్పణం చేశారన్నారు. జిల్లాలో భారీ పరిశ్రమలు, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, పక్కా ఇళ్ల నిర్మాణం, యువతకు ఉపాధి అవకాశాలు

- మిగతా 2 లో

వాణిజ్య యుద్ధానికి చైనా సై

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కవ్వింపులతో వాణిజ్య యుద్ధానికి చైనా సై అంటోంది. ఇప్పటికే అమెరికా తమ దేశంపై భారీగా సుంకాలు విధించడానికి దీటుగా అగ్ర రాజ్యంపై ఈనెల 10వ తేదీ నుంచి అదనంగా సుంకాలు విధిస్తూ ఉత్తర్వులను జారీచేసింది.

2 లో

ఏదో చేస్తారనుకుంటే... ఏమీ చేయలేదు

బీఆర్ఎస్ నేత కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రత్యేక అసెంబ్లీ సమావేశం పెట్టి బీసీ కులగణన సర్వే పై ఏదో చేస్తామనే విధంగా ఆర్భాటం చేసిన ప్రభుత్వం చివరకు చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలకు నమ్మకం లేదన్నారు. మంగళవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ గతంలో సమగ్ర కుటుంబ సర్వే జరుగుతుంటే రేవంత్ రెడ్డి వివరాలు ఇవ్వద్దని ప్రజలకు బహిరంగంగా పిలుపునిచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో హామీ ఇచ్చిన విధంగా 42శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి ఈ ప్రత్యేక శాసనసభ సమావేశాల్లో బిల్లు ఏమైనా తెస్తున్నారేమోనని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బలహీన వర్గాల సోదరులు అనుకున్నారని... కానీ ఇక్కడ మాత్రం అలాంటిది ఏమి జరగలేదన్నారు. 57 రకాల వివరాలను ఎలా ఇస్తాం ?ఎవరికి పడితే వారికి ఎలా ఇస్తాం? అని మాట్లాడారని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేను మేము నేరుగా వెబ్‌సైట్‌లోనో పెట్టామన్నారు. ముఖ్యమంత్రి సభను తప్పుదారి పట్టిస్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల సంఖ్య 1,85,61,856 అంటే... 51 శాతం అన్నారు. ముస్లిం సామాజిక వర్గంలోని 10శాతం బీసీలను కూడా కలుపుకుంటే తెలంగాణలోని బీసీల సంఖ్య 61శాతమని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీనే ప్రభుత్వ సర్వే రిపోర్ట్ ను తగలబెట్టండి అని చెప్తున్నాడని, ఇంకా గలీజుగా మాట్లాడాడని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బలహీన వర్గాల సంఘాలు 51 శాతం ఉండగా 46శాతం ఎలా అయ్యిందని అడుగుతున్నాయన్నారు. సబ్ కమిటీ ప్రెస్ మీట్ లో ఉత్తంకుమార్ రెడ్డి ఏదైతే చెప్పారో అవే విషయాలను ఈరోజు ముఖ్యమంత్రి చెబుతున్నారన్నారు. బీసీలకు42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి చట్టబద్ధత తెస్తూ బిల్లు ప్రవేశపెడతారని...అలాగే 56 శాతం ఉన్న బీసీలకు బీసీ సబ్ ప్లాన్ తీసుకొస్తారని అనుకున్నామన్నారు. ఇవేమీ చేయకుండా ఒక ప్రకటన చేసి... ఇదే చారిత్రాత్మకం అంటే బీసీలు ఒప్పుకోరన్నారు.

పాఠ్యాంశంగా మఖ్దూం చరిత్ర

జయంతి సందర్భంగా కూనంనేని నివాళి

విశాలాంధ్ర-హైదరాబాద్: విప్లవ కవి, నిర్మాణ దక్షకుడు, ఏఐటీయూసీ ఆనాటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా మూడు, నాలుగు పర్యాయాలు పని చేసిన కామ్రేడ్ మఖ్దూం మొహియుద్దీన్ 117వ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ మొహియుద్దీన్ ఉన్నత విద్య అభ్యసించి... గొప్ప కవిగా

- మిగతా 2 లో

సాయుధ పోరాట సేనానులు - 7

ఆరుట్ల రామచంద్రా రెడ్డి తెలంగాణా సాయుధ పోరాటంలో ఓ బెబ్బులి. ఆయన ఒక అగ్ని శిఖ. తెలంగాణా ప్రజల జీవితాలను బుగ్గి చేసిన నిజాం పాలనను, భూస్వామ్య దోపిడీని అరికట్టడానికి జరిగిన సాయుధ పోరాటంలో రామచంద్రారెడ్డి దూకారు. ఆయన అన్న ఆరుట్ల లక్ష్మీ నరసింహా రెడ్డి, భార్య కమలా దేవి కూడా సాయుధ పోరాటంలో బందూకు పట్టిన వారే. సన్నిహితులు ఆయనను ఎ.ఆర్. అని పిలిచేవారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ఇదీ లోకం!

ప్రజాస్వామ్యయుతంగా.. దభాయించి మన పార్టీయే గెలిచింది స్వీట్సు తీసుకోండి!

వాణిజ్య యుద్ధానికి చైనా సై

బీజింగ్/వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కవ్వింపులతో వాణిజ్య యుద్ధానికి చైనా సై అంటోంది. ఇప్పటికే అమెరికా తమ దేశంపై భారీగా సుంకాలు విధించడానికి దీటుగా అగ్ర రాజ్యంపై ఈనెల 10వ తేదీ నుంచి అదనంగా సుంకాలు విధిస్తూ ఉత్తర్వులను జారీచేసింది. అమెరికా నుంచి తమ దేశం దిగుమతి చేసుకునే బొగ్గు, లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లపై 15 శాతం; చమురు, వ్యవసాయ పరికరాలపై 10 శాతం చొప్పున సుంకం విధిస్తున్నట్లు తెలిపింది. అలాగే టంగ్‌స్టన్ సంబంధిత వస్తువుల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. పీవీహెచ్ కార్పొరేషన్, కల్విన్ కెలిన్, ఇల్యుమినా ఇంక్ వంటి అమెరికా సంస్థల విశ్వసనీయతను ప్రశ్నిస్తూ వాటిని విశ్వసనీయత లేని సంస్థల జాబితాలోకి చేర్చింది. టెక్ దిగ్గజం గూగుల్‌పై విచారణకు జిన్‌పింగ్ ప్రభుత్వం ఆదేశించింది. అమెరికా దూకుడుకు కళ్లెం వేస్తామని హెచ్చరించింది.

ట్రంప్ వెనక్కి...

కెనడా, మెక్సికోపై సుంకాల విషయంలో ట్రంప్ ప్రభుత్వం వెనక్కు తగ్గింది. రెండు దేశాల నుంచి ప్రతిఘటన ఎదురు కావడమే కాకుండా తమకు అనుకూలంగా కొన్ని హామీలు లభించడంతో శాంతించిన ట్రంప్ ఈ విషయంలో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. మెక్సికో, కెనడా ఉత్పత్తులపై 25 శాతం సుంకాలు విధిస్తూ ఇచ్చిన ఆదేశాలను నెల రోజుల పాటు నిలుపుదల చేస్తూ ట్రంప్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. అమెరికా సరిహద్దుల వెంబడి భద్రతను కట్టుదిట్టం చేస్తాయన్న హామీ లభించడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అలాగే 10,000 మంది భద్రతా బలగాలను తమ సరిహద్దులకు పంచి మత్తు పదార్థాలు, మానవుల అక్రమ రవాణాను కట్టడి చేస్తామని కెనడా, మెక్సికో హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

10 నుంచి అమెరికాపై అదనపు సుంకాలు

ట్రంప్‌తో మాట్లాడా: ట్రూడో

తమ దేశంపై సుంకాల విధింపు ఆదేశాలను ట్రంప్ 30 రోజుల పాటు నిలుపుదల చేసినట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఎక్స్‌లో వెల్లడించారు. ట్రంప్‌తో జరిగిన ఫోన్ సంభాషణ మేరకు ఈ మేరకు ఏకాభిప్రాయం కుదిరినట్లు చెప్పారు. వలసదారులు, డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోడానికి కట్టుబడి ఉన్నామని ట్రంప్‌కు స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు. సరిహద్దుల భద్రత కోసం కెనడా తొమ్మిది మిలియన్ డాలర్ల ఖర్చునకు... 10వేల మంది సైనికుల మోహరింపునకు అంగీకరించిందని అన్నారు. వ్యవస్థీకృత నేరాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో డ్రగ్స్ అక్రమ రవాణా, మనీలాండరింగ్ నిరోధానికి కెనడా-అమెరికా సంయుక్త టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రూడో వెల్లడించారు. మాదక ద్రవ్యాల స్మగ్లర్లను ఉగ్ర జాబితాలో చేర్చాలన్న ట్రంప్ ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసినట్లు కెనడా ప్రధాని చెప్పారు.

క్యూబాకు మద్దతుగా స్విట్జర్లాండ్‌లో ర్యాలీ

జెనీవా: ఆరు దశాబ్దాలుగా క్యూబాపై అమెరికా విధిస్తున్న ఆంక్షలపై స్విట్జర్లాండ్‌లో నిరసన వ్యక్తమైంది. క్యూబాను అగ్రరాజ్యం వేధిస్తోందని, ఆ దేశంపై అన్యాయంగా ఆంక్షలు విధిస్తోందని స్విట్జర్లాండ్ కమ్యూనిస్టు పార్టీ సహా కొన్ని సంఘాలు ఆక్షేపించాయి. జెనీవాలోని ఐక్యరాజ్య సమితి కేంద్ర కార్యాలయం పరిసరాల్లో పెద్ద సంఖ్యలో జనం చేరుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. బ్యానర్లు, క్యూబా జెండాలు ప్రదర్శిస్తూ... క్యూబాకు సంఘీభావం ప్రకటించారు. అమెరికా ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని నినదించారు. ఉగ్ర జాబితా నుంచి క్యూబా తొలగింపునకు డిమాండ్ చేశారు. ఐరాస-జెనీవాకు క్యూబా రాయబారి రొడాల్ఫో బెనిట్జ్, స్విట్జర్లాండ్ కమ్యూనిస్టు పార్టీతో పాటు స్విస్ క్యూబా అసోసియేషన్, క్యూబన్ అండ్ లాటిన్ అమెరికన్ రెసిడెంట్స్, మెడిక్యూబా-స్విట్జర్లాండ్, తదితర సంఘాల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు.

బెల్జియంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

బ్రస్సెల్స్: బెల్జియంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. సుస్థిర సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుపై కొన్ని నెలలపాటు సాగిన రాజకీయ ప్రతిష్ఠంభన ఎట్టకేలకు ముగిసింది. ఫ్లెమిష్ నేషనలిస్ట్ ఎన్-వీఏ పార్టీ నాయకుడు బార్ట్ డి వెయర్ నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. గత జూన్‌లో జరిగిన ఎన్నికల్లో ఆయన ప్రధానిగా ఎన్నికయ్యారు. కాగా, ఫెడరల్ ప్రభుత్వానికి ఎన్-వీఏ పార్టీ నాయకత్వం వహించడం ఇదే మొదటిసారి. రాయల్ ప్యాలెస్‌లో ప్రమాణ స్వీకారోత్సవం జరుగగా... బార్ట్ డి వేయర్‌తో పాటు 14 మంది మంత్రులు ప్రమాణాలు చేశారు. కొత్త సంకీర్ణం 'అరిజోనా'లో ఐదు ప్రధాన పార్టీలు 'ఎన్-వీఏ, ది ఫ్లెమిష్ క్రిస్టియన్ డెమొక్రాట్స్, ది సోషలిస్ట్ వూర్యూట్, ది ఫ్రెంచ్ స్పీకింగ్ రిఫార్మిస్ట్ మూవ్‌మెంట్, సెంట్రిస్ట్ లెస్ ఎంగేజెస్' ఉన్నాయి.

అంతరాలు లేని సమాజమే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

కల్పించేందుకు కృషి చేయాలని, దేవాదుల ప్రాజెక్టు పూర్తికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

కమ్యూనిస్టులు ఐక్యం కావాలి

దేశంలో చీలిపోయి ఉన్న కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మావోయిస్టులు తమ పంథా మార్చుకొని ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలకు కమ్యూనిస్టులతో కలిసి రావాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యం అయితే ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ , జిల్లా సహాయ కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, చొప్పరి సోమయ్య, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడీతో అనుమానాలు సృష్టించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అనుమానాలు ఉంటే ప్రజెంటేషన్ ద్వారా నివృత్తి చెయ్యడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో కులగణన సర్వే ఎందుకు నిర్వహించలేదో బీజేపీ నాయకులు వివరణ ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతి మందికి ఒక సూపర్ వైజర్ ను నియమించి ఈ ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

మొత్తం ఈ సర్వేలో లక్షా మూడు వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారన్నారు. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు రాత్రి పగుళ్ల శ్రమించి సృష్టించిన చారిత్రాత్మక ఘట్టం ఇది అన్నారు. 4 ఫిబ్రవరి 2024 న మొదలు పెట్టిన ఈ ప్రక్రియ సరిగ్గా సంవత్సరం తిరిగేసరికి అంటే 4 ఫిబ్రవరి 2025 నాటికి రూ.160 కోట్ల ఖర్చు చేసి పూర్తి చేసిన ఘనత ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ చిత్త శుద్ధిని శంకించి ప్రజల్లో తప్పుడు సమాచారంతో అపోహలు అనుమానాలు సృష్టించ వద్దని సూచించారు.

స్థానిక సంస్థలకే అధికారాలు

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాలు జారీ అయ్యాయి. సీఆర్‌డీఏ మినహా అన్ని చోట్లా అనుమతులు జారీ చేసే అధికారాన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధి నుంచి పట్టణ ప్రాంత స్థానిక సంస్థలకు బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 300 చదరపు మీటర్లు మించని నిర్మాణాలకు స్వయంగా యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసేలా చట్టంలో మార్పులు చేశారు. ఆర్కిటెక్టులు, ఇంజినీర్లు, టౌన్‌ప్లానర్లు కూడా దరఖాస్తు చేసేలా అవకాశం కల్పిస్తూ మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లు కూడా ఇంటి ప్లాన్‌ను ధ్రువీకరించి అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించింది. నివాస భవనాలకు మాత్రమే ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు పోర్టల్‌లో ప్లాన్ అప్‌లోడ్‌కు నిబంధనలను సులభతరం చేసింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన నిర్మాణ అనుమతుల కోసం సెల్ఫ్ సర్టిఫికేషన్ ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంలో ఎలాంటి ఉల్లంఘనలు చోటు చేసుకున్నా సంబంధిత భవనాల యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ మార్గదర్శకాలు జారీ చేశారు.

రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన

(మొదటి పేజీ తరువాయి)

రాసిన లేఖలో దూబే పేర్కొన్నారు. పార్లమెంట్ వేదికగా దేశం పరువు తీసేలా రాహుల్ మాట్లాడారని ఆరోపించారు. రాహుల్ తన వ్యాఖ్యలకు ఆధారాలు చూపించలేదని, కనీసం క్షమాపణలు కూడా చెప్పలేదని దూబే గుర్తు చేశారు. కాగా, లోక్‌సభలో సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై రాహుల్‌గాంధీ మాట్లాడారు. చైనా భారత్‌లో కొంత భాగాన్ని ఆక్రమించిందన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ అమెరికా పర్యటనపైనా రాహుల్ విమర్శలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తీరుపైనా రాహుల్ మాట్లాడారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం: శ్రీధర్ బాబు

విశాలాంధ్ర-హైదరాబాద్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. ఈ దిశగా వీలైనంత త్వరగా తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శాఖ రూపొందించిన 2025 మీడియా డైరీని మంత్రి మంగళవారం ఆవిష్కరించారు. ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వాటర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ సమగ్ర సమాచారంతో రూపొందిన ఈ డైరీ కేవలం జర్నలిస్టులకే కాదు ప్రజా ప్రతినిధులు, అధికారులకూ ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.మల్కయ్య, గోవిందు, మాణిక్య రెడ్డి, చంద్రమోహన్, రాములు, అక్బర్ భాష, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ రావు, అనుబంధ కమిటీ కన్వీనర్లు చంద్రమౌళి, విజయ్, దామోదర్ రెడ్డి, నియోజక వర్గ, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వల్ల మహేందర్ రెడ్డి, వేముల శంకర్, శేషారెడ్డి పాల్గొన్నారు.

ఉప్పల్ జర్నలిస్టుల ఇళ్ల స్థలం సమస్య పరిష్కరించండి

ఇళ్ల స్థలాల కోసం కాట సింగారం గ్రామ శివారులో దాదాపు 15ఏళ్ల క్రితం ఉప్పల్, ఘట్‌కేసర్ జర్నలిస్టులకు కేటాయించిన భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని కె.విరాహత్ అలీ... యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాల్ రాజ్ గౌడ్, జిల్లా కార్యదర్శి వెంకట్రాం రెడ్డితో కలిసి మంత్రి శ్రీధర్ బాబుకు అందించారు.

పాఠ్యాంశంగా మఖ్దూం చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

పేరుగాంచారని అన్నారు. నిజాం దుందుడుకు చర్యలకు, దమనకాండకు వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. ముస్లింలంతా నిజాం తాబేదారులుగా చర్చ జరుగుతుంటే... షేక్ బందగి, షోయబుల్లాఖాన్, మొహియుద్దీన్ వంటి అనేకమంది న్యాయం కోసం మతం, కులాన్ని పక్కనపెట్టి నిజాంకు వ్యతిరేకంగా, ప్రజల బాధల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు నిర్వహించారని అన్నారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వస్తే 1948 సెప్టెంబరు 17న నిజాం నవాబు స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నారని తెలిపారు. 1945 నుంచి కమ్యూనిస్టులు పోరాటం చేసి సాధించిన భూములను పటేల్ సైన్యం కుమ్మక్కై భూములను లాక్కునే ప్రయత్నం చేసిందన్నారు. పటేల్ సైన్యం కమ్యూనిస్టులపై చేస్తున్న దాడులను తిప్పి కొట్టడానికి సాయుధ పోరాటమే శరణ్యమని 1948 సెప్టెంబరు 17న ఆంధ్ర మహాసభ అధ్యక్షులు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ ప్రాంత కార్యదర్శి బద్దం ఎల్లారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మఖ్దూం మొహియుద్దీన్... మూడు రంగాలకు చెందిన ఈ ముగ్గురు సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం భారతదేశ చరిత్ర పుటలలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిందన్నారు. ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది వీరులు అమరులయ్యారని, ఆ ప్రభావంతోనే అనేక రైతాంగ, రైతు కూలీ చట్టాలు, కౌలుదారీ రక్షణ చట్టాలు సాధించబడ్డాయని వివరించారు. మఖ్దూం మొహియుద్దీన్ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలన్నారు. విప్లవ కవిగా ఆయన విగ్రహావిష్కరణ జరిగిందని, కానీ ఆయనకు విప్లవకారుడుగా గుర్తింపు రావాలని కూనంనేని అన్నారు. ఆనాటి సాయుధ పోరాటంలో అశువులు బాసిన అమరుల పేరు మీద లైబ్రరీ ఏర్పాటు చేసి మఖ్దూం మొహియుద్దీన్ పేరు పెట్టాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, రాష్ట్ర పార్టీ కార్యాలయ కార్యదర్శి ఎ.గోవిందరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెరగాలి

- సంక్షేమం, అభివృద్ధి అమలుకు ఆర్థిక వనరులే కీలకం
- అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా కుదేలైన రాష్ట్రం మళ్లీ కోలుకుని అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంలోని ఆదాయార్జన శాఖలు ఉత్తమ ఫలితాలు రాబట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఖజానాకు రాబడులు పెంచేందుకు సరికొత్త ఆలోచనలు చేయాలని, సమర్థవంత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాధారణ పనితీరుతో, సాధారణ లక్ష్యాలతో పనిచేస్తే ఫలితాలు రావని, వినూత్న ఆలోచనలతో పనిచేయాలని సీఎం మార్గనిర్దేశనం చేశారు. సాంకేతికత వాడకం ద్వారా రెవెన్యూ ఆర్జనలో లోపాలను సరిదిద్ది ఆదాయం పెంచాలని సూచించారు. వాణిజ్య పన్నుల విభాగంలో పన్ను ఎగవేతలపై అధికారులు చెప్పిన అంశాలపై సీఎం స్పందిస్తూ... ఏ ఒక్కరూ పన్ను ఎగవేతకు పాల్పడకుండా చూడాలన్నారు. అలా అని వ్యాపారులను వేధింపులకు గురి చేయవద్దన్నారు. ఆదాయార్జన శాఖలపై మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలకు, అభివృద్ధి పనులకు ఆర్థిక వనరులు ఎంతో కీలకం. అధికారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రోజువారీ ప్రగతి చూపేలా పని చేయాలి. గత ప్రభుత్వ విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఆదాయం కోసం ప్రజలపై అదనంగా భారం మోపలేం. ఆదాయార్జనలో మరింత మెరుగైన ఫలితాలు సాధించడం మినహా మరొక మార్గం లేదని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం నుంచి నిధుల విషయంలో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారి యాను కలిసి గంటా 45 నిమిషాల పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించానని చెప్పారు.

దిల్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పురుష ఓటర్లు కాగా, 71.74 లక్షలు మహిళా ఓటర్లు ఉన్నారు. 20 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటువేసేవారి సంఖ్య 2.08 లక్షలుగా ఉంది. మొత్తం 70 అసెంబ్లీ నియోజకవర్గాలలో 58 జనరల్ సీట్లను, 12 ఎస్సీ రిజర్వ్ సీట్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అవసరాలు ఉన్న ప్రజల (పీడబ్ల్యూడీ) పోలింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 కాగా, 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షలుగా నమోదయ్యారు. దిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 ఉండగా, వీరికి కూడా ఓటు హక్కు ఉంది. దిల్లీలో మొత్తం 13,033 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో 100% పట్టణ ప్రాంత పోలింగ్ స్టేషన్లు ఉండటం వల్ల నగరంలో ప్రతి ఓటరు సులభంగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవచ్చు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సగటున 1191 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లను సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చేందుకు ప్రత్యేక రవాణా ఏర్పాట్లు కూడా ఉన్నాయి. మద్యం నివారించడానికి, ప్రతి పోలింగ్ కేంద్రంలో అవగాహన కలిగించే సిబ్బంది ఉంటారు. దిల్లీ ఎన్నికల కోసం ప్రత్యేకంగా వెబ్‌కాస్టింగ్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రతీ పోలింగ్ కేంద్రం కార్యక్రమాలు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉంది. 70 పోలింగ్ స్టేషన్లను పీడబ్ల్యూడీ సిబ్బంది నిర్వహిస్తారు. మరో 70 పోలింగ్ స్టేషన్లను మహిళా సిబ్బంది నిర్వహించనున్నారు. ఈ కేంద్రాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దిల్లీలో 210 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని...వాటి వద్ద ప్రత్యేక సౌకర్యాలు, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తగా సమర్థవంతంగా పోలింగ్ కు హాజరై తమ బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు సూచించారు. ఇప్పటికే దాదాపు 7 వేల మంది సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పటిష్ట బందోబస్తు

దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల కోసం గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ రోజు ముందు ప్రజలకు శాంతి సందేశం ఇవ్వడానికి భద్రతా బలగాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించాయి. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మేము రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్‌లను పెంచామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) సౌత్ ఈస్ట్, రవి కుమార్ సింగ్ పేర్కొన్నారు. ప్రజల ప్రవర్తనకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ పరిణామాలు ఏర్పడకుండా ఉండేందుకు నిఘా పెంచినట్లు తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, ఎన్నికల్లో పాల్గొని, ఓటు హక్కు ఉపయోగించుకోవాలని సందేశం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో పారామిలిటరీ దళాలు, పోలీసు సిబ్బంది, సీసీ టీవీ కెమెరాలు, ఏఐ ఆధారిత కెమెరాలు, డ్రోన్లతో సహా వివిధ భద్రతా చర్యలను పోలీసులు అమలు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు చోటుచేసుకోకుండా ఉండేందుకు, దిల్లీ పోలీసులే కాకుండా ప్రత్యేకమైన ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కూడా వినియోగిస్తున్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల రోజు ఫిబ్రవరి 5న అల్లర్లను అడ్డుకోవడానికి ముఖ్యమైన ప్రాంతాల్లో భద్రతా చర్యలు మరింత పెంచారు. దీంతోపాటు ఎన్నికల రోజు సురక్షిత వాతావరణం ఉండేందుకు నగరంలోని కీలక ప్రాంతాల్లో ముఖ గుర్తింపు సాంకేతికత ను ఉపయోగిస్తున్నారు. అదనంగా ఏఐ-ఆధారిత కెమెరాలు, డ్రోన్లు, 30,000 మంది పోలీసు సిబ్బంది, 6,525 మంది శిక్షణ పొందిన సిబ్బందిని కూడా నియమించారు. గత ఏడాది నవంబర్ 7 నుంచి ఫిబ్రవరి 2 వరకు అధికారులు ఇప్పటివరకు రూ.11,23,97,697 లెక్కలు లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో రూ.3,59,65,843 విలువైన 1,08,258 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విషయంలో 1315 కేసులు నమోదుచేసి, 1353 మందిని అరెస్టు చేశారు. పోలింగ్ రోజున 35,626 మంది దిల్లీ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారు. వీరితో పాటు 6,525 మంది శిక్షణ లేని సిబ్బందీ సహకరించనున్నారు.

ప్రతిపాదనలు అవశ్యం

(మొదటి పేజీ తరువాయి)

కోట్లలో మార్పు లేదని గుర్తుచేశాయి. రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయించారు కానీ అధిక ధరలు, జీఎస్టీ వంటి పరోక్ష పన్నుల భారం మోస్తున్న శ్రామిక వర్గానికి ఏం ఇచ్చారని కేంద్రాన్ని వామపక్షాలు ప్రశ్నించాయి. పన్ను మినహాయింపు పరిధిని పెంచడం వల్ల కలిగే నష్టాన్ని సంపన్నులు, కార్పొరేట్లపై పన్ను రేట్లు పెంచడం ద్వారా పూడ్చుకుండా కార్పొరేట్లకు, కుబేరులకు బొనాంజా ఇవ్వడాన్ని దుయ్యబట్టాయి.

బడ్జెట్‌లో చేసిన ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలు అన్నింటినీ తిరస్కరిస్తున్నట్లు సంయుక్త ప్రకటనలో సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పీ), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) ప్రధాన కార్యదర్శులు డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భాట్టాచార్య, జి.దేవరాజ్, సీపీఎం సమన్వయకర్త ప్రకాశ్ కారత్ స్పష్టం చేశారు. ప్రజలకు అనుకూలమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను బడ్జెట్‌లో చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచడానికి దోహదమవ్వడమే కాకుండా ఉపాధి/ఉద్యోగావకాశాల కల్పనకు, వేతనాలు పెంచేందుకు ఉపయుక్తంగా ఉండేలా...విద్య, ఆరోగ్యం, సామిజిక భద్రతకు హామీనిచ్చేలా ప్రతిపాదనలు ఉండాలని కేంద్రానికి సూచించారు. ఆర్థిక బిల్లుకు కొన్ని ప్రతిపాదనలు చేశారు. అందులో 1) దేశంలోని 200 బిలియనీర్లపై నాలుగు శాతం ఆస్తి పన్ను విధించాలి. కార్పొరేషన్ పన్ను పెంచాలి. 2) వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ కార్యాచరణ ముసాయిదా చట్టం ఉపసంహరించాలి, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టపరమై హామీ కల్పించాలి. 3) ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, జాతీయ మొనెటైజేషన్ పైప్‌లైన్ ద్వారా ప్రైవేటు రంగానికి ఆస్తుల ధారాదత్తం చేయడాన్ని నిలుపుదల చేయాలి. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐ విధానాన్ని ఉపసంహరించాలి. 4) ఎన్ఆర్ఈజీఏ కేటాయింపులో 50శాతం పెంచాలి, పట్టణ ఉపాధి హామీ పథకం తేవాలి, వృద్ధుల పింఛన్లు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలను విస్తరించాలి. 5) జీడీపీ నుంచి విద్యకు ఆరు శాతం, ఆరోగ్యానికి మూడు శాతం చొప్పున ఖర్చు పెట్టాలి. 6) ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి ఆహార సబ్సిడీ పెంచాలి. 7) ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమానికి కేటాయింపులు పెంచాలి, ఐసీడీఎస్ కోసం వ్యయ పరిమితి పెంచాలి, స్కీమ్ వర్కర్ల కోసం గౌరవ వేతనంలో కేంద్ర వాటా పెంచాలి. 8) రాష్ట్రాలకిచ్చే దాంతో పాటు కేంద్ర పథకాలకు నిధులు పెంచాలి. పెట్రోలియం ఉత్పత్తులపై సెస్‌లు, సర్‌చార్జిలు రద్దు చేయాలి.

ఇదిలావుంటే, ఆర్థిక బిల్లు ద్వారా బడ్జెట్‌ను ఆమోదించే ముందు తమ డిమాండ్లు/ప్రతిపాదనలకు స్థానం కల్పించేలా ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఇందుకోసం ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ప్రచారోద్యమాన్ని చేపట్టనున్నారు. సాధ్యమైనంత ఎక్కువ మందిని చైతన్య పరిచి తమ ప్రతిపాదనలకు మద్దతు పొందేందుకుగాను ఇంటింటి ప్రచారం, వీధి కూడళ్లలో సమావేశాలు, ప్రదర్శనలు, ధర్నాల రూపేణ కార్యక్రమాల కార్యాచరణను వామపక్షాల రాష్ట్ర శాఖలు సిద్ధం చేస్తున్నాయి.

స్థానిక పోరులో బీసీలకు 42% సీట్లిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అయితే నివేదికను ఎందుకు కేబినెట్‌లో పెట్టలేదని నిలదీశారు. ఎందుకు ఆ నివేదికను అసెంబ్లీలో పెట్టలేదు? ఎందుకు నివేదికను ఒక కుటుంబం గుప్పిట్లో పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఈ సర్వేలో సమోదైన కుటుంబాల ఆధారంగా రాష్ట్రంలో 3,54,77,554 మందిని సర్వే చేయడం జరిగిందన్నారు. ఇందులో ఎస్సీలు 61,84,319 మంది ఉండగా... ఇది మొత్తంలో 17.43 శాతంగా ఉందని అలాగే ఎస్టీలు 37,05,929 ఉండగా మొత్తం లో 10.45 శాతం ఉన్నారన్నారు. ముస్లిం మైనారిటీలను మినహాయించి బీసీలు 1,64,09,179 ఉండగా...మొత్తంలో 46.25 శాతం ఉన్నట్లు వివరించారు. అదేవిధంగా ముస్లిం మైనారిటీలు మొత్తం 44,57,012 ఉండగా... మొత్తంగా 12.56 శాతం ఉన్నట్లు తెలిపారు. ముస్లిం మైనారిటీల్లో బీసీలు 35,76,588 ఉండగా, మొత్తంలో వీరు 10.08 శాతం, ముస్లీం మైనారిటీలో ఓసీలు 8,80,424 ఉండగా... మొత్తంలో 2.48 శాతంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక ఓసీల జనాభా 56,01,539 మంది ఉండగా... ఇది మొత్తంలో 15.79 శాతం గా ఉందని పేర్కొన్నారు. ఓసీల్లో ముస్లిం మైనారిటీ మినహాయిస్తే... 47,21,115 ఉన్నారని.. ఇది మొత్తం జనాభాలో 13.31 శాతం అని వెల్లడించారు. ఈ చర్య సమానతా వృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతను తెలంగాణ ప్రజల విభిన్న అవసరాలను తీర్చే పద్ధతిని ప్రతిబింబిస్తుందన్నారు. ఇది డేటా ఆధారిత, సమగ్రత పారదర్శకత ప్రాతిపదికగా నడిచే పాలనకు నూతన దశ ప్రారంభాన్ని సూచిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

కులగణన కోసం ప్రధానిపై ఒత్తిడి పెరుగుతుంది

తెలంగాణ లో కులగణన సర్వే పూర్తి చేయడంతో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ప్రధానమంత్రి పై కూడా ఒత్తిడి పెరుగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో చేపట్టిన సర్వే వల్ల 56 శాతం బీసీలు, 17.5 శాతం ఎస్సీలు మొత్తం 73.5 శాతం ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నామని చెప్పారు. అసెంబ్లీలోని తన చాంబర్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సభలో ప్రవేశపెట్టే డాక్యుమెంట్ భవిష్యత్ లో ఎప్పుడైనా రిఫరెన్స్ డాక్యుమెంట్ అవుతుందన్నారు. దేశంలోనే మొదటిసారి కులగణన చేసి చరిత్ర సృష్టించామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు, మంత్రివర్గ ఉపసంఘం, ఏక సభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ముందుకెళ్తామని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదని, వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి సీఎం అన్నారు. ఇంత ముఖ్యమైన అంశం పై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష నాయకుడు సభకు రావాలి కదా అని నిలదీశారు. గత ఎన్నికల్లో 88 జనరల్ సీట్లలో 30 సీట్లు బీసీలకు ఇచ్చాం అంటే 33 శాతం సీట్లు ఇచ్చినట్లని పేర్కొన్నారు. మేము కోర్టు ఇచ్చిన క్రిమిలేయర్ ను తిరస్కరించామని, బీసీ రిజర్వేషన్ల పై కోర్టు ఆదేశాల మేరకు కమిషన్ వేశామని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకే కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని, అసెంబ్లీకి రాని వారు అసెంబ్లీ టైం గురించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : నూతన సంవత్సరం 2025 విశాలాంధ్ర దినపత్రిక, విశాలాంధ్ర డైరీని, ఏటూరు నాగారం ఎసై ఎస్.కె.తాజ్‌ద్దీన్, మంగళ వారం పోలీస్‌స్టేషన్‌లో అయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశాలాంధ్ర ములుగు జిల్లా బ్యూరో వై. లకుమయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో సవరణలుంటే తెలపాలి

మరిపెడ ఎఫ్ఏసీ ఎంపీడీవో కనకదుర్గ

విశాలాంధ్ర- మరిపెడ: రానున్న గామ పంచాయతీ ఎన్నికలకు ఓటరు జాబితాలను సిద్ధం చేశామని, ఇప్పటికే గ్రామాల వారీగా జాబితాలు ఆయా పంచాయతీ కార్యదర్శుల వద్ద, జీపీ కార్యాలయాల్లో ఉంచామని మరిపెడ ఎఫ్ఏసీ ఎంపీడీవో కనకదుర్గ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని ఆల్ పార్టీలతో ఆమె ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా, కొత్త, పాత సవరణలకు సంబంధించి ప్రజలు, పార్టీలు సరి చూసుకోవాలని, సవరణలు కరెక్షన్లు ఉంటే 5వ తేదీ సాయంత్రం వరకు అధికారులకు తెలియజేయాలన్నారు. మరిపెడ మండలానికి సంబంధించి నూతనంగా ఏర్పాటైన జీపీలు 4తో కలిపి మొత్తం 48జీపీల జాబితాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తం మరిపెడ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 47,081ఓట్లు ఉన్నట్లు తెలిపారు. 6వ తేదీ అనంతరం సవరణలు పూర్తి చేసి తుది జాబితాలను గ్రామాలకు తెలియజేయటం జరుగుతుందన్నారు. అన్ని పార్టీలకు చెందిన వారు ఓటరు జాబితాలను సరి చూసుకోవాలని, గడువులోగా సవరణలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎంపీవో సోమ్లాల్, సూపర్ వైజర్ యాకుబ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, సీపీఎం నాయకుడు బాణాల రాజన్న, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు తీరని అన్యాయం

విశాలాంధ్రబ్యూరో-నిర్మల్‌జిల్లా : ఖానాపూర్ కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ సోమవారం మాట్లాడుతు కేంద్ర బడ్జెట్ లో ఆదివాసీలకు ఎలాంటి కేటాయింపులు పెంచకుండా గతంలో ఇచ్చిన దానికంటే మరింత తక్కువగా ఇవ్వడం సరికాద్దన్నారు కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధినీ మరిచిందని అర్ధంపర్ధం లేని పథకాల పేర్లు పెట్టి గిరిజనులను మాయ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆదివాసీల జిల్లా నాయకులు ఆత్రం రాజేశ్వర్ వసంతరావు ఆనంద్ రావు వేద్మా శేఖర్‌లు మండిపడ్డారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

విశాలాంధ్ర- తొర్రూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించా లన్నారు. మంగళ వారం మండలంలోని జమసా పురం, ఖానాపురంలో గల ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందిం చాలని, ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని ఉపాధ్యాయు లకు సూచించారు. పాఠశాలలోని విద్యార్థులను వారి సామర్థ్యాల విద్యార్థు లను అడిగి తెలుసుకు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాల న్నారు. అదేవిధంగా ఒక పాఠ్యాంశాన్ని విద్యార్థికి బోధించి ఉపాధ్యాయులకు చూపిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జమాస్తాపురం పాఠశాల ప్రధానోపాధ్యా యులు కుమారస్వామి, ఖానాపురం ప్రధానోపాధ్యాయులు వి రఘు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, సిఆర్పి ఎస్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మోదీకి చిత్ర పటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-నేరేడుచర్ల : భారతీయ జనతా పార్టీ రాష్ట్రనాయకురాలు చల్లా శ్రీలతరెడ్డి మరియు టౌన్ అధ్యక్షులు కొనతం నాగిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 -26 బడ్జెట్ లోని కేటాయింపులను కొనియాడుతూ, నరేంద్ర మోడీకి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకురాలు చల్లా శ్రీలత రెడ్డి మాట్లాడుతూ 2014లో పన్ను రాయితీ పరిమితి రూ.2లక్షల వరకే ఉండేదని, మధ్యతరగతి ఉద్యోగస్తుల జీవితాలను మెరుగుపరిచే విధంగా రూ.12లక్షల వరకు పన్ను రాయితీని ప్రకటించడం నరేంద్ర మోడీ దేశ ప్రజలకు ఇచ్చిన గొప్ప బహుమతి అని, రైతుల కోసం కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పరిమితి రూ.3లక్షల నుండి రూ.5లక్షల వరకు పెంచి 3% వడ్డీతో ఇవ్వడం జరుగుతుందని, ప్రధానమంత్రి ధన్ ధాన్య యోజన ద్వారా 1.7 కోట్లకు పైగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, తెలంగాణ రైతుల రసాయన ఎరువుల కోసం 33 వేల కోట్ల సబ్సిడీని ప్రకటించడం జరిగిందని, 36 రకాల ప్రాణాంతక వ్యాధులకు వాడే ఔషధా లకు పన్ను రాయితీని కల్పించడం దేశ పురోగతికి తోడ్పడుతుందని, గ్రామీణ మహిళ వ్యవసాయ దారులకు 10 వేల కోట్ల విలువైన పథకం ద్వారా, 5 లక్షల మంది మహిళ వ్యవసాయదారులకు 2 కోట్ల వరకు రుణ సదుపాయం ద్వారా మహిళా సాధికారత చేకూరనుందని అన్నారు. వచ్చే ఐదేళ్లలో 75 వేల మెడికల్ సీట్లను పెంచుతూ మరియు గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలకు బ్రాడ్ బ్యాండ్ సేవలు కల్పిస్తూ బడ్జెట్లో కేటాయించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో జిల్లా కౌన్సిల్ మెంబర్ సంకలమద్ది సత్యనారాయణరెడ్డి ,టౌన్ ఉపాధ్యక్షులు ఉరిమల్ల రామ్మూర్తి, కిసాన్ మోర్చా అధ్యక్షులు తాళ్ల నరేందర్ రెడ్డి, యువ మోర్చా అధ్యక్షులు కాల్వ సైదులు, సీనియర్ నాయ కులు మెట్టు శ్రీనివాసరెడ్డి, మెట్టు మధు, తాళ్లూరి రమేష్ నాయుడు, సంద్యాల వెంకటరెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సోషల్ మీడియా ఇన్చార్జులు పుల్లెంల సైదులు, సంకలమద్ది మధు,బూత్ అధ్యక్షులు కాంపెల్లి నారాయణ రెడ్డి, పూర్ణచంద్రరావు, తాటికొండ పరమేశ్వర్ రెడ్డి, కాలం నాగయ్య, వెన్నం సురేష్, , కొణతం కిరణ్, సైదులు, కాపర్తి కిరణ్, దేవిరెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రానున్న శాసన మండలి, (ఎమ్మెల్సీ) పంచాయితీ,ఎంపీటీసీ, ఎన్నికల నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని (482) గ్రామ పంచాయతీలు, (4110) వార్డుల వారీగా ఓటరు జాబితా సవరణలు అభ్యంతరాలు, గ్రామపంచాయతీ, వార్డు పోలింగ్ బూత్ లు, వివిధ అంశాలపై వారితో చర్చించి సలహాలు, సూచనలు తీసుకున్నట్లు తెలిపారు.జిల్లాలోని రెండవ ఓటరు సవరణ జాబితా ఓటరు సవరణలపై మంగళవారం, బుధవారం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిం చడం జరుగుతుందని, అట్టి వివరాలను సేకరిస్తామన్నారు. అలాగే జిల్లాలోని (193) ఎంపీటీసీల స్థానాల వివరాల చర్చించారని, ప్రభుత్వ నిబంధనలు, ఎన్నికల ఆదేశాల మేరకు షెడ్యూలు ప్రకారం జిల్లాలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి, జడ్పీ సీఈవో పురు షోత్తం, జిల్లా పంచాయతీ అధికారి హరి ప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నుండి సురేష్ నాయుడు, భారత రాష్ట్ర సమితి నుండి మారినేని వెంకన్న, సీపీఐ పెరుగు కుమార్, కలెక్టరేట్ సూపర్డెంట్ మదన్ మోహన్, పాల్గొన్నారు.

మార్కెటింగ్ కోసం మద్దతు కల్పిస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో: గ్రామీణ స్వయం సహాయ సంఘాల మహిళలు జాతీయ స్థాయి వ్యాపార వేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొ న్నారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన మద్దతు కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం సహాయ మహిళా సంఘాలు తయారు చేసిన చేనేత, హస్త కళల, ఆహార ఉత్పత్తుల ప్రదర్శన 'మిని సరస్ ఫెయిర్ 2025' ఆమె ప్రారంభించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారి నల్గొండ లో ఉమ్మడి నల్గొండ జిల్లా మహిళా సంఘాల కోసం సరస్ ఏర్పాటు చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల్ని సోషల్ మీడియా, అమెజాన్ లాంటి ఆన్ లైన్ మార్కెట్‌లో కూడా మార్కెటింగ్ చేయాలని సూచించారు. అందుకోసం అవసరమైన అన్ని రకాల మద్దతు జిల్లా యంత్రాంగం నుంచి ఉంటుం దని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర సమా చార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ సంచాల కులు జి. కోటేశ్వర రావు, జిల్లా అటవీ అధి కారి రాజశేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణ వేణి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధి కారి ఎన్.పద్మ , పరిశ్రమల శాఖ జీఎం వి.కోటేశ్వర రావు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.గ్రామీణ మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన ఈ నెల 8వరకు నల్గొండ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో కొనసాగుతుందని జిల్లా గ్రామీణ భివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 9.30 వరకు ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. వందకు పైగా స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి రోజూ సాయంత్రం సందర్శకుల కోసం కళా ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు.

బాలల రక్షణ కోసమే బాల రక్షా భవన్ ఏర్పాటు : కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : బాలల రక్షణ, వారి పురోభి వృద్ధి కోసమే బాల రక్షా భవన్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ భవన్ ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ బాల రక్షా భవన్ లోని అన్ని గదులను క్షుణ్ణంగా పరిశీలిం చారు. బాలల రక్షణకు అవసరమైన వసతులు ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారు లను ఆదేశిం చారు. బాలల కోసం కావలసిన వస్తువులు, కార్యాలయంకు అవసర మైన కంప్యూటర్లు, ఇతర సామాగ్రి ఏర్పాటుకు నివేదికలు అందజేయాలని మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ అధికారి స్వర్ణలత లేని నాను ఆదేశిం చారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయమండలి, ప్రత్యేక బాలల పోలీసు విభాగం, జాతీయ బాల కార్మిక నిర్మూలనా పథకం, జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్, చైల్డ్ లైన్ అన్నీ కలిపి ఒకే చోట ఇకనుంచి అందు బాటులో ఉంటాయన్నారు. సి డబ్ల్యూసి చైర్‌పర్సన్ భారతీయ రాణి, డిసిడి వో హరికుమారి, సిడబ్ల్యుసి సభ్యులు సుమిత్రాదేవి, షాదిక్ పాషా, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సందీప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల గొంతుకనవుతా

- ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య

లివిశాలాంధ్ర బ్యూరో - మెదక్: శాసనమండలిలో ఉద్యోగ ఉపాధ్యాయ గొంతుక అవుతానని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. మెదక్ జిల్లా కార్యవర్గ సమావేశం మెదక్ లో జరిగింది. మల్క కొమురయ్య మాట్లాడుతూ 317 జీవో స్థానికత సమస్య పరిష్కారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా కూడా ప్రయత్నిస్తానన్నారు. 317 జీవో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, నెలనెలా ప్రమోషన్ లు వచ్చే విధంగా ప్రయత్నిస్తానని, పెండింగ్లో ఉన్న డిఏలను, జిపిఎఫ్ నిధులు వెంటనే విడుదల చేసే విధంగా కృషి చేస్తానని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యలు కేంద్ర ప్రభుత్వ సహకారంతో పరిష్కరించి న్యాయపరమైన ఇతర అడ్డంకులు తొలగించి ఉపాధ్యాయులకు ఎంఈఓ, డైట్ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ ప్రమోషన్లు ఇప్పించ డానికి కృషి చేస్తానన్నారు. నెలవారీ ప్రమోషన్లు స్కూల్ అసిస్టెంట్లు, పీజీహెచ్ ఎంల ప్రమోషన్లు, ఎటువంటి ఖాళీలు లేకుండా ఎప్పటికప్పుడు ప్రమోషన్లు భర్తీ చేసేలా ప్రమోషన్ల క్యాలెండర్ కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రతి సంవత్స రం వేసవి సెలవుల్లో బదిలీలు జరిగేలా కృషి చేస్తాను. ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యా యులకు 010 ద్వారా జీతాలు వచ్చే విధంగా ప్రయత్నిస్తానని, రెసిడెన్షియల్, కేజీబీ సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు. తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, ఆర్పి రామారావు, దుబాషి భాస్కర్, దేశ్ భాస్కర్, మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్, మహిళా సభ్యులు బాల్ శెట్టి, రేఖ, బాధ్యులు వెంకట్ స్వామి, రంగారెడ్డి, నాగిరెడ్డి, నరేందర్ గౌడ్, రాజేశ్వర్, సుమతి, అమరేశ్వరి, శ్రీనివాస్, వినోద్, కృష్ణమూర్తి, శ్రీధర్ రెడ్డి, నందు, లక్ష్మీనారాయణ, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం: దిండిగాల

విశాలాంధ్ర - ఇల్లందు : అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు, మాజీ జిల్లా గ్రంధాలయ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ముట్టడికి తమ పార్టీ నుంచి ఎలాంటి పిలుపు ఇవ్వకపోయినా తప్పుడు సమాచా రంతో తమను పోలీసులు అరెస్టు చేయటం ప్రజాస్వామికమన్నారు. పోలీసులు తనతో పాటు పార్టీ నాయకులు సిలివేరి సత్యనారాయణ, జేకే శ్రీను, అబ్దుల్ నబిలను అక్రమ అరెస్టులు చేసారన్నారు. అసెంబ్లీలో ఇచ్చిన హామీలను నెరవేర్చక ఎన్నికల్లో సైతం ఇచ్చిన హామీలను పక్కన పెట్టినందుకు, నిరంతరం ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండ కొడుతున్నతో పాటు నాయకులను ప్రభుత్వం అరెస్టులు చేస్తుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని రాజేందర్ హితవు పలికారు. ప్రతిపక్ష నాయకులను ఏ విధంగా ఇబ్బంది పెట్టాలో ఎప్పుడు ఎలాంటి కేసుల్లో ఇరికించాలని ధోరణి ప్రభుత్వ మానుకోవాలన్నారు. కేసులు తమకు కొత్తేమీ కాదని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డ బిఆర్ ఎస్ నాయకుల మన్నారు. ప్రభుత్వ ఉడత బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజాక్షేత్రంలో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని ధీమా వ్యక్తం చేశారు.

చైన్ స్నాచింగ్ దొంగలు అరెస్ట్

- 6 తులాల బంగారు పుస్తెల తాళ్లు రికవరీ
- మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: ఆన్లైన్ బెట్టింగ్, చెడు అలవాట్లకు బానిసై ఇటీవలి కాలంలో మెదక్, కామారెడ్డి జిల్లాలో వరుసగా చైన్ స్నాచింగ్ కు పాల్పడుతున్న ఇద్దరు యువ దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు. మంగళవారం మెదక్ డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మొత్తం నలుగురు మహిళల నుండి 12 తులాల బంగారు పుస్తెల తాళ్ళు లాక్కెళ్లారు. హవేలి మరో రెండు చోట్ల చైన్ స్నాచింగ్ కు పాల్పడ్డారు. మెదక్ పట్టణం ఫతేనగర్ కు చెందిన మహమ్మద్ అబ్దుల్ ఖాదీర్, మహమ్మద్ అబ్దుల్ షఫీలు ఈ దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్పీ వివరించారు. హవేలి ఘనపూర్ మండలం ఎక్సెల్ బైక్ పైన భార్య భర్తలు వెళ్తుండగా ముత్తాయికోట కల్లు దుకాణం వద్ద మహిళ మెడలో 3 తులాల బంగారు పుస్తెల తాడు, జక్కన్నపేట శివారులో ఎక్సెల్ బైక్ పైన బార్య భర్తలు వెళ్తుండగా అడ్రస్ అడిగినట్లుచేసి మహిళ మెడలో 3 తులాల బంగారు పుస్తెల తాడు లాకెళ్లారు. బూర్గుపల్లి శివారులో కూడా ఎక్సెల్ పైన భార్య భర్తలు వెళ్తుండగా మహిళ మెడలో నుండి 3 తులాల పుస్తెల తాడు లాక్కెళ్లి హైదరాబాద్ వాల్యూ గోల్డ్ లో అమ్మి 1 లక్ష 94 వేల 130 రూపాయలు తెచ్చుకుని పంచుకున్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం జంగంపల్లి శివారులో మోటార్ సైకిల్ పైన వెళ్తుండగా మహిళ మెడలో 4 తులాల బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లి హైదరాబాద్ వాల్యూ గోల్డ్ లో అమ్మి 2 లక్షల 8 వేల 293 రూపాయలు ఇద్దరు దొంగలు చెరి సగం పంచుకున్నారు. కాగా సోమవారం సాయంత్రం ఔరంగాబాద్ శివారులో వాహనాల తనిఖీలో టిఎస్ 35 2215 యూనికాన్ బైక్ ను ఆపగా పారిపోతుండగా ఇద్దరినీ వెంబడించి పట్టుకొని విచారించగా చేసిన నేరాలు అంగీకరించారు. వారి నుండి 6 తులాల బంగారు పుస్తెల తాళు రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి వివరించారు. మరో స్నాచింగ్ బంగారం రికవరీ చేయనున్నట్లు తెలిపారు. స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు దొంగలకు గతంలో క్రిమినల్ హిస్టరీ లేదన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది రమేష్, కుమార్, జయానంద్, ఎండి. గౌస్, హెూం గార్డు వర ప్రసాద్(లడ్డు)లను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి, హవేలి ఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

మినీ మేడారం జాతర 9 నుండి బస్సులు ప్రారంభం

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : తాడ్వాయి మండలంలోని మినీ మేడారం జాతరకు ఈ నెల 9 నుండి 16 వరకు టిజిఎస్ ఆర్ సి నుండి హన్మకొండ నుండి మేడారంకు 100 బస్సులు 400 ట్రిపులు ఉదయం 6.00 గంటల నుండి నడపబడున్నాయని వరంగల్ రీజనల్ మేనేజర్ విజయభాను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ మేడారం జాతర ఐలాపూర్ కు 9 నుండి 16 వరకు బస్సు నడపడునని, మేడారం నుండి ఐలాపూర్ వయా ఊరట్టం కొండాయి మీదుగా మూడు బస్ లు, మేడారం నుండి ఐలాపూర్ వయా చిన్న బోయినపల్లి కొండాయి మీదుగా మూడు బస్సులు నడుస్తాయన్నారు.ఇట్టి సౌకర్యంను ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. ఆలాగే ప్రయాణికులకు రద్దీకి అనుకూలంగా మరిన్ని బస్సులను కూడా పెంచగలమన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నాం

విశాలాంధ్ర - గార్ల : విద్యుత్ వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు డిఈ విజయ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పోచారం గ్రామంలో విద్యుత్ వినియోగదారుల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన వినియోగదారులతో మాట్లాడుతూ వ్యవసాయ బావుల దగ్గర మోటార్లకు, స్టార్టర్, స్టార్టర్ బాక్సులకు మరిచిపోకుండా ఎర్తింగులు చేయాలని సూచించారు. ఎర్త్ ఉండటం వల్ల అన్నివిధాలా రక్షణ ఉంటుందన్నారు. రైతులు మోటార్లకు తప్పనిసరిగా కెపాసిటర్లు బిగించాలని సూచించారు. గృహ వినియోగదారులు సర్వీస్ వైర్లను ఇనుప రేకులపై, ఇనుప పైపులపై తీసుకెళ్లవద్దని డిఈ స్పష్టం చేసారు. వైర్లకు వాటికి పీవీసీ పైపులు వేసుకోవాలని తెలిపారు. దొంగతనంగా కరెంటు వాడడం చట్టరీత్యా నేరమన్నారు. వ్యవసాయ బావులకి డీడీలు లేని రైతులు కొత్తగా డీడీలు కట్టి వ్యవసాయ కనెక్షన్లు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకంలో ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రజలందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ మధు, లైన్ ఇన్స్పెక్టర్ నరసయ్య, లైన్మెన్లు సమద్, సతీష్, సుధాకర్, రైతులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ ప్రత్యేక హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చర్యలు

విశాలాంధ్ర-న్యూఢిల్లీ: 'యూజెనిక్స్' హెయిర్ సైన్సెస్, హెయిర్ రీస్టోరేషన్‌లో స్వర్ణ ప్రామాణికంగా స్థాపించబడింది. ఇది క్రికెట్ దిగ్గజాలు, అంతర్జాతీయ క్రీడాకారులు, బాలీవుడ్ ప్రముఖుల నమ్మకాన్ని పొందింది. ఢిల్లీ-ఎన్సీఆర్, ముంబై, హైదరా బాదు, భువనేశ్వర్‌లో ఆధునిక క్లినిక్లు ఉన్న యూజెనిక్స్, హెయిర్ ట్రాన్స్ ప్లాం టేషన్ సొల్యూషన్స్‌కు సంప్రధాయ గమ్యం అవుతోంది. ఇది శాస్త్రీయ నిపుణతతో కళాత్మకదక్షతను సమ్మిళితం చేస్తుంది. క్రికెట్ దిగ్గజాలు మోహమ్మద్ షమీ, రవిశాస్త్రి, మహమ్మద్ అజహరుద్దీన్, మైఖేల్ బెవాన్ తమ నమ్మకాన్ని యూజెనిక్స్‌పై ఉంచారు, వారు దీనికి చెందిన ఆధునిక హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సాంకేతికతలు గల ట్రాన్స్ఫర్మేటివ్ శక్తిని యూజెనిక్స్‌గా అనుభవించారు. సహజమైన, సమ్మిళితమైన, దీర్ఘకాలిక ఫలితాలను అందించడానికి ప్రఖ్యాతమైన యూజెనిక్స్, ఇప్పుడు క్రికెట్, దాని బయట ఉన్న ప్రతిష్ఠాత్మక వ్యక్తుల ఎంపికగా మారింది.

టీవీ కమర్షియల్స్‌ను లాంచ్ చేసిన క్యాచ్ స్పైసెస్

విశాలాంధ్ర-న్యూఢిల్లీ: వివిధ రకాలైన వ్యాపారాలు, ప్రముఖ ఎఫ్.ఎమ్.సీ.జి కంపెనీలు పేరు ప్రఖ్యాతులు ఉన్నటువంటి సంస్థ డీఎస్ గ్రూప్ (ధరమ్ పాల్ సత్యపాల్ గ్రూప్). ఇలాంటి ప్రముఖ గ్రూప్‌నకు సంబంధించిన ప్రధాన బ్రాండ్లలో ఒకటి క్యాచ్ స్పైసెస్. ఈ క్యాచ్ స్పైసెస్‌కు సంబంధించి బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్ కుమార్, విలక్షన నటుడు రాజ్ పాల్ యాదవ్‌తో కలిసి సంస్థ కొన్ని టీవీ కమర్షియల్స్‌ను రూపొందించింది. ఈ రెండు కొత్త టెలివిజన్ కమర్షియల్స్ ద్వారా "క్యుంకి ఖానా సిర్ఫ్ ఖానా నహీ హోతా" (ఆహారం అంటే కేవలం ఆహారం మాత్రమే కాదు అంతకు మించి) అనే బ్రాండ్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడం ఈ కమర్షియల్స్ ముఖ్య ఉద్దేశం. ఈ క్రియేటివ్ టీవీ కమర్షియల్స్‌ను డెంట్స్ ఇంటర్నేషన్ రూపొందించింది. క్రోమ్ పిక్చర్స్ లిమిటెడ్ హేమంత్ భండారి దర్శకత్వం వహించారు.

శంషాబాద్ విమానాశ్రయంలో ఎన్‌కామ్ ప్రైవ్ హాస్పిటాలిటీ సేవలు

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రీమియం విమానాశ్రయ సేవలలో అగ్రగామి అయిన ఎన్‌కామ్ హాస్పిటాలిటీ, విమానాశ్రయ అనుభవాన్ని నూతన శిఖరాలకు తీసుకువెళ్తూ శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద తమ ప్రత్యేకమైన ఎయిర్ సైడ్ లాంజ్ ఎన్‌కామ్ ప్రైవ్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ డిపార్చర్స్ టెర్మినల్ మెజ్జనైన్ లెవల్ వద్ద వ్యూహాత్మకంగా ఉన్న ఈ ప్రీమియం లాంజ్ ప్రయాణికులకు ప్రయాణాలను ప్రారంభించే ముందు విశ్రాంతి తీసుకోవడానికి, రీఛార్జ్ చేసుకోవడానికి, రిఫ్రెష్ కావడానికి సౌకర్యవంతమైన, ప్రీమియం వాతావరణాన్ని అందిస్తుంది. సుమారు 885 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ లాంజ్, ఆధునిక ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి రూపొందించిన అనేక సౌకర్యాలను అందిస్తుంది, అన్నీ 24/7 అందుబాటులో ఉన్నాయి. ఎయిర్‌సైడ్ లాంజ్‌లో విశాలమైన సీటింగ్ ప్రాంతాలు, హై-స్పీడ్ వై-ఫై, ప్రతి ప్రయాణీకుని అవసరాలను తీర్చడానికి వివిధ రకాల భోజన ఎంపికలు వంటి ప్రపంచ స్థాయి సౌకర్యాలను అతిథులు ఆస్వాదించవచ్చు.

బీకేసీ శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ స్టోర్‌లో గ్యాలక్సీ ఎస్25 సిరీస్ డెలివరీల రికార్డు

విశాలాంధ్ర-గురుగ్రామ్: బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లోని శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ స్టోర్ కొత్త గ్యాలక్సీ ఎస్25 సిరీస్ విజయాన్ని ప్రత్యేక కార్యక్రమంతో జరుపుకుంది. ఇందులో డివైజుల ముందస్తు పంపిణీని ప్రారంభించి, ఇక్కడ 700 మందికి పైగా వినియోగదారులకు ఫోన్లు అందజేశారు. ఈ రికార్డ్ డెలివరీ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్ సిరీస్ ప్రీ-ఆర్డర్ల కోసం విపరీతమైన ప్రతిస్పందనను అనుసరిస్తూ, అత్యంత ఆకట్టుకునే అంశంగా నిలిచింది. సూన్ చోయ్, కార్పొరేట్ ఈవీపీ/హెడ్ ఆఫ్ డివిజన్, ఎంఎక్స్ డివిజన్, శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్, గ్యాలక్సీ ఎస్25 పరికరాలలో కొన్నింటిని ముందుగా ఆర్డర్ చేసిన కస్టమర్‌లకు వ్యక్తిగతంగా అందజేయడానికి స్టోర్‌కు వచ్చారు. ఈ గాలా ఈవెంట్ స్టోర్ ఒక సంవత్సరం వార్షికోత్సవాన్ని కూడా జరుపుకుంది, ఇది ప్రత్యేకమైన క్యూరేటెడ్ అనుభవాలు, నిజ జీవిత దృశ్యాల ద్వారా శామ్‌సంగ్ టాప్-ఆఫ్-ది-లైన్ ప్రీమియం ఉత్పత్తులను ప్రదర్శించడానికి ప్రసిద్ధి చెందింది.

'ఫాంటా మాంగ్తా' ప్రచారంలో కార్తిక్ ఆర్యన్

విశాలాంధ్ర-న్యూఢిల్లీ: ఫాంటా, కోకా-కోలా ఇండియాకు చెందిన ప్రజాదరణ పొందిన పానీయ బ్రాండ్, ఆకట్టుకునే బ్రాండ్ అంబాసిడర్ కార్తీక్ ఆర్యన్‌తో 'ఫాంటా మాంగ్తా' అనే కొత్త ప్రచారంతో తిరిగి వచ్చింది. ఈ ప్రచారం జెన్ జెడ్ వారి మక్కువను ప్రతిబింబిస్తూ, అవి ఇష్టపడే అంశాల అన్వేషణను జరుపుకుంటుంది. ఎందుకంటే ఒకసారి మీరు ఇంత రుచికరమైనదాన్ని కోరుకున్నప్పుడు, ఇక వేరే దానిని ఊహించలేరు. దశాబ్దాలుగా, ఫాంటా కేవలం ఒక పానీయం మాత్రమే కాదు- ఇది ప్రకాశవంతమైన, ఆహ్లాదకరమైన, రుచికరమైన మరియు సువాసనతో నిండిన అనుభూతి. సంకోచం లేకుండా ఆనందాన్ని స్వీకరించే వారికి ఇది ఎల్లప్పుడూ తొలి ఎంపికగా నిలుస్తుంది. ఈ ప్రచారంతో, బ్రాండ్ కోరికల మేజిక్‌లో లోతుగా మునిగిపోతుంది. 'ఔర్ కుచ్ నహీ మంగ్తా, సిర్ఫ్ ఫాంటా మంగ్తా' అనే ఆలోచనకు జీవం పోస్తూ, ప్రచార చిత్రం స్క్రిప్ట్‌ను తృప్తిగా ప్రదర్శిస్తుంది.

మాజా కొత్త ప్రచారం

విశాలాంధ్ర-న్యూఢిల్లీ: భారతదేశం అత్యంత ఇష్టపడే మామిడి పానీయం మాజా లక్షలాది మామిడి ప్రేమికులకు ఇష్టమైన ఎంపికగా ఉంది. ప్రతి సిప్‌లో మామిడి పండ్ల ఆనందాన్ని అందిస్తోంది. నిజమైన జ్యూసీ అల్ఫోన్సో మామిడి పండ్లతో తయారు చేయబడింది. మాజా తాజా ప్రచారం, 'మాజా హెూ జాయే,' కోకా-కోలా ఇండియా స్వదేశీ బ్రాండ్, వేడుకలను పునర్నిర్వచిస్తోంది. ఈ ప్రచారం శక్తివంత మైన సాంస్కృతిక అంతర్దృష్టిలో లోతుగా పాతుకుపోయింది: భారతదేశం దాని గొప్ప వేడుకలు, విస్తృతమైన మైలురాళ్లకు ప్రసిద్ధి చెందినప్పటికీ, మన రోజువారీ జీవితాలను రూపొందించే చిన్న విజయాలు తరచుగా గుర్తించబడవు. ఈ క్షణాలు గర్వాన్ని కలిగించే నిశ్శబ్ద భావాన్ని కలిగి ఉంటాయి, కానీ చాలా అరుదుగా తగిన గుర్తింపును పొందుతాయి. మాజా ఈ చిన్న వేడుకలకు పర్ఫెక్ట్ ట్రీట్‌గా ఉంటూ, సాధారణ సందర్భాలను అసాధారణమైన అనుభూతిగా మార్చుతుంది.

జీఈ ఏరోస్పేస్ ఫౌండేషన్ నెక్స్ట్ ఇంజినీర్స్ కార్యక్రమం విస్తరణ

విశాలాంధ్ర-బెంగళూరు:ఇంజనీరింగ్‌లో కెరీర్‌లను కొనసాగించడానికి యువతను ప్రోత్సహించే ప్రోగ్రామ్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, జీఈ ఏరోస్పేస్ ఫౌండేషన్ తమ నెక్స్ట్ ఇంజనీర్స్ కాలేజ్ రెడినెస్ కార్యక్రమాన్ని భారతదేశంలోని బెంగళూరుకు విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. నెక్స్ట్ ఇంజనీర్స్ విస్తరణ భారతదేశంలో బలమైన ఇంజనీరింగ్ పైప్‌లైన్‌ను నిర్మించడంలో సహాయపడుతుంది. నేటి ప్రకట నతో, జీఈ ఏరోస్పేస్ ఫౌండేషన్, బెంగళూరు సౌకర్యంలోని నాయకత్వం, వాలం టీర్లతో కలిసి, 2025 చివరిలో ప్రకటించబడే విద్యా భాగస్వామిని గుర్తించడంలో ముందుకు సాగుతారు. "భారతదేశంలో GE ఏరోస్పేస్, గత 25 సంవత్సరా లుగా విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తూనే, పరిశ్రమకు కొత్త సాంకేతికతలకు తీసుకు వస్తూనే మద్దతు ఇస్తోంది" అని GE ఏరోస్పేస్ యొక్క ఇండియా టెక్నాలజీ సెంటర్‌లో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అలోక్ నందా అన్నారు.

గణితంపై ఎప్సిలాన్ ఇండియా క్యాంప్

విశాలాంధ్ర- ముంబయి: అత్యంత ఉత్సాహభరితమైన గణిత అభ్యాసకుని నుండి అసాధారణ గణిత మేధావికి ప్రయాణం కేవలం ఒక శిబిరం దూరంలో ఉంది. ఈ వేసవిలో, ఎప్సిలాన్ ఇండియా క్యాంప్ 9 నుండి 13 సంవత్సరాల వయస్సు గల విద్యార్థుల కోసం గణితాన్ని సరదాగా, ఆసక్తికరంగా నేర్చుకోవడానికి ఒక అద్భుతమైద అవకాశాన్ని అందించడానికి సమ్మర్ క్యాంప్‌తో తిరిగి వస్తుంది. రైజింగ్ ఎ మ్యాథమెటీషియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఎప్సిలాన్ ఇండియా ఒక రెసిడెన్షియల్ సమ్మర్ క్యాంప్. ఇది వ్యక్తిగత, సామాజిక అభివృద్ధిని కలిపి, అధునాతన గణిత విద్య ద్వారా గణితశాస్త్రంలో ప్రతిభావంతులైన విద్యార్థులను శక్తివంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎప్సిలాన్ యూఎస్ఏ, మ్యాథ్‌పాత్, మరియు మ్యాథ్‌క్యాంప్‌ల వ్యవస్థాపకుడు, ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు డాక్టర్ జార్జ్. థామస్ 2011లో యూఎస్ఏలో స్థాపించిన గౌరవనీయమైన ఎప్సిలాన్ క్యాంప్ నుంచి ఎప్సిలాన్ ఇండియా ప్రేరణ పొందింది.

సంపాదకీయం

ఆ గొంతుక ఆయనదే!

ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో జాతుల మధ్య హింసకు ఆ రాష్ట్ర సీఎం బీరేన్ సింగ్ ప్రేరేపించారంటూ లీకైన ఆడియో క్లిప్‌పై హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ట్రూత్ ల్యాబ్స్ ఇచ్చిన ఫోరెన్సిక్ నివేదిక సంచలనం రేపుతోంది. మొయితీలను తుపాకులు దోచుకోనివ్వండి అంటూ ఆదేశాలిస్తూ ఆడియోలో ఉన్న గొంతుక మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌దేనని ట్రూత్ ల్యాబ్ నివేదిక పేర్కొంది. రాష్ట్రంలో మొయితీలు, కుకీల మధ్య హింసాకాండ ప్రారంభమై 21 నెలలు అయింది. అధికారిక అంచనాల ప్రకారమే ఇంతవరకు దాదాపు 300మంది మరణించారు. పరిపాలనలో విఫలమైన ఆయనను మార్చడానికి మోదీ–అమిత్ షా ద్వయం ససేమిరా అంటోంది. మహిళల మీద అత్యాచారం చేసి వారిని నగ్నంగా ఊరేగించడం వంటి హేయమైన చర్యలు చోటుచేసుకుంటున్నా సీఎం బీరేన్ సింగ్ పరిస్థితిని అదుపు చేయలేకపోయారనడం కన్నా దగ్గరుండి ప్రోత్సహించారనడానికి ఇటువంటి ఆడియో క్లిప్పింగ్‌లు ప్రత్యక్ష ఆధారాలు. హింసను ప్రేరేపించేలా ఆయన మాట్లాడారన్న విమర్శలు ఉన్నాయి. ఈ హింసాకాండలో ఆయన పాత్రకు సంబంధించి కొన్ని ఆడియో క్లిప్స్ ఇప్పటికే బయటకు వచ్చాయి. ఆడియోలో ఉన్న గొంతుక సీఎందేనన్న ట్రూత్‌ల్యాబ్ నివేదికతో బీరేన్ సింగ్ గొంతుకలో పచ్చివెలక్కాయపడినట్లైంది. ఇప్పుడు సీఎం ఏంచెపుతారో వేచిచూడాలి. మణిపూర్ హింసకు సంబంధించి "ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధాలను లూటీ చేసేందుకు మొయితీలకు అవకాశమివ్వండి" అంటూ ఆదేశించే ఆడియో క్లిప్ కొద్ది రోజుల క్రితం వైరల్ అయింది. ఈ క్లిప్‌లోని ఆడియోతో బీరేన్ సింగ్ గొంతు 93% వరకు సరిపోలుతోందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రైవేటు ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ అయిన ట్రూత్ ల్యాబ్స్ నివేదిక ఇచ్చింది. ఆడియోలో గొంతుక, సీఎం గొంతుక ఒక్కటే అనేందుకు ఎక్కువ అవకాశం ఉందని తెలిపిన ఆ నివేదికను సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టుకు సమర్పించారు. జ్యుడిషియల్ కమిషన్‌కు సమర్పించిన క్లిప్‌లలో బీరెన్‌సింగ్‌కు చెందినదిగా చెపుతున్న గొంతు ప్రామాణికతను ధృవీకరించటంపై ఈ ప్రైవేటు ల్యాబ్ పరిశీలించింది. సీఎం అధికారిక ప్రాంతాల నుంచే ఈ ఆడియో రికార్డు చేసినట్టు ఆడియోను బయటపెట్టిన వారు వాంగ్మూలం ఇచ్చారు. ఈ ఆడియోకు సంబంధించి ఒక కాపీని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గతేడాది మే 3న మణిపూర్ హింసాకాండపై ఏర్పాటు చేసిన జ్యుడిషియల్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ అజరు లంబాకు కూడా అందజేశారు. ఆడియో టేప్ విషయంలో కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ (కేఓహెచ్‌యూఆర్) సుప్రీంకోర్టు మెట్లు ఎక్కింది. గత ఏడాది నవంబరు 8న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆడియో టేప్‌లోని గొంతు ప్రామాణికతను పరిశీలించి, కోర్టుకు నివేదిక సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పిటిషనర్ తరఫున న్యాయవాది అయిన ప్రశాంత్ భూషణ్ ట్రూత్ ల్యాబ్ సేవలను కోరారు. ఈ ఆడియో టేప్‌ను పరిశీలించి ల్యాబ్ ఇచ్చిన ఫోరెన్సిక్ నివేదిక ప్రతిని జత చేస్తూ ప్రశాంత్ భూషణ్ గతనెల 22న సుప్రీంకోర్టులో సప్లిమెంటరీ అఫిడవిట్‌ను దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఈ కేసు విచారణ చేపట్టింది. కేంద్రం, మణిపూర్ సర్కారు తరఫున వాదనలను వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఎప్పటిలాగానే ఈ నివేదికపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆడియోటేప్‌ను ప్రభుత్వానికి చెందిన కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(సీఎఫ్‌ఎస్‌ఎల్) పరిశీలన జరగాలని, మూడు వారాల గడువు కావాలని కోరారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణను మార్చి 24కు వాయిదా వేసింది. సమగ్ర నివేదికను సీల్డ్ కవర్‌లో అందజేయాలని సీఎఫ్‌ఎస్‌ఎల్‌ని ధర్మాసనం ఆదేశించింది.

మణిపూర్‌లోని ఇంఫాల్ లోయలో నివసించే మెజారిటీ ప్రజలు, చుట్టుపక్కల కొండల నుంచి కుకి–జో గిరిజన సమాజానికి మధ్య 2023 మే3న జాతి హింస చెలరేగింది. ఈ హింసలో గత ఏడాది మే 3వ తేదీ నాటికి ప్రభుత్వ గణాంకాల ప్రకారం 221 మంది మరణించారు. దాదాపు 60వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఆ సంఖ్య ఇప్పటికి భారీగానే పెరిగింది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అసమర్థత, బాధ్యతను పూర్తిగా విస్మరించిన ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉదాసీనతవల్లే మణిపూర్ గత 21 నెలలుగా అగ్నిగుండంగా మారిందనడంలో ఎటువంటి అనుమానంలేదు. మణిపూర్‌లో పరిస్థితిని చక్కదిద్దడానికి మోదీ సర్కారు ఇంతవరకు చేసింది శూన్యం. ఇదంతా ఏదో పరాయి దేశంలోనో, మనకు సంబంధం లేని వ్యవహారంగానో మాత్రమే మోదీ సర్కారు భావించడం అత్యంత విచారకరం. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కంటితుడుపు చర్యగా ఒక్క సారి మణిపూర్ వెళ్లివచ్చారు. కానీ ఘర్షణ పడుతున్న మొయితీ, కుకీల ప్రతినిధులతోగానీ, హింసతో అల్లాడుతున్న సామాన్య ప్రజలతోగానీ ఆయన మాటకూడా మాట్లాడలేదు. బాధితులను కనీసం పరామర్శించిన దాఖలాలు కూడాలేవు. అతిథి గృహంలో కూర్చుని కొంతమంది ఉన్నతాధికారులను పిలిపించి పరిస్థితిని సమీక్షించా ననిపించుకుని ఢిల్లీ వెళ్లిపోయారు. ప్రధానమంత్రి మోదీ ప్రపంచ దేశాలూ తిరుగుతున్నారు కానీ సంవత్సరం తొమ్మిది మాసాలుగా హింసతో అట్టుడుకుతున్నా రాష్ట్రాన్ని సందర్శించాలన్న ఆలోచనే మోదీకి రాలేదు సరికదా హింసపై కనీసం నోరు మెదపలేకపోతున్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నిలిపివేయిస్తానని ప్రగల్భాలు పలుకుతున్న మోదీ సొంత దేశం మణిపూర్‌లో రగులుతున్న కాష్టాన్ని ఆర్పివేయడానికి చర్యలు తీసుకునేందుకు ఎందుకో సాహసించలేకపోతున్నారు. మణిపూర్ మండి పోతుంటే ఇంత ఘోరంగా నిష్క్రియాపరత్వం ప్రదర్శించడం మోదీకి, అమిత్ షాకే చెల్లింది. హింస చెలరేగిన వెంటనే పరిస్థితిని కట్టడి చేయాలని అమిత్ షాకే కాక రాష్ట్రపతికి కూడా గవర్నర్ మొరపెట్టుకున్నారు. రాష్ట్ర గవర్నరుగా అనసూయ ఉన్నప్పుడు ఆమె ఢిల్లీ వెళ్లి అక్కడి పరిస్థితిని అమిత్ షాకు వివరించారు. రాష్ట్రపతిని కలుసుకుని పరిస్థితిని వివరిస్తూ కంటతడి కూడా పెట్టుకున్నారు. అయినా ఎన్డీయే ప్రభుత్వ నేతల మనసు కరగలేదు. డబుల్ ఇంజన్ సర్కారు ఉంటే ఏ రాష్ట్రమైనా త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని, శాంతి భద్రతలు సుస్థిరంగా ఉంటాయని ఊదరగొడుతున్న మోదీ ప్రభుత్వం మణిపూర్‌ను ఎందుకు పట్టించుకోవడంలేదో వారికే తెలియాలి. రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిరక్షించడానికీ, రాజకీయ పరిష్కారం కనుగొనడానికి మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇక్కడ నెలకొన్న విధ్వంసం గతంలో కనీ, వినీ ఎరగనిదని, ఈ చిచ్చును చల్లార్చడానికి రాజకీయ, పరిపాలనా పరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్‌చేస్తున్నా మోదీ ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తొలగించాలని ఎంతోమంది చెప్తున్నా కాషాయపార్టీ నిమ్మకునీరెత్తినట్టు ఉండడం అత్యంత విచారకరం. హింసను రెచ్చగొట్టారన్న ఆడియోలలో గొంతుక బీరేన్ సింగ్‌దేనని నివేదికలు వచ్చిన నేపథ్యంలోనైనా మోదీ సర్కార్ చర్యలు తీసుకుంటుందని ఆశించడం అత్యాశే అవుతుంది.

మేడి పండు అమెరికా!

బొల్లిముంత సాంబశివరావు

ఆకాశాన్నంటే భవనాలు, బహుళజాతి సంస్థలు, మంచి ఉద్యోగాలు, భారీ వేతనాలు, అద్భుతమైన జీవితంగా అమెరికా గురించి మధ్య తరగతి జీవుల ఊహాలు. అక్కడి పరిస్థితులు ఈ ఊహలకు భిన్నంగా ఉన్నాయి. అక్కడి పేదరికం, సంపద కేంద్రీకరణ, అప్పులు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉద్యోగుల తొలగింపు ఆ దేశ వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతోంది దాని మేడి పండు స్వభావం. భూతల స్వర్గంగా ప్రచారం చేస్తున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇతర దేశాలపై ఆధారపడి కొనసాగుతున్నది. ప్రపంచంలో ఏ దేశంలో లేని సంపద అసమానతలు అమెరికాలో ఉన్నాయి. ఇది 1920 నుంచి ఎన్నడూ లేనంత స్థాయిలో ఉంది. గత 30 సంవత్సరాల్లో అగ్రశ్రేణి 1 శాతం ప్రజల సంపదలో 21 ట్రిలియన్ల (1 ట్రిలియన్ లక్ష కోట్లు) డాలర్లు పెరిగితే, దిగువ సగం మంది ప్రజలు 9 వందల బిలియన్ల డాలర్ల సంపదను కోల్పోయారు. ఐరోపా కన్నా అమెరికాలో ధనిక, పేదల మధ్య అంతరం వేగంగా పెరిగిందని ఇంపీరియల్ కాలేజీ బిజినెస్ స్కూల్లో ఫైనాన్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అధ్యయన ప్రధాన రచయితలలో ఒకరైన డాక్టర్ క్లారా మార్టినెజ్–టోలెనాడో

తెలియజేశారు. 1980 నుంచి సంపద అంతరం కొనసాగుతుంది. అమెరికాలోని అగ్రశ్రేణి 1శాతం వారి సంపద ఐరోపా కంటే ఎక్కువ పెరిగింది.

2019 లెక్కల ప్రకారం, అమెరికాలో 10.5 శాతం మంది పేదలు ఉన్నారు. ది జర్నల్ ఆఫ్ ది అమెరికన్ మెడికల్ అసోషియేషన్ ప్రచురించిన 2023 అధ్యయనం ప్రకారం అమెరికాలో పేదరికంతో సంవత్సరానికి దాదాపు 3 లక్షల మంది మరణిస్తున్నారు. పేదరికంలో ఉన్న పిల్లలు యుక్త వయస్సులో తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అమెరికా ఆహార ధాన్యాలను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నా, ఆ దేశంలో ప్రజలు తీవ్ర ఆహార సమస్యను ఎదుర్కొంటున్నారు. 2023లో దాదాపు 13.5శాతం కుటుంబాలు ఆహార అభద్రతలో ఉన్నాయి. 2019లో జరిగిన అధ్యయనంలో గ్రాడ్యుయేట్ లోపు విద్యార్థులలో 40శాతం మంది ఆహార అభద్రతలో ఉన్నారు. కోవిడ్–19 సమయంలో అమెరికా కుటుంబాలకు ఆహార అభద్రత రెట్టింపు అయ్యింది. ఇది చిన్న పిల్లలు ఉన్న కుటుంబాల్లో అధికంగా ఉంది. 2020 నవంబరులో సేకరించిన హౌస్ హోల్డ్ సర్వే డేటా ప్రకారం 2.6 కోట్ల మంది వయోజనులు (అంటే వయోజన జనాభాలో 12శాతం) వారం రోజులు ఆహార కొరతను ఎదుర్కొన్నారు.

అమెరికాలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. 2023లో నిరుద్యోగ రేటు 3.9శాతం ఉంటే, 2024లో 4.1 శాతానికి పెరిగింది. లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. 2001 నుంచి 2019 వరకు ప్రతి సంవత్సరం 2 కోట్లకు పైగా ఉద్యోగులను తొలగించారు. 2020 మార్చి, ఏప్రిల్ నెలల్లో కోవిడ్ కారణంగా రికార్డు స్థాయిలో తొలగింపులు జరిగాయి. ప్రస్తుతం అమెరికాలో నిరుద్యోగ భృతి ప్రయోజనం పొందుతున్నవారు 18లక్షల, 70 వేలమంది. 2024 డిసెంబరులో కొత్తగా నిరుద్యోగ భృతి కోరుతూ 2లక్షల, 20 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అమెరికా వ్యవసాయ నివేదిక ప్రకారం, 2022తో పోలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు 11శాతం పైగా పెరిగాయి. గుడ్డు ధర 4.8శాతం, బీఫ్ 3శాతం కంటే ఎక్కువ పెరిగింది. వాటర్ గైడ్స్ చేపట్టిన సర్వేలో నిత్యావసరాలకోసం అవుతున్న ఖర్చులు తమ జీవితాలను తారుమారు చేస్తున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల తొలగింపు, కొత్త ఉద్యోగాలు రాకపోవటంతో చేతిలో చిల్లిగవ్వ ఉండటంలేదని, ఆర్థిక వత్తిడితో మానసిక వత్తిడికి గురౌతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువకుల్లో ఈ వత్తిడి తీవ్ర స్థాయిలో ఉంది.

దేశ అప్పులు: అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎంత డొల్లతనమో దాని అప్పులే తెలియ చేస్తున్నాయి. తాజా లెక్కల (27-9-24 వరకు) ప్రకారం అమెరికా చేసిన అప్పులు 36 ట్రిలియన్ (36 లక్షల కోట్ల డాలర్లు) డాలర్లు. భారత కరెన్సీలో 3,035 లక్షల కోట్ల రూపాయలు. 2024లోనే 2లక్షల డాలర్ల అప్పు చేసింది. ఈ అప్పుల ఫలితంగా అమెరికాలోని ప్రతి పౌరుని పైనా 91 లక్షల రూపాయల అప్పు ఉంది. కొన్ని దశాబ్దాలుగా అమెరికా అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. 2000 సంవత్సరం నాటికి 5.7 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉండగా 2024 36 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రపంచంలోని అనేక దేశాల ఆర్థిక వ్యవస్థల మొత్తం విలువ కన్నా అమెరికా అప్పులే ఎక్కువ.

సెల్: 9885983526

ఆప్, బీజేపీ మధ్య సైద్ధాంతిక పోరాటం!

బీ.కె. కాంగో

> వాస్తవమైన జాతీయవాదం కోసం నిజంగానే సైద్ధాంతిక పోరాటం మొదలైంది. ఇండియా, స్వాతంత్ర్య పోరాటం కలిసి పురోగమన జాతీయవాదం. మతం, కులం, రంగు, భాషతో నిమిత్తంలేని సామాన్య భారతీయులు తాము ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుకున్నప్పుడు గొప్ప దేశంగా ఆవిర్భవిస్తుంది.

ఇటీవల ఆప్ అధినేత కేజ్రీవాల్ తమకు, బీజేపీకి మధ్య సైద్ధాంతిక పోరాటం ఉందని అన్నారు. పోరాటం జరుగుతుందని చెప్పారేగానీ, అది ఎలా జరుగుతుందో, ఏమిటో చెప్పలేదు. పన్నుల ద్వారా వచ్చే డబ్బును తాము, బీజేపీ ఎలా ఖర్చు చేస్తాయో తెలిపారు. ఆప్ సామాన్య ప్రజలకు ఖర్చు చేస్తుందని, బీజేపీ సంపన్నులకు ఖర్చు చేస్తుందని తెలిపారు. అయితే అసలు సమస్యను చెప్పడంలో కేజ్రీవాల్ విఫలమయ్యారు.

ఆర్‌ఎస్‌ఎస్ అధినేత భగవత్ 2023లో స్వాతంత్ర్యాన్ని పొందామని అన్నారు. రామమందిరం నిర్మించినప్పుడే స్వాతంత్ర్యం పొందారట. వాస్తవమైన సైద్ధాంతిక పోరాటం జాతీయతావాదం (స్వాతంత్ర్య పోరాటం)పై బీజేపీ చేపట్టలేదు. బీజేపీ నాయకురాలు కంగనా రనౌత్ ఒక దశలో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా పదవిని చేపట్టిన 2014లోనే వాస్తవమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఇలా బీజేపీ నాయకులు ఎవరికి ఇష్టంవచ్చినట్లు వారు మాట్లాడుతున్నారు. స్వాతంత్ర్య పోరాటమే ఎరుగని వీరు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నట్లు అబద్ధాలాడటంలో పైచేయి సాధించారు. ఇండియా అనే భావన సమ్మిళిత జాతీయవాదం. పురోగామిశక్తులు నిర్వచించినట్లుగా ఇండియా బ్రిటీష్ పాలకులతో మహత్తరపోరాటం జరిపిన అనంతరం 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యాన్ని సాధించింది. బ్రిటీష్ వారు తాము అనుసరించే విభజించు పాలించు విధానంతో ఆర్‌ఎస్‌ఎస్, హిందూ మహాసభలను ప్రోత్సహించారు. అంతిమంగా స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశాన్ని పాకిస్థాన్, ఇండియాగా విభజించారు. పాకిస్థాన్ ముస్లిం దేశంగా ఏర్పడింది.

భారతదేశ ప్రజలు స్వాతంత్ర్య పోరాటం జరిపి బానిస సంకెళ్లనుంచి విముక్తిని సాధించారు. అయితే ఏ మతం, కులం, రంగు, భాషను స్వాతంత్ర్యానికి నిర్వచనంగా తీసుకోలేదు. అందువల్లనే ఇండియా రాజ్యాంగం, ఈ దేశం మతం, కులం, రంగు, వర్గంతో నిమిత్తం లేకుండా ప్రజలందరిదీ అని ప్రకటించింది. ఏ ఒక్క నాయకుడు లేదా పార్టీ మూలంగా స్వాతంత్ర్యం పొందలేదు. దేశప్రజలు పురోగామిశక్తులు, నాయకులు జరిపిన పోరాటమే స్వాతంత్ర్యం సిద్ధించడానికి కారణం. స్వాతంత్ర్య పోరాటాన్ని ఆర్‌ఎస్‌ఎస్, హిందు మహాసభ, ముస్లిం లీగ్ వ్యతిరేకించాయి. విభజన అనంతరం వీరు స్వల్ప సంఖ్యాకులే అయ్యారు. స్వాతంత్ర్యానికి మహాత్మాగాంధీ నడుంకట్టి పోరాడారు. ఈ నేపథ్యంలో ఆయనను హత్యగావించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. హిందు ఛాందసవాదుల్లో ఒకరైన నాథూరామ్ గాడ్సే గాంధీ మహాత్ముడిని హతమార్చాడు. ఆర్‌ఎస్‌ఎస్ ఆ సంస్థ నియమించిన దుండగులు మహాత్ముడిని పొట్టనబెట్టు కున్నారు. మితవాదశక్తులు ఇండియాపై పోరాటం చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం నూతనతరం స్వేచ్ఛా భారత దేశంలో జన్మించారు. వీరు స్వాతంత్ర్య పోరాటాన్ని ఏమాత్రం ఎరుగరు. తమకు గుర్తింపు కావాలని కోరుకునే రాజకీయాల కాలంలో ఈ తరం పెరిగింది. భయం, ద్వేషం, తప్పుడు అభిప్రాయాలు, ఛాందసవాద పునరుద్ధరణను లేదా మితవాద శక్తులకు మద్దతుతెలిపే పెట్టుబడీదారీ విధానం సంక్షోభంలో ఉంది. ఈ పరిస్థితిని చాలా చాకచక్యంగా ఆర్‌ఎస్‌ఎస్, మితవాదశక్తులు కలిసి దేశ అధికారాన్ని చేజిక్కించుకున్నాయి.

అధికారాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత వారు అనుసరించిన ఇదే విధానాలను అనుసరించకుండా నిరోధించడానికి రాజ్యాంగాన్ని, దాని విలువలను దిగజార్చేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. అన్ని ప్రభుత్వ సంస్థలలో జోక్యం చేసుకునేందుకు, మీడియాను లోబరుచుకునేందుకు ప్రజాస్వామ్యం గొంతు నులిమేందుకు అన్ని విధాలుగా ప్రయత్నించి చాలావరకు సాధించారు. పైగా ప్రతిపక్షాలను జాతీయ వ్యతిరేకులుగా తూలనాడుతున్నారు. మరోవైపు ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపి విమర్శించడాన్ని జాతి వ్యతిరేకులుగా పరిగణిస్తు న్నారు. ప్రగతిశీల, మానవీయ, ప్రజాస్వామ్య శక్తులను అర్బన్ నక్సల్స్ అని ఆరోపణలు చేస్తున్నారు. పెట్టుబడీదారీ, ఉన్నతవర్గాలను ప్రాచీన ఉన్నత వర్గాలను, కులాలను, మత గ్రూపులను రక్షించేందుకు దేశతిరోగమన యంత్రాంగాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో "బీజేపీని ఓడించండి, రాజ్యాంగాన్ని కాపాడండి" అన్న నినాదం ప్రముఖంగా ప్రజలలో విస్తరించింది. అయితే పార్లమెంటరీ ఎన్నికల సందర్భంగా "అబ్‌కి బార్ చార్ సౌ పార్" బీజేపీ నినాదంగా మరింత ముందుకు వచ్చింది. బీజేపీ ఏనాడూ 400 సీట్లను గెలుచుకోలేదు. గెలుచుకోవడం కూడా సాధ్యం కాకపోవచ్చు. 400 సీట్లు గెలుచుకుని రాజ్యాంగాన్ని మార్పు చేస్తామని కర్నాటక బీజేపీ నాయకుడు అనంతకుమార్ హెగ్డే స్పష్టంగా చెప్పారు. అంతిమంగా ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సీట్లను కూడా గెలవలేకపోయారు. ఫలితంగా బీజేపీ ఆటలు సాగలేదు. తమ నినాదం విఫలమైనందున ఇప్పుడు రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నామని, రాజ్యాంగ ప్రధాన నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను ప్రశంసిస్తున్నామని చెబుతున్నారు. అయితే ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన ప్రకటన ఆర్‌ఎస్‌ఎస్ అసలు స్వరూపాన్ని బైటపెట్టింది. కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యానాలు అంబేద్కర్‌ను అవమానించాయి. వాస్తవమైన జాతీయవాదం కోసం నిజంగానే సైద్ధాంతిక పోరాటం మొదలైంది. ఇండియా, స్వాతంత్ర్య పోరాటం కలిసి పురోగమన జాతీయవాదం. మతం, కులం, రంగు, భాషతో నిమిత్తంలేని సామాన్య భారతీయులు తాము ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుకున్నప్పుడు గొప్ప దేశంగా ఆవిర్భవిస్తుంది. స్వాతంత్ర్యం సిద్ధించిన సమయం అర్ధరాత్రి మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రసంగంలో "భవిష్యత్తుతో సమాగమం" అని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దానికి సంబంధించిన సంస్థ ఈ ప్రసంగాన్ని వ్యతిరేకించాయి. మహాత్మాగాంధీని హత్యగావించిన తర్వాత ఆర్‌ఎస్‌ఎస్‌పైన నిషేధం విధించారు. అయితే నిషేధాన్ని తొలగింపచేసుకునేందుకు తాము రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ఒక హామీ పత్రాన్ని రాసిచ్చారు. అయితే ఏ రోజూ దాన్ని పాటించలేదు. రాజ్యాంగ విలువలను గౌరవించలేదు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయాలపైన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయలేదు. ఇప్పుడు దేశ అధికారాన్ని సాధించుకున్న తర్వాత మత అజెండాతో తమ ప్రణాళికల అమలుకు పూనుకున్నారు. ఛాందసవాదులు వారికి సహాయపడుతున్నారు. ప్రపంచ రంగంపై మితవాదశక్తులు ఇప్పుడు ప్రముఖంగా పనిచేస్తు న్నాయి. వీటిని అర్థంచేసుకునేందుకు తర్కవాదం అవసరం. పెట్టుబడీదారీ వ్యవస్థ సంక్షోభ ప్రభావం, ఛాందసవాద శక్తులు ఐకమత్య, రాజ్యాంగ వ్యతిరేకత నేడు ప్రధానంగా కనిపిస్తున్నాయి. సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు సమాజం అంతరించిన తరువాత ఆ దేశంలో అనేక రాష్ట్రాలు కూడా విడిపోయాయి. ఆ రాష్ట్రాలు స్వతంత్రంగా వ్యవహరిస్తూ సోషలిస్టు విధానాలను అనుసరించకపోవడంతో తిరోగామిశక్తులు అధికారాన్ని చేపట్టడానికి వీలుకలిగింది. ప్రజాస్వామ్య వ్యతిరేక అణచివేత రాజ్యాధికారం, మితవాద, ఛాందసవాద శక్తులు అత్యంత తీవ్రంగా పనిచేస్తున్నాయి. ఇవి ప్రజావ్యతిరేకంగా ఉన్నాయి. ప్రజలను గందరగోళపరచేందుకు అతివాద జాతీయతను, మతోన్మాదాన్ని అనుసరిస్తున్నాయి. 20వ శతాబ్దిలో పెట్టుబడిదారీ అణచివేత శక్తులకు 21వ శతాబ్దంలో ఆధిపత్యం చెలాయించే తిరోగామి శక్తులకు మధ్య తేడా ఉంది. దీన్ని ఫాసిస్టుశక్తిగా భావించవచ్చు. ఫాసిస్టుశక్తుల పోకడలను ఓడించేందుకుగాను ప్రజాస్వామ్య, సెక్యులర్, సోషలిస్టు ఇండియా రాజ్యాంగ కీలక విలువలు, విశాల ఐక్యత ఏర్పడేందుకు సహాయపడవలసి ఉంటుంది.

సాయుధ పోరాట సేనానులు - 7

ఆర్వీ రామారావ్

ఆరుట్ల రామచంద్రా రెడ్డి తెలంగాణా సాయుధ పోరాటంలో ఓ బెబ్బులి. ఆయన ఒక అగ్ని శిఖ. తెలంగాణా ప్రజల జీవితాలను బుగ్గి చేసిన నిజాం పాలనను, భూస్వామ్య దోపిడీని అరికట్టడానికి జరిగిన సాయుధ పోరాటంలో రామచంద్రారెడ్డి దూకారు. ఆయన అన్న ఆరుట్ల లక్ష్మీ నరసింహా రెడ్డి, భార్య కమలా దేవి కూడా సాయుధ పోరాటంలో బందూకు పట్టిన వారే. సన్నిహితులు ఆయనను ఎ.ఆర్. అని పిలిచేవారు. నిజాం హయాంలో తెలుగు మాధ్యమంలో బోధించే పాఠశాలలు లేవు కనక రామచంద్రా రెడ్డి ఉర్దూ మాధ్యమంలోనే చదువుకున్నారు. ఆ తరవాత భువనగిరిలో విద్యాభ్యాసం చేశారు. చదువుకునేందుకు భువనగిరి వెళ్లడం ఆయన తల్లిదండ్రులకు ఎంత మాత్రం ఇష్టంలేదు. ఆ తరవాత హైదరాబాద్‌లోని గోషామహల్ పాఠ శాలలో చదువుకున్నారు. ఆ తరవాత నాంపల్లి ఉన్నత పాఠశాలలో 1930లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆ రోజుల్లో అందరిలాగే గాంధీజీ సత్యాగ్రహం, జాతీయ ఉద్యమంతోరామచంద్రా రెడ్డి ప్రభావితుడయ్యాడు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌కు బ్రిటిష్ ప్రభుత్వం మరణ శిక్ష విధించడం అనేక మందికి లాగే ఎ.ఆర్.ను కూడా కలత పెట్టింది. ఆ సమయంలో స్వదేశీ లీగ్ ఏర్పాటైంది. ఆ సమయంలో ఎ.ఆర్. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఎ. చదువుతున్నారు. గాంధీజీ సిద్ధాంతాల వల్ల ప్రేరణ

పొంది ఎ.ఆర్. కూడా ఖద్దర్ ధరించడం ప్రారంభించారు. ఆయనకు మొదటలో పెళ్లి చేసుకోకూడదని ఉండేది. ఇంట్లో పెద్దల ఒత్తిడి వల్ల పెళ్లికి అంగీకరించారు. ఆలేరు మండలంలోని మంతపురి గ్రామానికి చెందిన రుక్మిణితో పెళ్లి ఖరారు అయింది. ఆమె ఏ.ఆర్.కు మేనమామ కూతురే. ఆధునిక భావాలు ఉన్నందువల్ల తాను పెళ్లి చేసుకోవడానికి ఎ.ఆర్. కొన్ని షరతులు విధించారు. వరకట్నం ఇవ్వకూడదు, ఆడపిల్ల, మగపెళ్లివారు పెళ్లిలో ఖద్దరు వస్త్రాలే వేసుకోవాలి, పెళ్లి చేసుకోబోయే అమ్మాయిని చదువుకోనివ్వాలి. పెద్దలు ఈ షరతులకు అంగీకరించక తప్పలేదు. పెళ్లి సమయంలోనే రుక్మిణి అనే పేరును కమలా దేవిగా మార్చేశారు. కమలా దేవి చటోపాధ్యాయ మీద అభిమానం కొద్దీ తన భార్యకు కమలా దేవి అన్న పేరు పెట్టారు. ఎక్కువ మంది చదువుకోవాలని, ముఖ్యంగా ఆడపిల్లలు కూడా చదువుకోవాలన్నది ఎ.ఆర్. అభిమతం. అప్పటికి ఆమె పెద్దబాలశిక్ష మాత్రమే చదివారు. ఆమెను ఎ.ఆర్. హైదరాబాద్ కు తీసుకొచ్చారు. కానీ అప్పటికి హైదరాబాద్‌లో బాలికల వసతి గృహాలు లేవు. ఎ.ఆర్.ఒత్తిడివల్లే బాలికల వసతి గృహం ఏర్పాటైంది. ఆమె మెట్రిక్యులేషన్ దాకా చదువుకున్నారు. అదే సమయంలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. జోగిపేటలో ఆ మహాసభకు రావి నారాయణ రెడ్డి పాతిక మంది యువకులను వెంటబెట్టుకుని జోగిపేట దాకా సైకిళ్ల మీద వెళ్లారు. వారిలో ఎ.ఆర్.కూడా ఉన్నారు. ఆయన ఆంధ్రమహాసభ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం మొదలు పెట్టారు. దేవరకొండ,



ఖమ్మం, సిరిసిల్ల, షాద్ నగర్‌లో జరిగిన ఆంధ్ర మహిళాసభ సమావేశాల్లో ఆయన స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేశారు. ఆ క్రమంలోనే అంటరానితనాన్ని రూపుమాపడం కోసం కృషి చేశారు. భువనగిరి చుట్టుపక్కల ఉన్న 35 గ్రామాలకు చెందిన దళితులను తీసుకుని యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ప్రవేశించారు. అప్పటికి అది చాలా సాహసోపేతమైన పని. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నప్పుడు నిజాం ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించి వందేమాతరం గేయం ఆలపించినందుకు చాలా మందిని కళాశాలల నుంచి బహిష్కరించారు. వారిలో ఎ.ఆర్. కూడా ఉన్నారు. ఈ బహిష్కరణవల్ల ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో చదువు కొనసాగించడం సాధ్యపడనందువల్ల జబల్ పూర్ వెళ్లి బి.ఎ. పూర్తి చేశారు. ఆ సమయానికి జాగీర్దార్ల ఆగడాలు పెరిగిపోయాయి. ఆయన అన్నతో కలిసి ఎ.ఆర్. కట్టుబానిస విధానానికి వ్యతిరేకంగా పోరాడారు. గ్రంథాలయోద్యమం కూడా ఎ.ఆర్.ను ఆకర్షించింది. ఆయన గ్రంథాలయం నిర్మించాలనుకున్నారు. కానీ నిజాం అనుమతి సంపాదించడం దుర్లభం కనక రామానుజ కూటం పేర భవన నిర్మాణం ప్రారంభించి కేవలం రెండు నెలల సమయంలో పూర్తి చేశారు. దీనికి ఆయన జన్మించిన కొలనుపాక గ్రామ ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉండేది. లక్ష్మీ చంద్ మద్దతుతో జైన మందిరం ఆవరణలో బాలికల పాఠశాల కూడా ప్రారంభించారు. బాలికల విద్యమీద ఎ.ఆర్.కు అంతటి నిబద్ధత ఉండేది.

ఈ లోగా కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చింది. గెరిల్లా యుద్ధ తంత్రంలో విజయవాడలో ఎ.ఆర్.శిక్షణ పొందారు. ఆ తరవాత భువనగిరి ప్రాంతంలో 500 మందిని ఎ.ఆర్. సాయుధ పోరాటానికి సిద్ధం చేశారు. భువనగిరి నుంచి సిద్దిపేట దాకా సీపీఐ నిర్మాణం మీద దృష్టి పెట్టారు. ఎ.ఆర్. అనేక గెరిల్లా షెడ్ లు నిర్మించారు. భార్య కమలా దేవితో కలిసి అనేక సంక్షేమ కార్యకలాపాలు కొనసాగించారు. 1948 సెప్టెంబర్ 17న లొంగిపోయిన తరవాత జనం జాగీర్దార్ల మీద దాడిచేస్తుంటే అమానుషంగా ప్రవర్తించకూడదని ఎ.ఆర్. నచ్చచెప్పారు. ముస్లిం మహిళల మీద, పోలీసుల మీద దాడి చేయకూడదని కూడా చెప్పారు. ఇది ఆయన సంస్కారానికి చిహ్నం. పోలీసు ఆక్షన్ తరవాత కమ్యూనిస్టు పార్టీ మీద కూడా నిషేధం విధించారు. ఏ.ఆర్., ఆయన భార్య అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. అప్పటికి వారికి ఒక శిశువు ఉంది. నెలల వయసు మాత్రమే ఉన్న ఆ పసి బిడ్డను వదిలేసి అజ్ఞాతంగా ఉండిపోయారు. కానీ పోలీసులకు చిక్కిపోయారు. సాయుధ పోరాటం ముగిసిన తరవాత ఎ.ఆర్.ను జైలు నించి విడుదల చేశారు. 1953లో ఉప ఎన్నికలో రామన్నపేట నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు.

రాహుల్‌పై రాజ్‌నాథ్ మండిపాటు



న్యూదిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మండిపడ్డారు. భారత్- చైనా సరిహద్దు పరిస్థితి గురించి సైన్యాధిపతి చేసిన ప్రకటనపై రాహుల్ వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. కాంగ్రెస్ నేత తప్పుడు ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆర్మీ అధిపతి వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన బాధ్యతారహిత రాజకీయాలకు పాల్పడడం విచారకరం. చరిత్రపై ఆయన అవగాహన పెంచుకోవాలి' అని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో రాహుల్‌గాంధీ... భారత్ భూభాగాలు, మేకిన్ ఇండియా గురించి ప్రస్తావించారు. 'చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయనే విషయాన్ని ప్రధాని మోదీ ఖండించారు. దీనిపై ఆర్మీ అధిపతి వాస్తవం మాట్లాడారు. చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయని ఆయన అన్నారు' అని రాహుల్ చెప్పారు. అదే విధంగా తయారీ రంగంలో భారత్ కంటే చైనా పదేళ్లు ముందుందన్నారు. ఆ దేశానికి చెందిన మోటార్లు, బ్యాటరీలు, ఆప్టిక్స్‌ల దిగుమతులపై ఇప్పటికీ భారత్ ఆధారపడటాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రధాని మోదీ చేపట్టిన 'మేకిన్ ఇండియా' విఫలం కావడం వల్లే బీజింగ్ నుంచి వస్తువులు దేశంలోకి వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

మన్మోహన్ స్మారకానికి భూమి కేటాయింపు

న్యూదిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ స్మారకం ఏర్పాటు కోసం కేంద్రం భూమి కేటాయించినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారకం కోసం ఇచ్చిన స్థలం పక్కనే ఉన్న ఈ భూమిని సింగ్ కుటుంబ సభ్యులకు ఇచ్చిందని పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ కోసం సింగ్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయనున్న ట్రస్ట్ కోసం ప్రభుత్వం వేచి చూస్తోందని మీడియా కథనాలు తెలిపాయి. ఒకసారి అది ఏర్పాటైన తర్వాత ఆ స్థలాన్ని అప్పగించనుంది. అంతేగాకుండా నిర్మాణం నిమిత్తం రూ.25 లక్షలు ఇవ్వనుంది. దిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలోని రాష్ట్రీయ సమితి కాంప్లెక్స్‌లో ప్రణబ్ ముఖర్జీ స్మారకం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ విషయాన్ని గత నెల ఆయన కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ ధ్రువీకరించారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

యూసీసీపై గుజరాత్ కమిటీ

గాంధీనగర్ : రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అవసరాన్ని అంచనా వేయడానికి, దాని కోసం ఒక బిల్లును రూపొందించడానికి గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం మంగళవారం సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా దేశాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కమిటీ 45 రోజుల్లో తన నివేదికను సమర్పిస్తుందని, ఆ తర్వాత యూసీసీ అమలు గురించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఇక్కడ విలేకరుల సమావేశంలో అన్నారు. నివేదికను సిద్ధం చేయడానికి కమిటీ ముస్లిం సమాజానికి చెందిన మత పెద్దలతో సహా సమావేశమవుతుందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అవసరాన్ని అంచనా వేయడానికి, దాని కోసం ముసాయిదా బిల్లును సిద్ధం చేయడానికి, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి అధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని మేము నిర్ణయించుకున్నాం' అని సీఎం పటేల్ అన్నారు. కమిటీలోని ఇతర సభ్యులలో విశ్రాంత ఐఏఎస్ అధికారి సీఎల్ మీనా, న్యాయవాది ఆర్‌సీ కోడేకర్, వీర్ నర్మద్ దక్షిణ గుజరాత్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ దక్షేష్ ఠాకర్, సామాజిక కార్యకర్త గీతా ష్రాఫ్ ఉన్నారు. ముఖ్యంగా జేపీ పాలిత ఉత్తరాఖండ్ ఇప్పటికే యూసీసీని అమలు చేసింది. దేశంగా యూసీసీని అమలు చేయాలనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పాన్ని నెరవేర్చడానికి గుజరాత్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం పటేల్ చెప్పారు. ఐదుగురు సభ్యుల కమిటీ యూసీసీకి సంబంధించిన వివిధ అంశాలను పరిశీలిస్తుందని, దాని నివేదికను రూపొందించడానికి వివిధ రంగాల ప్రజల అభిప్రాయాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. నివేదికను పరిశీలించిన తర్వాత 'తగిన నిర్ణయం' తీసుకుంటామని తెలిపారు. యూసీసీ అమలయితే గిరిజనుల హక్కులను కాపాడుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి అన్నారు. 'ఉత్తరాఖండ్ ప్రభుత్వం అమలు చేసిన యూసీసీ గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుతుంది. అందువల్ల దేశం ముందు ఒక నమూనాను ప్రదర్శించింది. గిరిజనులు అనుసరిస్తున్న సంప్రదాయాలను యూసీసీ కాపాడుతుందని మా (కేంద్ర) హోం మంత్రి అమిత్ షా కూడా జార్ఖండ్‌లో స్పష్టం చేశారు' అని సంఘవి చెప్పారు. నివేదికను రూపొందించడానికి కమిటీ ముస్లిం నాయకులతో సహా మత పెద్దలను కూడా కలుస్తుందని ఆయన అన్నారు.

స్వదేశానికి 205 మంది భారతీయులు

న్యూదిల్లీ: అక్రమవలసదారులను దేశం నుంచి పంపించే ప్రక్రియను అమెరికా చేపట్టింది. ఈ క్రమంలో అమెరికాకు అక్రమంగా వలసవెళ్లిన భారతీయులను విమానంలో వెనక్కి తరలించారు. కొన్ని గంటల క్రితం ఓ విమానం భారత్‌కు బయల్దేరింది. అందులో 205 మంది భారతీయులు ఉన్నారని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆ విమానం పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చేరుకుంటుందని తెలుస్తోంది. సీ-17 యూఎస్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ వీరిని తరలిస్తోంది. భారత్‌కు చేరుకోవడానికి 24 గంటలు పడుతుందని అంచనా. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాలపై ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేకరకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికా సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

బీజేపీ గూండాయిజం: ఆతిశీ

దిల్లీ సీఎంపై కేసు

న్యూదిల్లీ : ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘించినందుకు, విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను అడ్డుకున్నందుకు కల్కాజీ నుంచి ఆప్ అభ్యర్థిగా ఉన్న ముఖ్యమంత్రి ఆతిశీపై దిల్లీ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. 'గోవింద్‌పురి పోలీస్ స్టేషన్‌లో కల్కాజీ ఆప్ అభ్యర్థిపై వివిధ సెక్షన్ల కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేశాం. తదుపరి దర్యాప్తు కొనసాగుతుంది' అని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఫతేసింగ్ మార్గ్‌లో 50 నుంచి 70 మంది మద్దతుదారులు, 10 వాహనాలతో పాటు ఆప్ అభ్యర్థి కలిగి ఉండటాన్ని గుర్తించి చర్య తీసుకున్నామని ఆయన అన్నారు. ఎంసీసీ మార్గదర్శకాల ప్రకారం ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని పోలీసులు వారిని ఆదేశించారు. కానీ వారు ఒక అధికారిని తన విధులను నిర్వర్తించకుండా అడ్డుకున్నారని పోలీసు అధికారి తెలిపారు. ఆప్ కార్యకర్త ఒక హెడ్ కానిస్టేబుల్‌ను చెంపదెబ్బ కొట్టారని ఒక పోలీసు అధికారి ఆరోపించారు. 'మంగళవారం తెల్లవారుజామున 12.59 గంటలకు గోవింద్‌పురిలోని బాబా ఫతే సింగ్ మార్గ్‌లో ఒక సమావేశం జరిగినట్లు డీసీపీ (ఆగ్నేయ) అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. హెడ్ కానిస్టేబుల్ కౌశల్ పాల్ స్పందించి వీడియో తీయడం ప్రారంభించగా, ఆప్ కార్యకర్తలు అష్మీత్, సాగర్ మెహతా అడ్డుకుని అతనిపై దాడి చేశారు' అని వివరించారు.

కాషాయ కార్యకర్తలకు ఈసీ... పోలీసుల రక్షణ

దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ మంగళవారం బీజేపీ 'గూండాయిజం' చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్, పోలీసులు ఆప్ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటూ కాషాయ పార్టీ కార్యకర్తలను కాపాడుతున్నారని మండిపడ్డారు. కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆతిశీ ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్యం ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ చేతుల్లో ఉందని, 'దేశ రాజధానిలో అది మనుగడ సాగిస్తుందా' అని దేశం చూస్తోందని అన్నారు. 'బీజేపీ బహిరంగంగా గూండాయిజంలో పాల్గొంటోంది. కానీ వారిపై చర్య తీసుకోవడానికి బదులుగా, దిల్లీ పోలీసులు వారిని రక్షిస్తున్నారు. అయితే ఎన్నికల కమిషన్ ఫిర్యాదులు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తోంది' అని దిల్లీ సీఎం తెలిపారు. ఆతిశీపై పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరి, అతని కుటుంబ సభ్యులు కల్కాజీలో 'గూండాయిజం"లో పాల్గొంటున్నారని, అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆతిశీ ప్రత్యేకంగా ఆరోపించారు. 'దిల్లీ ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారు. ఒక వైపు, ఉచిత సంక్షేమ పథకాలను ఆపాలని కోరుకునే పార్టీ హింసకు పాల్పడుతోంది. మరోవైపు, ప్రతి ఇంటికి నెలకు రూ. 25,000 ఆదా అయ్యేలా ఆప్ పని చేస్తోంది' అని ఆమె నొక్కి చెప్పారు. దీనికి ప్రతిస్పందనగా బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరి మాట్లాడుతూ ఆతిశీ తన ఆసన్న ఓటమి పట్ల భయాందోళనలో ఉన్నారని అన్నారు.

ఆతిశీకి హైకోర్టు నోటీసు

ఆప్ ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ ప్రయత్నించిందన్న ఆరోపణలపై దాఖలయిన పరువునష్టం కేసును ఆతిశీ తిరస్కరించడంపై ఒక బీజేపీ నాయకుడు వేసిన పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం దిల్లీ సీఎంకు నోటీసు జారీ చేసింది. 'ప్రతివాదికి నోటీసు జారీ చేయమని' న్యాయమూర్తి జస్టిస్ వికాస్ మహాజన్ అన్నారు. ఫిర్యాదుదారుడి తరపు న్యాయవాది ప్రవీణ్ శంకర్ కపూర్ తన పరువు నష్టం ఫిర్యాదును తిరస్కరిస్తూ రివిజనల్ కోర్టు తన అధికార పరిధిని అధిగమించిందని, విచారణకు హాజరు కావడానికి ఆప్ నాయకురాలికి మెజిస్ట్రీరియల్ కోర్టు జారీ చేసిన సమన్లను రద్దు చేసిందని వాదించారు. ఆమెను విజిల్‌బ్లోయర్‌గా పేర్కొంటూ కోర్టు ఆతిశీ ప్రవర్తనను 'సమర్థించడం' పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిశీలనను నిలిపివేయాలని ఆదేశించాలని కోరారు. బీజేపీ దిల్లీ విభాగం అధ్యక్షుడు చేసిన ఫిర్యాదు ప్రకారం, జనవరి 27న, తరువాత ఏప్రిల్ 2, 2024న జరిగిన విలేకరుల సమావేశంలో ఆతిశీ బీజేపీపై నిరాధారమైన ఆరోపణలు చేశారు. ఆప్ ఎమ్మెల్యేలతో సంప్రదిస్తున్నారని, వారి వైపు మారడానికి వారికి రూ. 20 నుంచి 25 కోట్ల లంచం ఇవ్వజూపారని ఆరోపించారు. అయితే ఆతిశీ తనకు జారీ చేసిన సమన్లను సవాలు చేస్తూ రివిజన్ పిటిషన్ దాఖలు చేయడం ద్వారా ప్రత్యేక న్యాయమూర్తిని ఆశ్రయించారు. ఫిర్యాదులో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా నిందితుడిగా చేర్చారు, అయితే, మే 28, 2024న జారీ చేసిన ఉత్తర్వులో మెజిస్ట్రీరియల్ కోర్టు ఆయనపై విచారణ జరపడానికి తగిన ఆధారాలు కనుగొనలేదు. ఈ విషయాన్ని ఏప్రిల్‌లో హైకోర్టు తదుపరి విచారిస్తుంది. జనవరి 28న ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే... అతిషి చేసిన ఆరోపణలు రాజకీయ అవినీతికి సంబంధించి వాక్ స్వాతంత్ర్య హక్కును వినియోగించడమే తప్ప పరువు నష్టం కాదని అభిప్రాయపడ్డారు. ఆతిశీని నిందితురాలిగా సమన్లు జారీ చేయడానికి ముందస్తు సాక్ష్యాలు తగిన ఆధారాలు లేవని ప్రత్యేక న్యాయమూర్తి అన్నారు.

మరో వివాదంలో సిద్ధరామయ్య

బెంగళూరు: ముడా భూముల కుంభకోణంతో సతమతమవుతున్న కర్నాటక సీఎం సిద్ధరామయ్యపై తాజాగా బినామీ ఆస్తుల ఆరోపణ వచ్చింది. తన బావ మరిది పేరున బినామీ ఆస్తులు కూడబెట్టారని ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. సిద్ధరామయ్య ఇప్పటికే కెసరె గ్రామంలో 3.16 గుంటల భూమిని పసుపు-కుంకుమ సంప్రదాయం కింద బదిలీ చేశారని, అయితే ఇప్పుడు అదనంగా ఆయన బావమరిది మల్లికార్జునస్వామికి ఎకరా భూమి దానం చేశారని ఆయన తెలిపారు. దీనిపై సిద్ధరామయ్య మౌనంగా ఉన్నారని, ఈ లావాదేవీల వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని కృష్ణ ప్రశ్నించారు. సిద్ధరామయ్య భార్య పార్వతి కుటుంబ ఆస్తులపైనా, మల్లికార్జున స్వామి సంపాదించిన ఆస్తులపైనా దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎకరా భూమి కొనుగోలును ముడా డీ-నోటిఫై చేయడంపై సిద్ధరామయ్య ప్రభావం ఉందని కృష్ణ వాదిస్తున్నారు. అదే భూమిని అక్టోబర్, 2010లో పార్వతికి దానమిచ్చారు. ఆ తర్వాత నెలకే ఆమె ఆ భూమిని తన కొడుకు యతీంద్రకు బదలాయించారు. ఆ తర్వాత నాలుగు నెలలకే దాన్ని యతీంద్ర మూడో పార్టీకి అమ్మేశారు. లోకాయుక్త ఈ బినామీ బాగోతంపై దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణ డిమాండ్ చేశారు.

మహా కుంభమేళాలో భూటాన్ రాజు

ప్రయాగ్‌రాజ్: మహా కుంభమేళాలో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ పాల్గొన్నారు. మంగళవారం ఉదయం ఆయన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం చేశారు. ఆ తర్వాత గంగా హారతిలో పాల్గొన్నారు. భూటాన్ రాజు వాంగ్‌చుక్ సోమవారమే లక్నో చేరుకున్నారు. ఆయనకు సీఎం యోగి సాదర స్వాగతం పలికారు. ఈ విషయాన్ని యోగి ఆదిత్యనాథ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. భారత్-భూటాన్ మధ్య ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ భూటాన్ రాజు మహాకుంభ్‌కు హాజరుకావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రెండు దేశాలకు చెందిన ప్రముఖులు, భక్తులు గంగాహారతి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భూటాన్ రాజుకు చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి యోగి స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆయన క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. భారతీయ సాంస్కృతిక ప్రదర్శనలతో కళాకారులు వాంగ్‌చుక్‌కు స్వాగతం చెప్పారు.

కుంభమేళా మృతుల సంఖ్య దాచిపెడుతోంది

యోగి సర్కార్‌పై అఖిలేశ్ విమర్శ

లక్నో: ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభ మేళాలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారి సంఖ్యను ప్రభుత్వం దాచిపెడుతోందని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మంగళవారం ఆరోపించారు. మేళా నిర్వహణలో 'తప్పుడు నిర్వహణ' ను కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చలో పాల్గొన్న అఖిలేశ్ యాదవ్... ప్రభుత్వం డిజిటల్ కుంభ్ నిర్వహిస్తున్నట్లు చెప్పుకుందని, కానీ చనిపోయిన వారి సంఖ్యలను దాచిపెడుతోందని ఆరోపించారు. కుంభమేళా ఏర్పాట్లపై చర్చించడానికి, విపత్తు నిర్వహణను సైన్యానికి అప్పగించడానికి ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. 'ప్రభుత్వం నిరంతరం బడ్జెట్ సంఖ్యలను తప్పుదారి పట్టిస్తోంది. దయచేసి కుంభమేళాలో మరణించిన వారి సంఖ్యలను కూడా ఇవ్వండి' అని ఆయన అన్నారు. 'మహా కుంభమేళాలో మరణించిన వారి సంఖ్య, గాయపడిన వారి చికిత్స, మందులు, వైద్యులు, ఆహారం, నీరు, రవాణా వివరాలను పార్లమెంటులో సమర్పించాలి' అని ఆయన డిమాండ్ చేశారు. తొక్కిసలాట జరిగినప్పుడు 'అమృత స్నానం' ను వాయిదా వేయాలని ప్రభుత్వం సాధువులను కోరిందన్నారు. 'ప్రభుత్వం వారి 'అమృత స్నానం' ను నిలిపివేయమని ఆదేశించింది. 'సనాతన ధర్మం' సంప్రదాయాలను ఉల్లంఘించింది. ఒక నిర్దిష్ట సమయంలో లేదా ముహూర్తంలో పవిత్ర స్నానం చేయాలనే విషయాన్ని మర్చిపోయి, ప్రభుత్వం 'అమృత్ స్నానం' తిరిగి ప్రారంభించమని ఆదేశించింది' అని తెలిపారు. తొక్కిసలాట తర్వాత చుట్టూ పడి ఉన్న మృతదేహాలను తొలగించడానికి ప్రభుత్వం జేసీబీ యంత్రాలు, ట్రాక్టర్ ట్రాలీలను ఉపయోగించిందని అన్నారు. 'ప్రజలు ఆశీర్వాదాలు పొందడానికి వచ్చారు. కానీ వారు బంధువుల మృతదేహాలతో బయలుదేరాల్సి వచ్చింది. ఇక్కడ అద్భుతం ఏమిటంటే ప్రభుత్వం మృతదేహాలను కనుగొన్నప్పటికీ సంఖ్యలను అంగీకరించడానికి నిరాకరించింది' అని అఖిలేశ్ తెలిపారు. 'మృతదేహాలు మార్చురీలో పడి ఉన్నప్పుడు ప్రభుత్వం హెలికాప్టర్ నుంచి పూల రేకుల వర్షం కురిపించింది. ఇవి ఎలాంటి సనాతన (కాలానుగుణ) సంప్రదాయాలు? మృతదేహాలు పడి ఉన్నాయి. పాదరక్షలు, దుస్తులు చెల్లాచెదురుగా ఉన్నాయి. వాటిని పారవేయడానికి జేసీబీ యంత్రాలు, ట్రాక్టర్ ట్రాలీలను ఉపయోగించారు. ఈ అంశాలను లేవనెత్తినప్పుడు ప్రభుత్వం దానిని కప్పిపుచ్చడానికి తొందరపడింది' అని ఆయన అన్నారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేయలేదని అన్నారు. 'రాష్ట్రపతి, ప్రధాన మంత్రి ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేసిన 17 గంటల తర్వాత ఆయన విచారం వ్యక్తం చేశారు' అని ఎస్పీ అధ్యక్షుడు అన్నారు.

పని గంటల పెంపు ఉండదు

స్పష్టం చేసిన కేంద్రం



న్యూదిల్లీ: పని గంటల పెంపు అంశంపై కొంతమంది కార్పొరేట్ దిగ్గజాలు చేస్తున్న వ్యాఖ్యలపై దేశమంతా చర్చ జరుగుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టతనిచ్చింది. పనిగంటలను వారానికి 70 లేదా 90 గంటలకు పెంచే ప్రతిపాదనేదీ తమ పరిశీలనలో లేదని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన సహాయ మంత్రి శోభా కరంద్లాజే లోక్‌సభలో లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. "కార్మికుల, ఉద్యోగుల అంశం ఉమ్మడి జాబితాలో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి పరిధిలోని కార్మిక చట్టాలను అమలు చేస్తాయి. కేంద్రం తరఫున సెంట్రల్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ మెషనరీ (సీఐఆర్‌ఎం) తనిఖీ అధికారులతో పర్యవేక్షణ చేస్తుండగా, రాష్ట్రాలు ఆయా విభాగాల ద్వారా దీనిని అమలు చేస్తాయి" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఫ్యాక్టరీస్ యాక్ట్ 1948, ఆయా రాష్ట్రాల షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టుల ద్వారా పని గంటలు, ఓవర్ టైం సహా వర్కింగ్ పరిస్థితులను నియంత్రిస్తాయని ఆయన చెప్పారు. ఒక వ్యక్తి వారానికి 60 గంటలకు పైగా పని చేస్తే, అది అతని/ ఆమె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపొచ్చని ఇటీవల ఆర్థిక సర్వే వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ సర్వేలో వర్కింగ్ అవర్స్ అంశంపై వెలువడిన పలు పరిశోధనలను ఉదహరించడం జరిగింది. రోజుకు 12 గంటలు, అంతకుమించి కూర్చుని పనిచేసే వారు (డెస్క్ వర్క్) తీవ్ర నిస్పృహకు లేదా మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు ఆ సర్వే పేర్కొంది. ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే భారతీయ యువత వారానికి 70 గంటలు పనిచేయాలని ప్రముఖ వ్యాపారవేత్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి వ్యక్తం చేసిన అభిప్రాయంపై దేశంలో చాలా చర్చ జరిగింది. చాలా మంది కార్పొరేట్ దిగ్గజాలు, ప్రముఖులు నారాయణ మూర్తిని సమర్థించగా, ఉద్యోగులు మాత్రం తీవ్రంగా వ్యతిరేకించారు. కాగా ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ మరో అడుగు ముందుకు వేసి ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని సూచించారు.

దిల్లీ ఎన్నికల్లో గెలుపు మాదే: కేజ్రీవాల్

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీకి బుధవారం జరగనున్న ఎన్నికల్లో తాము కచ్చితంగా గెలుస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. దిల్లీ అసెంబ్లీకి సంబంధించి 70 సీట్లకుగాను 55 సీట్లను తాము గెలుచుకుంటామన్నారు. ఒకవేళ బీజేపీ గనుక దిల్లీ ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు ముగింపు పలకడం ఖాయమన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ఎక్స్'లో కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. 'నా అంచనా ప్రకారం మేము 55 సీట్లు గెలవడం ఖాయం. ఒకవేళ మహిళలు ఇంకాస్త ముందుకొచ్చి పురుషుల చేత మాకు ఓట్లు పడేలా చేస్తే మాత్రం తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వస్తాం. ఇలా జరిగితే 60 సీట్లకు పైగానే గెలుచుకుంటాం. మీరు(ప్రజలు) కనుక కమలం గుర్తుకు ఓటేస్తే మీరు ఇంటికి వెళ్లేసరికే కరెంట్ పోవడం ఖాయం. దేశంలో అత్యంత చౌకగా కరెంట్ అందించేది దిల్లీలోనే. ఇక్కడ 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు ఇవ్వడంతో పాటు 400 యూనిట్లకు రూ. 800 మాత్రమే వసూలు చేస్తున్నాం. అదే సమయంలో 24 గంటల విద్యుత్ అందిస్తున్నాం. అందుచేత మీరు చీపురు గుర్తు ఉన్న బటన్ నొక్కండి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. 2015లో దిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 67 సీట్లను ఆప్ గెలిస్తే... 2020లో 62 సీట్లలో విజయం సాధించింది. 'మీరు ఎందుకు ఆప్‌కు ఓటేయాలంటే... మేము గత 10 ఏళ్లలో ఎంతో బాధ్యతగా పరిపాలన అందించాం. దిల్లీలో చాలా పనులు చేశాం. ఇక బీజేపీ అధికారంలో ఉన్న 20 రాష్ట్రాల్లో 24 గంటల విద్యుత్ అనేదే లేదు' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

విదేశీయులను వెంటనే పంపేయండి

అసోం ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూదిల్లీ: అసోం ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా రాష్ట్రంలోకి వచ్చిన విదేశీయులను వెంటనే పంపివేయకుండా నిర్బంధ కేంద్రాల్లో నిరవధికంగా ఉంచడంపై మండిపడింది. విదేశీయులను స్వస్థలాలకు పంపడానికి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారా అని ప్రశ్నించింది. నిర్బంధ కేంద్రాల్లో ఉంచిన 63 మందిని రెండు వారాల్లోగా పంపించేయాలని న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఎవరైనా దేశంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు తెలిస్తే... వారిని పంపివేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. నిర్బంధంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపించమంటే వారి చిరునామా తెలియదని పేర్కొంటూ మీరు తరలింపు ప్రక్రియను ప్రారంభించడానికి నిరాకరిస్తున్నారు. అది మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం కాదు. అలాగే వారిని జీవితాంతం కేంద్రాల్లో ఉంచి పోషించలేం కదా. వెంటనే వారిని వారి దేశాలకు తరలించండి. దానికి ఏమైనా ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారా' అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అసోంలో గల అన్ని నిర్బంధ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు ఎంతమందిని వారి దేశాలకు పంపించారన్న నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

పోలవరం ఎత్తు తగ్గించొద్దు

ఎంపీ మిథున్‌రెడ్డి డిమాండ్

న్యూదిల్లీ: పోలవరం విషయంలో అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే పార్టీలకతీతంగా ఎంపీలతో కలిసి పోరాడేందుకు సిద్ధమని లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆయన ఏపీకి సంబంధించిన అనేక అంశాలు ప్రస్తావించారు. 'పోలవరం ప్రాజెక్టు కెపాసిటీని తగ్గించవద్దు. వాస్తవంగా పోలవరం ప్రాజెక్టు సామర్థ్యం 194 టీఎంసీలు. ఏడున్నర లక్షల ఎకరాలకు నీరు అందేలా దీన్ని డిజైన్ చేశారు. సాగునీటితో పాటు తాగునీటి కోసం ఉపయోగించాలనేది ఉద్దేశం. కానీ, 41.15 మీటర్లకు ప్రాజెక్టును తగ్గిస్తూ బడ్జెట్లో ప్రతిపాదనలు పెట్టారు. దీనివల్ల పోలవరం కెపాసిటీ 194 నుంచి 115 టీఎంసీలకు పడిపోతుంది. ఈ తగ్గింపు వల్ల కేవలం 3.2 లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందుతుంది. ఇది రైతులకు, రాష్ట్రానికి తీరని అన్యాయం చేసినట్లే. ఈ అన్యాయాన్ని ఎదిరించేందుకు టీడీపీ ఎంపీలతో కలిసి పోరాటానికి సిద్ధం. లేకుంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు క్షమించరు' అని మిథున్‌రెడ్డి అన్నారు. 'ఇప్పటికే ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదు. ఇప్పుడు పోలవరం కెపాసిటీని తగ్గించారు. విభజన చట్టం మేరకు ఒరిజినల్‌గా ఉన్న పోలవరం సామర్థ్యాన్ని కొనసాగించాలి. కెపాసిటీ తగ్గించిన తర్వాత బనకచర్లకు నీరు ఎలా అందుతుంది? రాయలసీమకు నీరెలా ఇస్తారు? అని ఆయన ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని స్పష్టంచేశారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని మెల్లగా రద్దు చేస్తున్నారని, ఇంగ్లీష్ చదివితేనే విదేశాల్లో కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగాలు దొరికే పరిస్థితి ఉందని మిథున్‌రెడ్డి చెప్పారు. ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు కొనసాగించాలని, ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి సంస్థ 2,600 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిందని, ప్రజల డబ్బును ఇతర కంపెనీలకు మళ్లించారని వివరించారు. సహారా, శారద కుంభకోణం కంటే మార్గదర్శి కుంభకోణం పెద్దదన్నారు. మార్గదర్శిపై 1,000 కోట్ల రూపాయల జరిమానా విధించారని, డిపాజిటర్ల డబ్బు తిరిగి చెల్లించకుండా వాటిని రెన్యువల్ మాత్రమే చేస్తున్నారన్నారు. మార్గదర్శి కుంభకోణంపై దర్యాప్తు జరపాలని, ఈ అంశంపై ప్రధాని జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని, కడప స్టీల్‌ప్లాంట్ విషయంలో జిందాల్ గ్రూపును పిలిచి మాట్లాడాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, డ్రగ్స్ నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

మళ్లీ అలిగిన షిండే

ముంబై: అసెంబ్లీ ఎన్నికలు ముగిసి నెలలు గడిచిన తర్వాత కూడా మహారాష్ట్ర రాజకీయాలు ఇంకా రసవత్తరంగానే కొనసాగుతున్నాయి. తాజాగా సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నిర్వహించిన సమావేశానికి డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే గైర్హాజరయ్యారు. గతవారం కూడా క్యాబినెట్ భేటీకి షిండే హాజరు కాలేదు. సీఎం పదవి దక్కకపోవడం,ఇంఛార్జ్ మంత్రుల నియామకాలపై అసంతృప్తితో ఉండడం వల్లే షిండే వరుసగా సీఎం సమావేశాలకు రావడం లేదన్న ప్రచారం జరుగుతోంది. సీఎం ఫడ్నవీస్‌తో విభేదాల వల్లే షిండే సమావేశాలకు రావడం లేదన్న పుకార్లు వినిపిస్తున్నాయి. ఈ వార్తలపై శివసేన ఎంపీ నరేశ్ మస్కే వివరణ ఇచ్చారు. షిండే కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆరోగ్యం సరిగా లేదు. అందుకే సీఎంతో సమావేశాలకు రాలేదు. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన వారే దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు'అని మస్కే తెలిపారు. గతేడాది జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ, శివసేన, ఎన్సీపీ(అజిత్‌పవార్) పార్టీల మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. తర్వాత శివసేన అధినేత అప్పటి సీఎం షిండే కూడా మళ్లీ తనకు ముఖ్యమంత్రి పదవి కోసం గట్టిగా ప్రయత్నించారు. అయితే సీఎం పదవి బీజేపీకి వెళ్లడంతో డిప్యూటీ సీఎం పదవితో సర్దుకున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

రిటైర్డు ఉద్యోగులకు శాపంగా మారిన ప్రభుత్వ నిర్లక్ష్యం : హరీష్ రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం 8000 మంది రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా మారింది మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. ఈ పోలీస్ అధికారి ఆవేదన చూస్తే హృదయం కల్చివేస్తుందని, 30 ఏళ్లకు పైగా ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించిన ఠాగూర్ నారాయణ సింగ్ ఇలాంటి పరిస్థితుల్లో ఉండడం బాధాకరమని సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు. ఒకవైపు రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మరోవైపు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య భద్రత కార్డుతో చికిత్స చేసుకుందామని హాస్పిటల్‌కి వెళ్తే చెల్లదు అని పంపిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ఈ విశ్రాంత పోలీసు ఉద్యోగికి శాపంగా మారిందన్నారు. ఇది ఒక నారాయణ సింగ్ సమస్య కాదు రాష్ట్రవ్యాప్తంగా రిటైర్డ్ అయిన 8000 మంది ప్రభుత్వ ఉద్యోగుల జీవన్మరణ సమస్యగా ఉందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మీకు ఉద్యోగుల పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్న వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలన్నారు. వైద్యసేవలు పొందడంలో అంతరాయం కలగకుండా ఈహెచ్‌ఎస్, పోలీస్ ఆరోగ్య భద్రత కార్డులు ఆసుపత్రుల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీలను అణగదొక్కడానికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర : జిలుకర రవికుమార్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన నివేదిక తప్పుల తడకగా ఉందనీ, బీసీలను రాజకీయంగా అణగదొక్కడానికి కుట్రలో భాగమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునేందుకే అగ్రవర్ణాల జనాభాను పెంచి చూపారని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ ఆరోపించారు. 2011 తెలంగాణ జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా మూడు కోట్ల 70 లక్షలు ఉండగా దానిలో బీసీ జనాభా కోటి 84 లక్షలు గా చూపించారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన నివేదికలో బిసి జనాభా కోటి 64 లక్షలుగా తగ్గించి చూపారన్నారు. బీసీల జనాభా పెరగాల్సి ఉండగా తగ్గించు చూపటం రాజకీయ కుట్రలో భాగమే అన్నారు. 2011లో ఓసీల జనాభా 10 శాతం లోపే ఉండగా ప్రస్తుతం15.79 శాతం పెరిగినట్లు చూపించారని ఓసీలు పెరగటం బీసీలు తగ్గడం ఏమిటని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలనీ, విద్యా ఉద్యోగ రంగాలలో 52 శాతానికి పెంచాలన్నారు. జనాభా తగ్గిందని బీసీ రిజర్వేషన్లను తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

రంజాన్ సందర్భంగా పాఠశాలల వేళల్లో మార్పు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంజాన్ సందర్భంగా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ పదోతరగతి ప్రీ-ఫైనల్ పరీక్షా సమయాలను మార్చింది. గతం పరీక్షా సమయం మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ఉండేది. దానిని ఇప్పుడు ఒక గంట మార్చారు. సోమవారం జారీ చేసిన కొత్త నోటిఫికేషన్ ప్రకారం పదో తరగతి ప్రీ-ఫైనల్ పరీక్షలు మధ్యాహ్నం 12.15 గంటల నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు ఉంటాయి. భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం పరీక్షలను గంటన్నర వ్యవధిలోనే నిర్వహించనున్నారు. అంటే ఈ పరీక్షలు మధ్యాహ్నం 1.45 గంటలకు ముగుస్తాయి. సమయం మార్పు దృష్ట్యా మధ్యాహ్నం 12.15 గంటలలోపే పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించబడుతుంది. మార్చి 6వ తేదీ నుంచి ఈ ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభమై.. మార్చి 15వ తేదీన ముగియనున్నాయి. ఈ ప్రీ-ఫైనల్ పరీక్షలు ముగిసిన వారం రోజుల్లోనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్సెస్సీ బోర్డు టైమ్ టేబుల్ ను గతంలోనే విడుదల చేసింది.

పదో తరగతి ప్రీ ఫైనల్ షెడ్యూల్....

పదో తరగతి ప్రీ-ఫైనల్ ఎగ్జామ్ షెడ్యూల్ మార్చి 6- ఫస్ట్ లాంగ్వేజ్ మార్చి 7 - సెకండ్ లాంగ్వేజ్ మార్చి 10 - ఆంగ్లం మార్చి 11 - గణితం మార్చి 12 - భౌతిక శాస్త్రం మార్చి 13- జీవ శాస్త్రం మార్చి 15 - సోషల్ స్టడీస్ పదో తరగతి ఫైనల్ పరీక్షల షెడ్యూల్ ఇదే.. మార్చి 21- ఫస్ట్ లాంగ్వేజ్ మార్చి 22- సెకండ్ లాంగ్వేజ్ మార్చి 24- ఆంగ్లము మార్చి 26-గణితం మార్చి 28 - భౌతిక శాస్త్రం మార్చి 29 - జీవ శాస్త్రం ఏప్రిల్ 2 -సోషల్ స్టడీస్ ఏప్రిల్ 3-పేపర్-1 లాంగ్వేజ్ పరీక్ష(ఒకేషనల్ కోర్సు) ఏప్రిల్ 4 - పేపర్-2 లాంగ్వేజ్ పరీక్ష(ఒకేషనల్ కోర్సు)

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర- హుజూర్ నగర్ : 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్ కోరారు.మంగళవారం హుజూర్ నగర్ లోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్ల కు , ఆశా కార్యకర్తల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు గల పిల్లలు పోషక ఆహార లోపం, రక్తహీనతతో మందకొడిగా ఉంటారన్నారు. కావున 1 నుంచి 19సంవత్సరాల వయసు వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఆల్బెండజోల్ 400ఎంజీ మాత్రలను మింగించను నట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీన అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సి హెచ్ఓ పద్మ, పిహెచ్ఎంఓ నూర్జహాన్ బేగం, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామ కృష్ణ, వైద్య సిబ్బంది, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌతమ్ నగర్ డివిజన్‌కు నిధులు మంజూరుకై జోనల్ కమిషనర్‌కు వినతి

విశాలాంధ్ర- మల్కాజి గిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మంగళవారం జోనల్ కమీషనర్ రవి కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు ఆగిపోవడంతో పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు లోనవుతున్నారని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలో నిధులు మంజూరుకు చర్యలు చేపడతారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, మల్లికార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి అచ్యుతరావు, కావాలి శ్రీనివాస్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- ఎం బాల నరసింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ :: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇంటి జాగాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ పట్టణ పేదలకు ప్రభుత్వం ఇంటి జాగాలు కేటాయించాలని గత ప్రభుత్వ హాయంలో మిగిలిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని, 523లో పట్టాలు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ కార్యాలయం నుండి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వరకు పేదలతో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎం.బాలనరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో పేదలందరికీ లబ్ధి చేకూరాలంటే పట్టణ ప్రాంతాల్లో వేలాది మందికి ప్రజలకు ఇంటి స్థలాలే లేవని గుర్తు చేశారు. దీనితో ప్రభుత్వ లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరదని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వాటిని గుర్తించి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. అనంతరం సమస్య లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాల కిషన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, రైతు సంఘం నాయకులు చాంద్ పాషా, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కోట కదిరి నరసింహ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.పద్మావతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు, సిపిఐ నాయకులు లక్ష్మణ్, మహేష్, గూడుబాషా, రాములు, ఆనంద్, శ్రావన్ కుమార్, శివ, ఇందిరా, పద్మ,రాజేశ్వరి, లక్ష్మికళ, మంజుల, సంధ్యా, సత్యమ్మ, మాధవి, సరోజనమ్మ, కవిత, అరుణ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆకాంక్షలను రాజకీయం చేయొద్దు : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రతిపక్షాలు ప్రతి విషయాన్ని రాజకీయం చేసినట్టు బలహీన వర్గాల ఆకాంక్షలను రాజకీయం చేయకండి అంటూ బీఆరెస్, బీజేపీలను ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ అన్ని జిల్లాలో స్వేచ్ఛగా తమ ఆకాంక్ష ముందుకు తీసుకుపోవాలని, ఈ సమాచారాన్ని తీసుకొని భవిషత్ లో ఆయా వర్గాలకు న్యాయం చేయడానికి ఉపయోగపడతుం దన్నారు. రాష్ట్రంలో బలహీన వర్గాల అభివృద్ధికి ఈ రోజు నుండి శకం ప్రారంభమైందన్నారు. మంగళ వారం కులగణన సర్వే నివేదిక పై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లా డుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నివేదిక సమగ్ర ఇంటింటి కుల సర్వేఎన్నో ఒడిదుకులు ఎదురు కుంటూ ఈ కార్యక్రమం కొనసాగిందన్నారు. 1931 కి స్వాతంత్ర్యంకి ముందు కుల సర్వే జరిగిందని కానీ స్వాతంత్ర్యం తరువాత మళ్ళీ కులసర్వే జరగ లేదన్నారు. బలహీన వర్గాలకు మేమెంతో మాకంత ఉండాలని సమాచారం కులాల లెక్కలు లేక దాని ప్రకారమే ప్రభుత్వ పథకాల వచ్చేవన్నారు. భారత్ జోడో యాత్రలో మా నాయకుడు రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరిగినప్పుడు చాలా వర్గాలకు ప్రాతినిధ్యం లేదు వారికి అవకాశాలు రావాలంటే ఎవరేంతో వారికి తెలవల్సిందే అని ఎన్నికల్లో చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. టీపీసీసీ పక్షాన మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు, కామారెడ్డి డిక్లరేషన్ బీసీ డిక్లరేషన్‌కి చైర్మన్‌గా ఉన్నానని అపుడే బలహీన వర్గాలపై స్పష్టంగా మా విధానం చెప్పడంతో పాటు ఇచ్చిన మాటకు మాప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడానికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. 2011 జనాభా లెక్కల్లో ఆనాడు తెలంగాణ లో 3 కోట్ల 50 లక్షలు ఉండేదని, ఇప్పుడు 3 కోట్ల 70 లక్షల మంది ఉన్నారన్నారు. కేంద్రం నుండి జనాభా ప్రాతిపదికన దక్షిణ, ఉత్తర భారతదేశానికి నిధులు జనాభా ప్రాతిపదికన ఇస్తున్నారని, దక్షిణ భారతదేశంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు పాటించడం జనాభా తగ్గిందన్నారు.

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత

- శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కులగణనపై మంగళవారం శాసనమండలిలో జరిగిన చర్చలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని మాట్లాడారు. కులగణన విషయంలో తదుపరి కార్యాచరణను ప్రభుత్వం ప్రకటిస్తుందని అందరూ భావించారని, కానీ రెండు రోజుల క్రితం కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో చెప్పిన విషయాలనే ప్రకటన రూపంలో కౌన్సిల్లో చెప్పడం ద్వారా ఉపయోగమేమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను పెంచిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలను, బీసీ ముస్లింల జనాభాను వేరు చేసి ప్రభుత్వం చెబుతుందని, ఇది కేవలం జనాభాను తక్కువ చేసి చూపించాలన్న ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారని అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కాబట్టి ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కార్యాచరణను ప్రకటించాలని ప్రతిపాదించారు. ఇంతవరకు కచ్చితంగా డేటానే లేదని ప్రభుత్వం చెప్పడం సరికాదని సూచించారు. "2011 జనాభా లెక్కలు అందుబాటులో ఉన్నాయి. అంతర్జాతీయంగా, దేశీయంగా 10 సంవత్సరాలలో సగటున 13.5 శాతం జనాభా పెరుగుతుందన్నది అంచనా. ఆ లెక్కన ఇప్పుడు తెలంగాణ జనాభా 4 కోట్ల 18 లక్షలు ఉండాలి. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఎస్సీ ఎస్టీ బీసీల జనాభా తగ్గినట్లు, ఓసీల జనాభా కనిపిస్తుంది. అన్ని వర్గాల జనాభా తగ్గి కేవలం ఒక వర్గం జనాభా ఎలా పెరుగుతుంది ?" అని ప్రశ్నించారు. తమ ఇళ్లకు సర్వే చేయడానికి ఎన్యుమరేటర్లు రాలేదని ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. కాబట్టి మరోసారి వారి వివరాలను సేకరించడానికి ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతులలో ఆత్మస్థైర్యం నింపేందుకే అధ్యయన కమిటీ పర్యటన : నిరంజన్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్ : కేసీఆర్ హయాంలో రైతును రాజు చేస్తే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులను ఆత్మహత్యల వైపు నెడుతున్నారని మాజీ మంత్రి, రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళ వారం ఇబ్రహీంపట్నం, తదితర ప్రాంతాలలో కమిటీ సభ్యులతో కలసి విస్తృతంగా పర్యటిం చారు. ఇబ్రహీం పట్నంలో రుణ మాఫీ కాక రైతు భరోసా లేక దిక్కుతోచని పరిస్థితిలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటాం అని మనోధైర్యం నింపారు. అనంతరం జరిగిన సమావేశములో మాట్లా డుతూ దగాపడ్డ రైతుల సమస్యల చూసి చలిం చిన కేసీఆర్ మలిదశ తెలంగాణ ఉద్యమం చేపట్టి రాష్ట్రాన్ని సాదించారన్నారు. 9సంవత్స రాల తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణ మాఫీ రైతు భరోసా రైతు భీమా వంటి వినూత్న పథకాలు సృష్టించి నిముషం పాటు కూడా కరెంట్ కోత లేకుండా చేసి వ్యవసాయాన్ని పండుగ చేశారని కొనియాడారు. వలసలు వెళ్లిన రైతులు తిరిగివచ్చి పాడిపంటలతో కుటుంబాలు విలసిల్లెల కె.సి.ఆర్ చేశారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ పేరిట 2లక్షల రుణ మాఫీ,రైతు భరోసా 15000,ధాన్యం పై 500బోనస్,కౌలు, రైతు కూలీలకు రైతు భరోసా ఇస్తామని రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. రైతు సంక్షేమ పథకాలు యెగ్గొట్టడంతో రైతులు రాష్ట్ర వ్యాప్తంగా సంవత్సర కాలములో 418మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడం విచారకరమన్నారు. తమ పర్యటనలో రైతు కుటుంబాల బాధలు చూసి చలించిపోయినామన్నారు.చిన్నారులు కన్న తల్లి కన్నీటి చుక్కలు తుడువడం చూస్తుంటే కడుపు తరుకు పోతుందని విచారం వ్యక్తం చేశారు. రైతులలో ఆత్మస్థైర్యం నింపి మీ తరుపున బి.ఆర్.ఎస్ పార్టీ పోరాడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన రైతు హామీలు అమలు చేసేవరకు పోరాడతామని కాబట్టి ఆత్మహత్యలు చేసుకోవద్దని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వందరోజులో రైతు బంధు,రైతు రుణ మాఫీ,రైతు భీమా,ఉపాధి,రైతు కూలీలకు రైతు భరోసా ఇస్తామని 14నెలలు గడిచినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించాడని ఖండించారు.

బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర- మల్కాజిగిరి : బీ.సీ.హక్కుల సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశము మంగళ వారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీ.సీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు సి.హెచ్ దశరథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద జరగబోయే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. బీ.సీ.ల సమస్యలను పరిష్కరించాలని, భారత రాజ్యాంగం ఈ దేశంలో ప్రజలందరికీ జాతి, కుల, వర్గ, లింగ వివక్ష లేకుండా, సమానత్వాన్ని, సమాన అవకాశాలను కల్పిస్తామని హామీ ఇచ్చింద న్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో, సగానికిపైగా ఉన్న ప్రజల జీవన ప్రమాణాలను పెరగకుండా ఎన్నటికీ అభివృద్ధి సాధ్యం కాదు. అందుకని సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి జరగాలంటే అన్ని రంగాలలో సంపదంతా వికేంద్రీకరణ జరగాలి. అందుకు ముఖ్యంగా ఈ దేశంలో జంతు గణనతో పాటు అన్నిటికీ లెక్కలు తీస్తారు. కానీ సగానికిపైన ఉన్న బీసీ కులగనన లెక్కలు తీయమంటే కేంద్రం కుంటి సాకులు, సాంకేతిక లోపాలు వస్తాయి అని చెబుతుంది. కానీ అది నిజం కాదు అందుకని దేశ జనాభాలో బీసీల కుల గణన చేసి, వారికి విద్య ఉపాధి రంగాలలో మేమెంతో మాకంత వాటా కల్పించాలని తదితర సమస్యల పరిష్కారం కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. దేశ జనాభాలో కులగనన జరపాలని, ఈ పార్లమెంటు సమావేశాల్లో బీసీలకు 50 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ బిల్లు పెట్టి అమలుపరచాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, 2 లక్షల కోట్లతో బీసీ సంక్షేమ అభివృద్ధి కొరకు బడ్జెట్‌తో నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, బడ్జెట్‌లో నిధులు జనాభా ప్రాతిపదికన కేటాయించాలని, ఉపాధి అభివృద్ధికై ఖర్చు చేయాలని, సబ్సిడీ, రుణాలు, వృత్తిదారులకు అందించాలని, బీసీ అట్రాసిటీ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని, అన్ని జిల్లాల్లో బీ.సీ.భవన్‌లను నిర్మించాలని, ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ హక్కుల సాధన సమితి నాయకత్వం, సహాయ కార్యదర్శి డి.జి.నరేందర్ ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింలు, జిల్లా సహాయ కార్యదర్శి డి.జంగయ్య పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అండాలమ్మను ఢీకొట్టిన కారు

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్‌లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి శానిటేషన్ స్వీపర్ అండాలమ్మ విధినిర్వహణలో ఉండగా కారు ప్రమాదానికి గురైతంది. ఈ ప్రమాదంలో అండాలమ్మ తన కాళ్ళు తీసేయడంతోపాటు తలకు కూడా తీవ్రమైన గాయం కావడంతో 48 గంటల పాటు పరిశీలనలో పెట్టాలని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కొమ్మగళ్ళ బాలకృష ఉస్మానియా ఆసుపత్రికి చేరుకొని బాధితురాలని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా కూడ సంబంధిత అధికారులు బాధితురాలిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధితురాలు అండలమ్మకు జరిగిన ప్రమాదంతో కాళ్ళు తీసేయడంతో వారి కుటుం బానికి తీరని నష్టం జరిగిందని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు తక్షణమే కల్పించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు అనేక ప్రమాదాలు జరిగి విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ఎంతోమంది ఉద్యోగులు. కార్మికులు కాళ్లు విరగడం, ప్రాణాలు కోల్పోవడం జరిగినప్పటికి అధికా రులు గానీ ప్రభుత్వం గానీ ఎలాంటి చర్యలు తీసుకొవడం లేదని బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. అండాలమ్మ కుటుం బానికి జిహెచ్ఎంసి అధికారులు అండగా నిలిచి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసుపత్రికి చేరుకున్న పలువురు కార్మిక సంఘం నాయకులు బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర పెనుబల్లి : వియం బంజర్ లో ఆర్ కే పంక్షన్ హల్ లో తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది కాంగ్రెస్ కార్యకర్తలు భారీ గా పాల్గొనగ భారీ కైక్ కట్ చేసి హ్యాపీ బర్త్డే యుగంధర్ అంటూ నినాదాలు చేశారు, బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పంది వెంకటేశ్వరావు, చీకటి రామారావు, కీసర శ్రీనివాస్ రెడ్డి, మిట్టపల్లి కిరణ్ కుమార్, గూడూరు మాధవరెడ్డి, పసుమర్తి విశ్వనాధ్, కరీముల్లా, దొంతు మాధవరావు, అల్లా రాజా, గోదా చెన్నారావు, వంగ నిరంజన్, చెన్నకేశవ, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ళ కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సమీక్ష

విశాలాంధ్ర- హైదరాబాద్ : అభివృద్ధి పనుల పురోగతి మరియు రైళ్ల కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సమీక్షను నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మంగళవారం సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రత కోసం తీసుకోవలసిన చర్యలపై, జోన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై వివరణాత్మక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం 6 డివిజన్లు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో, జనరల్ మేనేజర్ మార్గదర్శకాల ప్రకారం భద్రతా నియమాలు, విధానాలను ఖచ్చితంగా పాటించాలని అధికారు లకు సూచించారు. చిన్నచిన్న తప్పిదాలు కూడా జరుగకుండా నివారించడానికి లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, గార్డులు మొదలైన అన్ని భద్రతా కేటగిరీ సిబ్బందికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ సెషన్‌లతో పాటు సురక్షితమైన పని పద్ధతుల ఆచరణాత్మక ప్రదర్శనలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. రైళ్ల భద్రతను నిర్ధారిం చడానికి తనిఖీలను ముమ్మరం చేయడంపై దృష్టి పెట్టాలని ఆయన అధికారులకు సూచించారు. జోన్ వ్యాప్తంగా పొగను గుర్తించే పరిక రాలు, అగ్ని మాపక యంత్రాలు వంటి అగ్ని నిరోధక భద్రతా వస్తువుల లభ్యతను అరుణ్ కుమార్ జైన్ సమీక్షించారు. అన్ని భద్రతకు సంబంధించిన పరికరాల నిల్వలను తగినంత ఉంచడానికి మెరుగైన కార్యాచరణ ప్రణాళికలను కలిగి ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. జోన్ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని జనరల్ మేనేజర్ సమీక్షించారు. కొనసాగుతున్న పనుల పురోగతికి సంబంధించి అధికారులు వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. జోన్‌లో లెవెల్ క్రాసింగ్ గేట్ల తొలగింపు పనులపై ఆయన సమీక్షించారు. వాటిని సత్వరం పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత డివిజనల్ రైల్వే మేనేజర్లను ఆదేశించారు. అరుణ్ కుమార్ జైన్ జోన్ అంతటా రైళ్ల సమయపాలన పని తీరుపై సమీక్ష నిర్వహించారు. డివిజన్ వారీగా సమయపాలన గణాంకాలను ఆయన పరిశీలించి సమయ పాలన కోల్పోయిన రైళ్లను గుర్తించి పర్యవేక్షించాలని, వాటి సమయ పాలనను మెరుగుపరచడానికి తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని డివిజనల్ రైల్వే మేనేజర్లను ఆదేశించారు.

కుల గణన నివేదికను శాసనసభ ఆమోదించడం హర్షనీయం

బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

విశాలాంధ్ర-హైదరాబాద్ : శాసన సభలో కుల గణన నివేదికను ఆమోదించడం పట్ల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంఘాలు చేసిన పోరాటాలకు ఇది విజయ మన్నారు. బీసీల జనాభా లెక్కల సేకరణలో కొన్ని అనుమానాలు ఉన్నాయని వాటిని సరి చేసి అనుమానాలను నివృత్తి చేయాల్సిందన్నారు. శాసనసభ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించి చేతులు దులుపుకుంటే మాత్రం బీసీలకు ఒరిగే ప్రయోజనం ఏమి ఉండదన్నారు. బీసీ జనాభా 56.33 శాతం ప్రకారంగా స్థానిక సంస్థలలో రిజర్వేషన్ పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని లేనిచో బీసీల విశ్వాసాన్ని కోల్పోవలసి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

రెవెన్యూ సెక్షన్ అధికారులతో సమీక్ష

- మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్

- వంద శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యం

విశాలాంధ్ర-దుండిగల్: మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా ఎడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం దుండిగల్ మున్సిపల్ కార్యాలయం నందు కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ రెవెన్యూ సెక్షన్ అధికారులతో కలిసి సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు.కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ ఆస్తిపన్ను వసూలు చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా అండర్ అసెస్మెంట్, అన్‌అసెస్మెంట్ గుర్తించి వెంటనే ఆస్తి పన్ను విధించాలని, ప్రతిరోజు ఉదయం 8 గంటలకె టాక్స్ కలెక్షన్ ఫీల్డ్‌లో ఉండాలని సూచించారు.అనంతరం ఆస్తి పన్ను యజమాను దారులందరూ సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడలని కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఆఫీసర్ ప్రభాకర్, మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య ,వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణనపై టీజీవో రాష్ట్ర కార్యదర్శి హర్షం

విశాలాంధ్ర- హైదరాబాద్ : రాష్ట్రంలో కులగణన చేపట్టినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి టీజీవో అసోసియేషన్ ధన్యావాదాలు తెలిపింది. బీసీల రిపోర్టు తయారు చేసి దాన్ని ప్రభుత్వానికి అందజేసిన బీసీ కమిషన్‌కు సైతం కృతజ్ఞతలు చెప్పింది. కులగణన నిర్వహించడం మంచి నిర్ణయమని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎ.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సంఘం అధ్యక్షుడు ఎంబీ కృష్ణా యాదవ్, సెక్రటరీ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, చంద్రజ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాల లక్ష్మిలను కలిసి కృతజ్ఞతలు చెప్పారు.

సంఘటితమైన రాష్ట్ర అర్చక ఉద్యోగ సంఘాలు సంఘం చైర్మన్‌గా గంగు ఉపేంద్ర శర్మ

విశాలాంధ్ర- జూబ్లీహిల్స్ : సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ అర్చక ఉద్యోగ సంఘాలన్నీ కలిసి సంఘటితమయ్యాయి. ఒకే సంఘం ఏర్పడి సమస్యల పరిష్కారానికి అధ్యయన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వివిధ అర్చక ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మంగళవారం శ్రీనగర్ కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఉద్యోగ సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సమస్యలను ఏకరూప విధానంలో ప్రభుత్వానికి,దేవాలయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినందుకు అన్ని సంఘాలు కలిసి ఒకే తాటి మీదికి వచ్చి పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్ గా గంగు ఉపేంద్ర శర్మ, కన్వీనర్ గా బేతి రంగారెడ్డి, కో కన్వీనర్లుగా మార్తి సత్యనారాయణ శర్మ, పరాశరం రవీంద్రాచార్యులు, టి రత్నాకర్, రాకుండా మురళీధర్ శర్మ, కందూరి కృష్ణ మాచారి, తోటకూర వెంకటేశ్వర్లు, చక్రధరాచార్యులు ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ దేవాదాయ శాఖ పరిధిలో వివిధ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వీటి పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ సంఘాలని ఏకతాటి మీదికి రావడం అభినందనీయమన్నారు. త్వరలోనే సమస్యలను ఒక నివేదికగా రూపొందించి దేవాదాయ శాఖకు అందజేయనున్నట్లు తెలిపారు.

అన్ని రంగాలలో దేశాభివృద్దే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా, ప్రజారంజక బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి ,నరేంద్ర మోదీ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ లింగంపల్లి డివిజన్, మసీద్ బండ చౌరస్తాలో మోదీ గారి చిత్ర పటానికి రాష్ట్ర నాయకులు , జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి పాలాభిషేకం చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి కంటేస్టెడ్ ఎమ్మెల్యే , ఇంఛార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత 2025-2026 మోదీ ప్రభుత్వ 12వ పూర్తిస్థాయి బడ్జెట్ అని, 2014 నుంచి ఎన్నో సంస్కరణలు, ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారని వాటి ఫలితాలు ఇవాళ స్పష్టంగా కనబడుతున్నాయన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగుల గౌడ్, ఎల్లేష్, ఆంజనేయులు సాగర్, కిషోర్, ఆకుల లక్ష్మణ్ , మాణిక్ రావు ,రమణయ్య ,సత్యనారాయణ, శ్రీశైలం కురుమ ,వెంకటస్వామి రెడ్డి,రమేష్ ,శ్రీనివాస్ యాదవ్, రవి నాయక్ ,రాజు ,గణేష్ ముదిరాజ్, శివారెడ్డి, బాబు ముదిరాజ్, ప్రేమ్, శ్రీనివాస్ యాదవ్, కుమార్ యాదవ్, రాయల్, బీజేపీ హాఫిజ్పేట్ డివిజన్ అధ్యక్షులు కె. జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి సిమెంట్ పరిశ్రమ కీలకం

- సీఎంఏ అధ్యక్షుడు, సిమెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ అఖౌరీ

విశాలాంధ్ర- జూబ్లీహిల్స్ : దేశ నిర్మాణం, ఉద్యోగ కల్పన, ఆర్థిక వృద్ధికి సిమెంట్ పరిశ్రమ కీలకం భూమిక పోషించనుందని సిమెంట్ తయారీదారుల సంఘం (సీఎంఏ) అధ్యక్షుడు, సిమెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ అఖౌరీ తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్‌ను స్వాగ తిస్తున్నామన్నారు. ప్రజలు, ఆర్థిక వ్యవస్థ, వినూత్నత (ఇన్నోవే షన్) వంటి కీలక రంగాల్లో పెట్టుబడులు పెంచే దిశగా ఉన్న ప్రణాళికలు దేశాభివృద్ధికి దోహదం చేయనున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం లోని ఈ బడ్జెట్ సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకోవడం అభినందనీయ మన్నారు. ఈ బడ్జెట్ బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి మార్గదర్శకంగా నిలవనుందన్నారు. ప్రభుత్వ సహకారంతో చేపట్టిన అనేక కార్యక్ర మాలు ప్రజల ఆకాంక్షలను, భవిష్యత్తు ఆర్థిక వృద్ధి అవసరాలను సమతుల్యం చేస్తా యన్నారు. రాష్ట్రాలలో మౌలిక సదుపాయాల పెంపునకు పెట్టు బడులు పెంచడంపై దృష్టి కేంద్రీకరించడంతో, సిమెంట్ రంగానికి పెరుగుదల అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు. మౌలిక సదుపా యాలపై దృష్టి పెట్టినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, దేశ పురోగతి లో భాగస్వాములుగా మా పాత్రను కొనసాగిస్తామని హామీ ఇస్తున్నా మన్నారు. పెద్ద స్థాయిలో గృహ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై పెరుగుతున్న ఖర్చు నిర్మాణ సామగ్రిపై డిమాండ్‌ను పెంచుతు ందన్నారు. సవాళ్లు ఉన్నప్పటికీ, ఈ చర్యలు సిమెంట్ పరిశ్రమకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థిరంగా ఆరు శాతం కంటే ఎక్కువ వార్షిక వృద్ధి రేటు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. సిమెంట్ తయారీ దారుల సంఘం (సీఎంఏ) ఉపాధ్యక్షుడు, జేఎస్‌డబ్ల్యు సిమెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పార్థ్ జిందాల్ మాట్లాడుతూ ఈ బడ్జెట్ భారత సిమెంట్ పరిశ్రమ భవిష్యత్తును రూపకల్పన చేసే దిశగా ఉందన్నారు. 2047 నాటికి వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు ఇది కీలకంగా నిలుస్తుందన్నారు.

జీతాలు చెల్లించనిచో నిరవధిక సమ్మెకు వెళ్తాం

ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరిక

విశాలాంధ్ర- హైదరాబాద్ : తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల జీతాలపై ప్రభుత్వం సంవత్సరానికి ఒకసారి మాదిరిగా జీతాలు చెల్లిస్తున్నదని గత ఏడు నెలల క్రితం ఒకసారి సమ్మె నోటీసు ఇస్తే కొన్ని జీతాలు ఇచ్చిన ప్రభుత్వం మళ్ళీ గత ఏడు నెలలుగా కార్మికుల బిల్లులు చెల్లించకుండా జీతాలు ఇవ్వడంలో కాంట్రాక్టర్లు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. టీవీవీపీ ఆసుపత్రుల్లో జీతాలకై రోజు ఒక గంట నిరసన ధర్నాలో భాగంగా నేడు కింగ్ కోటి జిల్లా ఆస్పత్రిలో జరిగిన ధర్నా కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి గత ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కొద్ది నెలలు జీతాలు ఇచ్చి అనంతరం చేతులెత్తేసారని కాంట్రాక్టర్లకు, ప్రభుత్వానికి మధ్యలో కార్మికులు నలిగిపోతున్నారని నెల జీతం మీద పిల్లల చదువులు, ఇంటి కిరాయిలకు ఆధారపడినటువంటి కార్మికులు జీతాలు అందక నానా ఇబ్బందులను పడుతున్న జనవరి 27న ఆందోళనకై టీవీవిపి కమిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆందోళనలు నిర్వహిస్తున్న ప్రభుత్వం, అధికారులు చలించటం లేదని ఇలాగే నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే రాబోవు రోజుల్లో పనులను పూర్తిగా నిలిపివేసి నిరవధిక సమ్మెకు సైతం వెలనున్నట్లు వారు హెచ్చరించారు. గత రెండున్నర సంవత్సరాల క్రితం పిలిచిన టెండర్‌లో వీరి జీతాలు 13600 రావలసి ఉండగా కేవలం 11000 మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని, పిఎఫ్ డబ్బులను కూడా తక్కువగా చెల్లిస్తున్నారని ఈ విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని ప్రస్తుతం 19 జీతం రావాల్సి ఉన్నదని ప్రభుత్వం వెంటనే వీటి పైన స్పందించి కనీస వేతనాలు ప్రభుత్వాసుపత్రుల్లో పని చేయుచున్న శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రతినెల 7లోపు సక్రమంగా జీతాలు అందే విధంగా చూడాల్సిన టువంటి ప్రభుత్వం పట్టించుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని వారు తెలియజేశారు. టీవీ విపి కార్మికులకు కూడా రాష్ట్ర ప్రభుత్వము నుండి జీతాలు అందే విధంగా కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం దానిపై ముందడుగు వేయకుండా ఉందని వెంటనే వీరి సమస్యలపై స్పందించి రాష్ట్ర ప్రభుత్వం జీతాలను విడుదల చేయాలని లేని పక్షంలో రాబోవు రోజుల్లో నిరవధిక సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా జమ చేయాలని కనీస వేతనాల జీవోలను కార్మికులకు అమలు చేయాలని పెద్ద పెటున్న నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్మికులు సంతోష, ఎస్.లక్ష్మీ, కౌసల్యమ్మ, అంజమ్మ, ప్రకాష్, గణేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర-హైదరాబాద్ : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిం చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనదని, ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసి కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తున్న పాలకులపై ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం వలిగొండ మండలంలోని ప్రెస్ క్లబ్‌లో జరిగింది. ఈ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో హామీలు ఇవ్వడం ఆ తరువాత, ఆ హామీల అమలును మర్చిపోవడం నీచస్వార్థ రాజకీయాలకు తార్కాణ మన్నారు. ఇటీవల కేంద్ర సహా మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి కల్పన కోసం నిర్దిష్టమైన చర్యలు ప్రతిపాదించలేదని, విద్య, వైద్యం, ఉద్యోగకల్పన రంగంలో ప్రతిపాదనలన్నీ డొల్లగానే ఉన్నాయని, ఉద్యోగకల్పనా రంగం ఉద్యోగాలులేని రంగంగా మారిందని వాపోయారు. మోదీ ప్రభుత్వ తొలి పదేళ్లకాలంలో ఉద్యోగాల కల్పనే లేదని అన్నారు. నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే వరకు నిరుద్యోగ భృతి రూ.3116లు హామీని తక్షణమే అమలు పరచాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రామీణ, జిల్లా స్థాయి నుండే యువజన సాధికారత కోసం నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి సన్నద్ధత చేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాటాడుతూ యువత నిరంతరం సమాజం లోని అంతరాలపై పోరాడాలని, శాస్త్రీయ భావజాలం వైపు ఆలోచనలు చేసేలా యువతను చైతన్యం చేయాలని వారు పిలుపు నిచ్చారు. అదే విధంగా నేడు స్వార్థ పూరిత రాజకీయాలను భూస్థాపితం చేసేందుకు యువత రాజకీయాలకు ఆకర్షితులు కావాలని, దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేలా మంచివైపు చూడాలని అందుకు సమసమాజ స్థాపన కోసం పాటుపడుతున్న వామపక్ష రాజకీయ పార్టీలకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సలిగంజి వీర స్వామి, ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎండీ. నయీమ్, సుద్దాల సాయి కుమార్, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, తోటకూర శేఖర్, బత్తిని నరేష్, మెట్టు లక్ష్మీ నారాయణ, మామిడికాయల నరేష్,సంగీ అరవింద్, కాలే మల్లేష్, బెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మగ్దూం మొహియుద్దీన్

- ఈ.టీ.నరసింహ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు
- వి.ఎస్. బోస్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

విశాలాంధ్ర- హైదరాబాద్ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మగ్దూం మొహియుద్దీన్ 117 వ జయంతిని పురస్కరించుకొని ట్యాంక్ బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ.టీ నరసింహ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో జన్మించిన మగ్దూం మొహియుద్దీన్ చదువు కోసం సిటీ కాలేజీకి వచ్చాడు. ఆనాడు కొనసాగుతున్న నిరంకుశ నిజాం పాలన గ్రామాలలో అమలు జరుగుతున్న పటేల్, పట్వారి, దేశ్ ముఖ్ భూస్వామ్య దాస్టికాలకు వ్యతిరేకంగా తను రచనలకు పదును పెట్టాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులతో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పాటల్లో క్రియాశీలకమైన పాత్ర పోషించాడు. సిటీ కాలేజీలో లెక్చరర్‌గా తన ఉపన్యాసాల ద్వారా వేలాదిమంది విద్యార్థులను ఉద్యమం వైపు ఆకర్షించేలా కృషి చేయడం జరిగింది. ప్రజా పోరాటాలకు మద్దతుగా తను రచనల ద్వారా, నాటకాల ద్వారా మద్దతును కూడ కట్టారు. సాహిత్య రంగంలో అదుతేమైన కృషి చేశాడు. అభ్యుదయ రచయితల సంఘం, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఏర్పాటు చేశాడు. పౌర ప్రజాస్వామిక హక్కులు కాలరాయపడుతున్న నిజాం పాలనలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన కొనసాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో భాగమయ్యాడు. గ్రామాలలో ప్రజలు తమ చేతికి అందిన ఆయుధాలతో భూస్వాములపై పోరాటం నడిపారు. శత్రు బలగాల చేతుల్లో అధునాతనమైన ఆయుధాలు ఉండటం వలన ఈ పోరాటాన్ని ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవాలంటే సాయుధ పోరాటమే పరిష్కారమని కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డితో పాటు మగ్దూం మొహియుద్దీన్‌లు పిలుపు నివ్వడం జరిగింది. 3000 గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచటం జరిగింది. వెట్టి చాకిరిని రద్దు చేయించటంతో పాటు కౌలుదారులకు భూమిపై చట్టబద్ధమైన హక్కులు కల్పించడం జరిగింది. నిజాం పాలన అంతమైన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. శాసనమండలిలో కార్మికుల పక్షాన పోరాటం చేసి హక్కులు సాధించడం జరిగింది. సింగరేణి, మెడికల్, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ, రైల్వే, చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ, మున్సిపల్ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జరిగిన ఉద్యమంలో తనదైన ముద్ర వేసుకున్నాడు. ప్రజలను ఫాసిజానికి వ్యతిరేకంగా నిలబెట్టాడు. రష్యా, ఆఫ్రికా, యూరప్ దేశాలలో జరిగిన సదస్సులలో ప్రసంగించాడు. నేడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా విభజిస్తూ కార్మిక ఉద్యమంపై ఉక్కు పాదం మోపుతున్నారు. బుద్ధి జీవులపై అక్రమ కేసులు నమోదు చేసి జైళ్ళలో నిర్బంధిస్తున్నారు. ప్రజా సమస్యలను పక్క దారి పట్టించడం కోసం మత రాజకీయాల చేస్తూ న్నారు. భిన్న సంస్కృతులు ఆచార వ్యవహారాలు కలిగిన భారత దేశంలో ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే భావజాలం, ఒకే నాయకుడు అనే అనే ఫాసిస్టు భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్ది విద్వేషాలు సృష్టిస్తున్నారు. ఇటువంటి ఫాసిజం పై అభ్యుదయవాదులుగా ప్రజాస్వామిక వాదులుగా నిరంతరం ప్రజలను చైతన్యం చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సన్నద్ధం చేయడమే మనం మాగ్దూంకి ఇచ్చే నివాళి అని తెలిపారు. సిపిఐ సీనియర్ నేతలు ప్రేమ్ పావని, జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు నళిని, నేర్లకంటి శ్రీకాంత్, మహమ్మద్ సలీం, ఉమర్ ఖాన్, టూరిజం నాయకులు రాజ మౌళి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమూద్, జేరిపోతుల కుమార్ కొమురెల్లి బాబు, చెట్టు కింది శ్రీనివాస్, బాలకృష్ణ, నర్సింగ్ రావు, దశరథ్, ఇమ్రాన్, గ్యార నరేష్, చైతన్య, కళ్యాణ్, లెనిన్, అరుణ్ పాల్గొన్నారు.

అల్ట్రాక్యాబ్ (ఇండియా) లిమిటెడ్ యొక్క రూ.4981 లక్షల రైట్స్

ULTRACAB®
WIRES & CABLES
GHAR SURAKSHIT - AAP SURAKSHIT

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ఎలక్ట్రిక్ వైర్లు, కేబుల్ తయారీ మరియు ఎగుమతిలో నిమగ్న మైన అల్ట్రాక్యాబ్ (ఇండియా) లిమిటెడ్ (బిఎస్ఇ-538706) యొక్క రూ.4981 లక్షల రైట్ ఇష్యూ జనవరి 28, 2025 నుండి సబ్స్క్రిప్షన్ కోసం తెరవబడింది. ఒక్కో షేరు ధర రూ.14.5గా ఉన్న ఈ కంపెనీ రైట్ ఇష్యూ 2025 ఫిబ్రవరి 11న ముగియనుంది. కంపెనీ యొక్క సరైన ఇష్యూలో పాల్గొనడానికి / సబ్‌స్క్రైబ్ చేయడానికి పెట్టుబడిదారులు బిఎస్ ఇ నుండి అల్ట్రాక్యాబ్ (ఇండియా) లిమిటెడ్ రైట్స్ ఎంటైల్ మెంట్స్ (బిఎస్ ఇ సింబల్: 750951) కొనుగోలు చేయవచ్చు. ఆన్-మార్కెట్ హక్కుల ఉపసంహరణకు చివరి తేదీ 5 ఫిబ్రవరి 2025 వరకు ఉంది. ఇష్యూ కోసం హక్కుల అర్హత నిష్పత్తి 9:25 గా నిర్ణయించబడింది (రికార్డు తేదీ - జనవరి 16, 2025 న వాటాదారులు కలిగి ఉన్న ప్రతి 25 ఈక్విటీ షేర్లకు 9 రైట్స్ ఈక్విటీ షేర్లు). రూ.2 ముఖ విలువ కలిగిన 3.43 కోట్ల ఫుల్లీ పెయిడ్ అప్ ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. అల్ట్రాక్యాబ్ (ఇండియా) లిమిటెడ్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ నితేష్ వాఘాసియాలి మాట్లాడుతూ, "మా హక్కుల సమస్య బాధ్యతాయుతమైన వృద్ధి, ఆర్థిక స్థితిస్థాపకత మరియు సుస్థిరత పట్ల మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ప్రస్తుత వాటాదారులకు వారి వాటాను విస్తరించ డానికి సాధికారత కల్పించడం ద్వారా, స్థిరమైన మరియు పర్యావరణ బాధ్యతాయుతమైన వృద్ధి కోసం మా దార్శనికతకు అనుగుణంగా వ్యూహాత్మక విస్తరణ మరియు కొనుగోళ్ల కోసం కీలకమైన నిధులను పొందేటప్పుడు మేము వారి నమ్మకాన్ని మరియు విధేయతను గౌరవిస్తాము. ఈ మైలురాళ్ల నాణ్యత, సృజనాత్మకత కస్టమర్-ఫస్ట్ విధానం పట్ల మా అంకితభావాన్ని పునరుద్ఘాటించాయి. సుస్థిరత, డిజిటల్ పరివర్తన, లక్ష్య ఉత్పత్తి మరియు మార్కెట్ విస్తరణలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మేము ఈ వేగాన్ని నిర్మిస్తాము. దీర్ఘకాలిక వాటాదారుల విలువను సృష్టించడం స్థిరమైన వృద్ధిని నడిపించడంపై మా దృష్టి ఉంది.

సీఐ సతీష్ కి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ సిఐ సతీష్ జన్మదిన సందర్భంగా దుండిగల్ 27వ వార్డు మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ ఆయనను స్టేషన్ నందు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ నాయక్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో జరుగుతున్న వేంక టేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్ల వారుజామున రథోత్సవ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ రథోత్సవానికివివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రథోత్సవం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై చర్యలు తీసుకోవాలని డీజీపీకి వినతి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: కులాల మధ్య వైశ్యామ్యాలను రెచ్చగొడుతూ, రెడ్డి కులస్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్ కు తెలంగాణ రెడ్డి సంఘం నేతలు లక్డికపుల్ లోని డీజీపీ కార్యాలయంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దురి వెంటేశ్వర్ రెడ్డి ,రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దేవి రెడ్డి విజితా రెడ్డిలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్‌లో జరిగిన బీసీ సభలో తీన్మార్ మల్లన్న రెడ్డి కులాన్ని తీవ్ర పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ మానవ సంబంధాలలో విఘాతాన్ని కల్పించే విధంగా ప్రవర్తిస్తున్న తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు వెంటనే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలిని కోరారు. తీన్మార్ మల్లన్న రెడ్డి కులానికి వేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టి తీన్మార్ మల్లన్నకు తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. ఎస్. దేవేందర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, శరత్ రెడ్డి రమణారెడ్డి, సరిత రెడ్డి, సుమతి రెడ్డి, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు,

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు కేంద్రం పర్యవేక్షణ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ వార్డు కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ప్రజా పాలన పథకాలలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు కేంద్రాన్ని ఈ రోజు కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ గారు, స్థానిక నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హమీద్ పటేల్ గారు మాట్లాడుతూ, గతంలో ప్రజా పాలనా పథకాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమంది పేర్లు ఆన్లైన్ లో రాలేదని ప్రజలు తమ దృష్టికి తీసుకోని రావటం జరిగిందని, కాబట్టి మరొక సారి దరఖాస్తుల స్వీకారణ చేయటానికి కేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని తెలియజేశారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో తమ పేరు రాలేని వారు ఈ యొక్క ప్రజా పాలన దరఖాస్తును నింపి ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ హమీద్ పటేల్ గారితో బాటుగా జీహెచ్ఎంసీ ఏఎంసీ శ్రావణ్ కుమార్, టాక్స్??? ఇన్స్?పెక్టర్ ఉపేందర్, సీఓ పద్మ, ఆర్పి రూప రెడ్డి, రఫియా బేగం, సీనియర్ నాయకులు నరసింహ సాగర్, సంజు, గణపతి, వీరేజ్, సాబెరా బేగం, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా బుద్ధి శ్రీనివాస్

విశాలాంధ్ర-దుండిగల్: జిల్లాలోని బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీజేపీ మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా బుద్ధి శ్రీనివాస్ ఎన్నికైన సందర్భంగా దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ శామీర్ పేట్ మండలం అలియాబాద్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం పలువురు కార్యకర్తలతో కలిసి ఆమె బుద్ధి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రకు రెండోసారి డాక్టరేట్



విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: హైదరాబాద్ రాంనగర్‌లో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర సలహాదారి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో హర్యానా గవర్నర్ బండార్ దత్తాత్రేయ చేతుల మీదుగా గ్లోబల్ అసోసియేషన్ జర్మనీ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ రెండవసారి డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్‌కు మెడల్స్?? వేస్తూ సర్టిఫికెట్‌ను గవర్నర్ దత్తాత్రేయ అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సామాజిక సేవలో ని సౌత్ ఇండియా పాండిచ్చేరి పట్టణం షాన్బాగ్ హోటల్లో ఆగస్టు 24 న అందుకోవడం జరిగింది అని ఆ సంస్థ చైర్మన్ గారికి ధన్యవాదాలు తెలుపుతూ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక సేవలో నిరుపేదలకు వృద్ధులకు అనాథలకు సేవలు చేస్తున్నటువంటి డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ గారు కరోనా విపత్కర పరిస్థితిల్లో రికార్డు తే కానీ దొక్కాడని నిరుపేదలకు దాదాపు 10వేల మందికి పైగా నిత్యవసర సరుకులు మాస్టర్స్?? హోమియో సాయి వైకుంఠ ట్రస్ట్? చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ గారి ఉచిత 15వేల మందికి ఉచిత హోమియో మందులు పంపిణీ చేశారు మరియు దాతల సహాయంతో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ హై క్యాంపులు మెడికల్ క్యాంపులు అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమాలు లాంటి ఎన్నో సేవలు చేసిన డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ గొప్ప వ్యక్తి అని అన్నారు ఇంకా మరెన్నో సేవలు చేసి సామాజిక సేవలో ముందుకు పోవాలని కోరారని అన్నారు ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ బిసి కౌన్సిల్ నెంబర్ సంజన వేణి మహేంద్ర ఫోరం సంఘం వ్యవస్థాపకులు సౌధాని భూమా అన్న యాదవ్ గారు బిసి సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు అందేలా కుమార్ యాదవ్ బెల్లంపల్లి నియోజకవర్గ తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం అధ్యక్షులు బోయిన తిరుపతి యాదవ్ మంచిర్యాల జిల్లా నాయకులు పాయవేణి మల్లేష్ యాదవ్ నాయకులు పాల్గొన్నారు

ఘనంగా రథసప్తమి

విశాలాంధ్ర - అమనగల్లు : ఆమనగల్లు మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామీ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామీకి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రత్యేక పూజలలో ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాలే మల్లయ్య, గోరటి నర్సింహా, లందం చంద్రయ్య, లందం కృష్ణయ్య, గోరటి దేవేందర్, గుండమల్ల జగన్, ఎనమళ్ళ రమేష్, కోరే రవి, ఎనమళ్ళ పర్వతాలు, లందం మొగులయ్య, లందం సాలయ్య, లందం నర్సింహా, వడ్డెమోని రవి, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏడాదికి ఒకసారి దక్షిణాదిన పార్లమెంటు ప్రత్యేక సమావేశం: సీపీఐ

న్యూదిల్లీ: రాజ్యసభ సభ్యత్వం ఉన్న ఏదేని దక్షిణాది రాష్ట్రంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని సంవత్సరానికి ఒకసారి నిర్వహించాలని సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ పిలుపునిచ్చారు. కేరళ కోసం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజిని కేంద్రం నుంచి డిమాండ్ చేశారు. మలయాళీ రాష్ట్రంలో మనుషులకు, వణ్యజీవులకు మధ్య పెరుగుతున్న ఘర్షణను పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యకు సత్వర పరిష్కారం అవసరమన్నారు. దేశంలోని తాజా పరిణామాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజల్లో ఏకాకి భావనను కల్పిస్తున్నాయని సంతోశ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

పశ్చిమబెంగాల్ వద్దు.. బంగ్లానే ముద్దు

న్యూదిల్లీ: పశ్చిమబెంగాల్ పేరును 'బంగ్లా'గా మార్చాలనే అంశాన్ని తృణమూల్ కాంగ్రెస్ మరోసారి లేవనెత్తింది. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం, చరిత్రను ప్రతిబింబించేందుకు ఈ మార్పు తప్పని సరని పేర్కొంది. టీఎంసీ నేత రితబ్రత బెనర్జీ రాజ్యసభ జీరో అవర్‌లో మంగళవారం ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రం పేరు మార్పును ప్రతిపాదిస్తూ చేసిన తీర్మానాన్ని పశ్చిమబెంగాల్ అసెంబ్లీ 2018లో ఆమోదించిందని, అయితే ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని అన్నారు.'చరిత్ర, సంస్కృతి, గుర్తింపు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పేరు మార్పు జరగాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లేఖ రాశారు. 1947 విభజన తరువాత భారత్ వైపు ఉన్న భాగానికి వెస్ట్ బెంగాల్ అనే పేరు పెట్టారు. తూర్పు ప్రాంతాన్ని ఈస్ట్ పాకిస్థాన్‌గా పిలిచేవారు. అది కాస్తా 1971లో బంగ్లాదేశ్ అయింది. ఈరోజు ఈస్ట్ పాకిస్థాన్ అనేది లేదు' అని రితబ్రత బెనర్జీ అన్నారు. ఈ చారిత్రక మార్పును పరిగణనలోకి తీసుకుని రాష్ట్రం పేరును మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల పేర్లు మార్చడం భారత్‌లో కొత్త కాదు. 2011లో ఒరిస్సా పేరును ఒడిశాగా మార్చారు. ఇతర సిటీలు కూడా పేరు మార్పు సంతరించుకున్నాయి. బాంబే పేరు 1995లో ముంబైగా మారింది. 1996లో మద్రాసు పేరు చెన్నైగా మారింది. 2001 కలకత్తా పేరు కోల్‌కతాగా మారింది. 2014లో బెంగుళూరు పేరును బెంగళూరుగా మార్చారు.

టార్గెట్ విపక్షం

పార్లమెంటులో మోదీ విమర్శలు

శీష్ మహల్... అర్బన్ నక్సల్ వ్యాఖ్యలు

న్యూదిల్లీ: మా రాజకీయం సంక్షేమం... వారిది స్వప్రయోజనం... అంటూ ప్రతిపక్షంపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. 'టార్గెట్ విపక్షం' అన్నట్లుగా పార్లమెంటులో మోదీ రెచ్చిపోయారు. బడ్జెట్ సమావేశాల వేళ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞతలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో చర్చ సందర్భంగా మోదీ మాట్లాడుతూ విపక్షాలను దుయ్యబట్టారు. శీష్ మహల్, అర్బన్ నక్సల్స్ వంటి వ్యాఖ్యలు చేశారు. కొందరు నాయకులు 'జకూజీ, విలాస స్నానాల'పైనే దృష్టి పెట్టారు కానీ మేము ప్రతి ఇంటికి నీటి సరఫరాకు ప్రాధాన్యత ఇచ్చామని వ్యాఖ్యానించారు. కొందరు 'అర్బన్ నక్సల్స్' భాషను మాట్లాడుతున్నారంటూ విదేశాల్లో రాహుల్ ప్రసంగాలనుద్దేశించి అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు తనకు 14వ సారి అవకాశం ఇచ్చిన దేశ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి, సంక్షేమం తమ హయాంలో జరిగిందని ప్రగల్భాలు పలికారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశం అభివృద్ధినే చూడనట్లుగా... తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధి జరిగినట్లుగా మోదీ మాట్లాడారు. పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయట పడేశామంటూ తన భుజాన్ని ఆయనే చెర్చుకున్నారు. పేదల కోసం ఇప్పటికే నాలుగు కోట్ల ఇళ్లు ఇచ్చినట్లు చెప్పారు. మహిళల కోసం టాయిలెట్ వ్యవస్థను మెరుగుపర్చినట్లు తెలిపారు. పేదల కోసం 12 కోట్లకుపైగా మరుగుదొడ్లు కట్టించామన్నారు. వికసిత్ భారత్ సాధనే ప్రభుత్వ లక్ష్యమని మోదీ అన్నారు. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని చెప్పారు.

'మనం 2025లో ఉన్నాం. ఒక విధంగా 21వ శతాబ్దంలో 25శాతం గడిచింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత... 21వ శతాబ్దంలోని తొలి 25 ఏళ్లలో ఏమి జరిగిందో కాలమే నిర్ణయిస్తుంది. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. వికసిత్ భారత్ ఆశలు నింపింది' అని మోదీ అన్నారు. 'కొందరు నేతలు పేదలతో వారి గుడిసెల వద్ద ఫొటోలు దిగేందుకే ఆసక్తి చూపుతారు కానీ సభలో పేదల గురించి మాట్లాడితే ముఖాలు మాడ్చుకుంటారు' అని రాహుల్, కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించారు. 'దిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామాలకు 16పైసలే చేరుతోందని గతంలో ఓ ప్రధాని అన్నారు. అప్పట్లో దిల్లీ నుంచి గల్లీ వరకూ ఒకే ప్రభుత్వం ఉన్నా అదే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలా కాదు. రూపాయి పంపితే రూపాయి చేరుతోంది. నగదు బదిలీ ద్వారా నేరుగా ప్రజలకే సొమ్ము అందుతోంది' అని కాంగ్రెస్‌ను విమర్శించారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్న దృష్ట్యా కేజ్రీవాల్‌పై మాటలతో దాడికి మోదీ ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆప్ నేతలపై అవినీతి ఆరోపణలను ప్రస్తావించారు. 'గతంలో వార్తా పత్రికల శీర్షికలన్నీ కుంభకోణాలు, అవినీతిపైనే ఉండేవి. గత పదేళ్లుగా కోట్లాది రూపాయలు కాపాడాం. ఆ డబ్బు ప్రజా సంక్షేమానికి మళ్లింది. 'షీష్ మహల్' (అద్దాల మేడ) కట్టుకోవడానికి కాకుండా జాతి నిర్మాణానికి ఆ డబ్బు వినియోగించాం' అని మోదీ వ్యాఖ్యానించారు. అర్బన్ నక్సల్స్ ప్రస్తావన తెచ్చారు. అర్బన్ నక్సల్స్ భాష మాట్లాడే వారికి రాజ్యాంగం లేక దేశ ఐక్యత అర్థం కాదన్నారు. ఏడు దశాబ్దాల పాటు రాజ్యాంగ హక్కులకు జమ్మూకశ్మీర్, లఢక్ దూరమయ్యాయని ఆయనన్నారు. కులాల గురించి మాట్లాడటం కొందరికి ఫ్యాషన్‌గా మారిందని వ్యాఖ్యానించారు. 'తాము వచ్చాకే ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధ హోదా కోసం 30 ఏళ్ల డిమాండ్ నెరవేరగలిగిందన్నారు. ప్రతి రంగంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మరిన్ని అవకాశాల వెనుక తమ శ్రమ ఉందని ప్రధాని గొప్పలు పోయారు. దేశ అవసరాల దృష్ట్యా దీనిని ఆధునికంగా, సమర్థంగా మార్చేందుకు సంకల్పించామని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళుతున్నామని మోదీ అన్నారు.

పురివిప్పిన నెమలి



విశాలాంధ్ర-లింగపాలెం: ఉమ్మడి కడప జిల్లాలోని ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీ సమీపంలో జాతీయ పక్షి అయిన నెమళ్ల పరిరక్షణ, పునరుత్పత్తి కేంద్రంలో నెమళ్ల పెంపకం కనువిందు చేస్తుంది. మగ నెమళ్లు మాత్రమే పురివిప్పి తిరుగుతున్న దృశ్యాలు చూసి పర్యాటకులు మైమరిసి పోతున్నారు. ఈ మధ్యకాలంలో లింగపాలెం విశాలాంధ్ర విలేకరి నెమ్మళ్ల పరిరక్షణ కేంద్రానికి వెళ్లినప్పుడు ఒక నెమలి పురివిప్పి నాట్యం చేస్తున్న దృశ్యం కంటబడింది. ఈ నెమలికి పొడవైన ఈకలు ఉన్నాయి. ఇవి ఆకుపచ్చ, నీలం రంగులో ఉండి ఈకలకు కళ్లు ఉన్నాయి. కనువిందు గొలిపే దీన్ని చూడటానికి రెండు కళ్లు చాలవు అన్నట్లుగా అనిపించింది. ఈ దృశ్యాన్ని విశాలాంధ్ర తన మొబైల్ కెమెరాలో క్లిక్ మనిపించింది. ఇక్కడ నెమ్మళ్ల పెంపకం, పునరుత్పత్తి కేంద్రాన్ని తిలకించిన వారికి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. మగ నెమళ్లు పురివిప్పినప్పుడు చూడటానికి పర్యాటకులు గంటల తరబడి నిరీక్షిస్తూ ఆ దృశ్యాలను తిలకిస్తున్నారు.

రెండేళ్లలో 1.55 కోట్లమంది తొలగింపు

ఉపాధి హామీ పథకంపై కేంద్రం

న్యూదిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి 1.55 కోట్ల మంది కార్మికులను తొలగించినట్లు కేంద్రం తెలిపింది. 2022-24 మధ్య కాలంలో ఈ మేరకు కార్మికుల పేర్లు తొలగించినట్లు పేర్కొంది. రెండేళ్లలో మొత్తంగా 1,55,04,419 మంది పేర్లు తొలగించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభకు తెలిపారు. 2022-23లో 86,17,887 మంది, 2023-24లో 68,86,532 మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు వెల్లడించారు. నకిలీ, తప్పుడు జాబ్ కార్డులు, గ్రామాల నుంచి కార్మికుల కుటుంబాలు తరలిపోవడం లేదా సంబంధిత గ్రామాలను పట్టణాలుగా వర్గీకరించడం తదితర కారణాలతో ఈ మేరకు పేర్లను తొలగించినట్లు చెప్పారు.

శంతనుకు టాటా మోటార్స్‌లో కీలక బాధ్యత



ముంబై: దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా జీవిత చరమాంకంలో ఆయనతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి శంతను నాయుడు. చివరి దశలో టాటాకు కేర్‌టేకర్‌గా, జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. తాజాగా ఆయనకు టాటా గ్రూప్‌లో కీలక పదవి లభించింది. టాటా మోటార్స్‌లో స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్‌కు జనరల్ మేనేజర్‌గా శంతను నియమితులయ్యారు. ఈ విషయాన్ని తన లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో షేర్ చేస్తూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 'టాటా మోటార్స్ ప్లాంట్ నుంచి తెల్ల షర్టు, నేవీ బ్లూ ప్యాంట్‌లో నా తండ్రి (రతన్ టాటాను ఉద్దేశిస్తూ) నడుచుకుంటూ ఇంటికి వచ్చేవారు. ఆ సమయంలో నేను ఆయన కోసం ఎదురుచూస్తూ కిటికీలో నుంచి చూసేవాడిని. ఇప్పుడు నేను కూడా అలా నడిచొచ్చే రోజులు వచ్చాయి' అని శంతను రాసుకొచ్చారు. టాటా ట్రస్ట్‌లో పిన్న వయస్కుడైన శంతను 2018 నుంచి రతన్ టాటాకు అసిస్టెంట్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో 80ల్లో ఉన్న టాటాకు... ఈ యువకుడికి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. వీరిద్దరిని కలిపింది వీధి శునకాలపై ఉన్న ప్రేమే. రతన్ టాటాకు జనరల్ మేనేజర్‌గా, అత్యంత విశ్వాసపాత్రుడిగా మారారు. గతేడాది అక్టోబరులో రతన్ టాటా తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆ సమయంలో శంతను తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన మార్గదర్శిని గుర్తుచేసుకుంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు. 'మీ నిష్క్రమణతో మన స్నేహంలో శూన్యం మిగిలింది. ఆ లోటును అధిగమించడానికి జీవితాంతం ప్రయత్నిస్తాను. ఈ ప్రేమ దూరమవడంతో కలిగిన దుఃఖం పూడ్చలేనిది. గుడ్‌బై మై డియర్ లైట్‌హౌస్' అని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పుడొద్దన్న స్మార్ట్ మీటర్లు ఇప్పుడు కావాలా?

పోలవరం ప్రాజెక్టు ఎత్తు 150 అ॥లు ఉండాల్సిందే

డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి శూన్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు వద్దన్నవారే అధికారంలోకి రాగానే అవేముద్దంటూ వత్తాసు పలుకుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఎద్దేవా చేశారు. మంగళవారం అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నీలం రాజశేఖర్‌రెడ్డిభవన్‌లో పార్టీ జిల్లా సమితి సమావేశం జరిగింది. జిల్లా సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో ఏపీ డబుల్ ఇంజన్ సర్కార్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోయినా సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని, ప్రధాని మోదీని పొగడటం సరైంది కాదన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల 25 సంవత్సరాల పాటు విద్యుత్ వినియోగదారులపై రూ.1,10,000 కోట్ల భారం పడుతుందన్నారు. సంబంధిత ఒప్పందం రద్దు చేయమని అడిగితే... సీఎం చంద్రబాబు మాత్రం ఆ విషయంపై పెదవి విప్పడం లేదన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిందని... అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు కావాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ మతోన్మాదచర్యలు, ప్రజావ్యతిరేక చర్యలపై మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా ప్రజాచైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు రామకృష్ణ తెలిపారు. రాష్ట్రంలో రైతులకు పంట పెట్టుబడి కింద రూ .20వేల ఆర్థికసాయం, విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ అమలుచేస్తామన్న హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు 135 అడుగులకు మాత్రమే నిధులు మంజూరు చేస్తామని కచ్చితంగా చెప్పిందని, కనీసం 150 అడుగుల ఎత్తులో ప్రాజెక్టు నిర్మిస్తేనే రాయలసీమ, ఉత్తరాంధ్రకు పుష్కలంగా నీరు అందడంతోపాటు 960 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తవుతుందన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నప్పటికీ అభివృద్ధి శూన్యమన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు కమిటీలు వేసుకొని పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 17వ తేదీన పులివెందులలో, ఈ నెలాఖరులో సత్య సాయి జిల్లాలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, పుట్టపర్తి జిల్లా సహాయ కార్యదర్శి వేమయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జే రాజారెడ్డి, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వినీ వైష్ణవ్‌తో లోకేశ్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ మంగళవారం భేటీ అయ్యారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి దిల్లీ వెళ్లిన లోకేశ్ రాత్రి 7.30 గంటలప్పుడు అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. తొలుత ఏపీ రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులకు కృతజ్ఞతలు తెలిపారు. దుశ్శాలువ, మెమెంటోతో కేంద్రమంత్రిని లోకేశ్ సత్కరించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఏపీకి చేయూత ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. అంతకుముందు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, టీడీపీ ఎంపీలు, బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా లోకేశ్‌ను కలిశారు. కలిసికట్టుగా ఉండటం వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగామన్న లోకేశ్, రాష్ట్ర ప్రయోజనాలలో ఇదే పంథా కొనసాగిద్దామని సూచించారు. సమష్టి కృషితోనే విశాఖ రైల్వేజోన్, అమరావతి, పోలవరానికి నిధులు తెచ్చుకోగలిగామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రమంత్రులు, ఎంపీల కృషిని అభినందించారు. తక్కువ సమయంలో విశాఖ ఉక్కు సహా అనేక సమస్యలు పరిష్కారం కావడం హర్షణీయమని అన్నారు.

భారత్‌కు లాభమే

అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంపై నిపుణుల అంచనా

న్యూదిల్లీ: దిగుమతులపై అమెరికా, చైనా పరస్పరం సుంకాల విధింపుతో వాణిజ్య యుద్ధానికి కాలు దువ్వుతున్నాయి. ఈ చర్యల వల్ల ఆయా దేశాల్లో కొన్ని వస్తువుల ధరలు గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. అయితే అమెరికాకు ఎగుమతులు పెంచడం ద్వారా భారత ఎగుమతిదారులు ప్రయోజనం పొందవచ్చని సంబంధిత వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ట్రంప్ తొలి హయాంలో చైనాపై సుంకాలు విధించినప్పుడు ప్రధానంగా లాభపడిన నాలుగు దేశాల్లో భారత్ ఒకటని గుర్తు చేస్తున్నాయి. 'ధరల పెరుగుదల వల్ల అమెరికా కొనుగోలుదారులు ప్రత్యామ్నాయం వైపు చూస్తారు. ఈ పరిణామాలు భారత్ ఎగుమతులకు మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చు. విద్యుత్ యంత్రాలు, ఆటో పరికరాలు, మొబైల్, ఫార్మా, రసాయనాలు, దుస్తులు, వస్త్ర రంగాలు లాభపడవచ్చు' అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ వెల్లడించారు. అయితే, భారత ఉత్పత్తి సామర్థ్యం, పోటీతత్వంపై ఈ ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయన్నారు. రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్... అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగానే కొన్ని దేశాల నుంచి దిగుమతులపై సుంకాలు పెంచే ఆదేశాలపై సంతకం చేశారు. చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కస్టమ్స్ సుంకాలు విధించారు. దీంతో అమెరికా మార్కెట్లో వాటి ధరలు పెరగడం, పోటీ తగ్గడం వల్ల చైనా ఎగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉందని ఎగుమతిదారులు చెబుతున్నారు. అమెరికా వినియోగదారులపైనా ధరల పెరుగుదల ప్రభావం పడవచ్చనే ఆందోళనలు మొదలయ్యాయి. ఈ పరిణామాలు భారత్ నుంచి ఎగుమతి అవకాశాలను మరింత పెంచేందుకు దోహదం చేయవచ్చని భారత వాణిజ్య నిపుణులు అంచనా వేస్తున్నారు.

పన్ను చెల్లింపుదారులను గౌరవించేందుకే...

పన్ను మినహాయింపుపై నిర్మలాసీతారామన్

న్యూదిల్లీ: దేశ ప్రజలకు రూ.12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం వెనుక కారణాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. మంళవారం ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'గత మూడు, నాలుగేళ్ల నుంచి మేం పన్ను చెల్లింపుదారులతో మాట్లాడుతున్నాం. పన్ను చెల్లించే విషయంలో వారు ప్రభుత్వాన్ని పూర్తిగా నమ్ముతున్నారు. వారంతా క్రమం తప్పకుండా పన్ను కడుతూ దేశానికి చేస్తున్న సేవను గౌరవించేందుకే ప్రధాని మోదీ పన్ను మినహాయింపు ఇచ్చారు. పాత పన్ను విధానంలో మినహా యింపులు కావాల్సిన వాళ్ల కోసం దానిని కూడా అందుబాటులోనే ఉంచాం. కొత్త ఆదాయ పన్ను చట్టం మొత్తం పన్ను ప్రక్రియను సులభతరం చేస్తుంది. 1961 పన్ను చట్టం చాలా క్లిష్టతరంగా ఉండడంతో పన్ను చెల్లింపుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు' అని నిర్మల తెలిపారు. బడ్జెట్‌లో రూ.12 లక్షల దాకా ఆదాయం ఉన్న వేతన జీవులకు పూర్తిగా పన్ను మినహాయిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మినహాయింపుతో పాటు రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్ వెసులుబాటు కూడా లభించనుంది. కొత్త పన్ను విధానంలో ఆదాయ పన్ను శ్లాబులను తగ్గించారు.

రైతులకు ద్రోహం

- కేంద్ర బడ్జెట్‌లో సాగుకు విదిలింపులు
- ఎంఎస్‌పీతో సహా దీర్ఘకాలిక డిమాండ్ల విస్మరణ
- సంయుక్త కిసాన్ మోర్చా అసహనం

న్యూదిల్లీ: 'కేంద్ర బడ్జెట్‌లో రైతులకు తీరని అన్యాయం జరిగింది. అన్నదాత విషయంలో మోదీ ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించింది. రుణ మాఫీ ఊసే ఎత్తలేదు. పంటోత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు హామీ లేదు. వ్యవసాయ రంగానికి విదిలింపులతో సరిపెట్టుకున్నది. ఎంఎస్‌పీతో సహా దీర్ఘకాలిక డిమాండ్లు విస్మరిస్తూ రైతుల ప్రయోజనాలు పణంగా కార్పొరేట్లకు లబ్ది చేకూర్చే విధంగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఉన్నాయి' అని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఒక ప్రకటనలో అసహనం వ్యక్తం చేసింది. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఎంఎస్‌పీ కోసం దీర్ఘకాలంగా ఉన్న డిమాండ్‌ను మోదీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వ్యాఖ్యానించింది. కార్పొరేట్ల లాభాలు 2022-23లో రూ.19,88,000 కోట్ల నుంచి 2023-24లో రూ.14,11,000 కోట్లకు పెరగడంపై విచారణ అవశ్యమని పేర్కొంది. కార్పొరేట్ కంపెనీలకు వచ్చే భారీ లాభాల్లో నుంచి న్యాయమైన వాటా రైతులకు, వ్యవసాయ కార్మికులకు, సాగుదారులకు అందించేందుకు బడ్జెట్‌లో ఏమీ లేదని తెలిపింది. రుణ మాఫీ డిమాండ్‌ను పరిష్కరించే విధంగా ఏమీ ప్రకటించలేదని, పార్లమెంటరీ కమిటీ సిఫార్సులనూ కేంద్రం బేఖాతరు చేసిందని ఎస్‌కేఎం వ్యాఖ్యానించింది. గత రెండేళ్లలో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు రూ.2,09,14 కోట్లు, రూ.1,70,000 కోట్లు చొప్పున కార్పొరేట్ రుణాలను మాఫీ చేసినట్లు గుర్తుచేసింది. అప్పులు తీర్చలేక రోజుకు కనీసం 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రధాని నోరు మెదపడటం లేదని దుయ్యబట్టింది. వ్యవసాయం, దాని సంబంధిత రంగాలకు కేటాయింపులలో రూ.5,042.06 కోట్లు తగ్గాయని, 2024-25 (అంచనాలు) రూ.3,76,720.41 కోట్లు కాగా 2025-26 బడ్జెట్ అంచనాలు రూ.3,71,687.35 కోట్లకు తగ్గిందని సంయుక్త కిసాన్ మోర్చా తెలిపింది. అలాగే, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కేటాయింపులోనూ కోత విధించారని, రూ.16,864కోట్ల నుంచి రూ.12,242.27కోట్లకు అది తగ్గిందని ఎస్‌కేఎం పేర్కొంది.

ఉపాధి హామీకి నిధి పెంచాలి: దర్శన్ పాల్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం కేటాయింపులను కేంద్రం పెంచాలని సంయుక్త కిసాన్ మోర్చా సమన్వయక కమిటీ సభ్యుడు, క్రాంతికారీ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు దర్శన్ పాల్ డిమాండ్ చేశారు. నామ మాత్రంగా పెంచి గొప్ప బడ్జెట్ అని చెప్పుకుంటోందని దుయ్యబట్టారు. ఉపాధి కల్పన, వలసల నియంత్రణపై బడ్జెట్ మౌనంగా ఉందన్నారు. 'ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద 100 పని దినాల స్థానె 45 రోజులే పని లభిస్తోంది. రోజుకు రూ.600 వేతనంతో 200 పని దినాలకు డిమాండ్ ఉంది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కోసం కేటాయింపు రెట్టింపు చేయాలన్నది ఎస్‌కేఎం డిమాండ్ కానీ ప్రజలకు, పేదలకు అనుకూలమైన ఈ పథకాన్ని ప్రధాని నీరుగారుస్తున్నారు' అని పీటీఐతో మాట్లాడిన దర్శన్ పాల్ అన్నారు. వ్యవసాయ రంగం నుంచి తయారీ/సేవల రంగం వైపునకు ప్రజలను మళ్లించడంలో ఎన్‌డీఏ ప్రస్తుత, గత ప్రభుత్వ విధానాలు విఫలమైనట్లు ఆర్థిక సర్వే 2023-24లో కేంద్రమే ఒప్పుకున్నదని చెప్పారు. దేశ జీడీపీలో వ్యవసాయ రంగానికి 16శాతం, ఉపాధి కల్పనలో 46.1శాతం మేర వాటా ఉన్నప్పటికీ దీనిని సముచిత ప్రాధాన్యత దక్కడంలేదని అన్నారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు మద్దతు ధరను కేంద్రం నిరాకరిస్తోందని దర్శన్ పాల్ వ్యాఖ్యానించారు.

ఎరువులపై సబ్సిడీలో కోత: అశోక్ ధవాలే

ఎరువులపై సబ్సిడీలో కేంద్రం కోత విధించినట్లు ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు అశోక్ ధవాలే తెలిపారు. రూ.17,1298.50 కోట్లుగా ఉన్న సబ్సిడీ రూ.1,67,887.20కోట్లకు తగ్గిందని అంటే రూ.3,411.30 కోట్ల మేర కోత పడిందన్నారు. పప్పుధాన్యలకు సంబంధించి ఆరేళ్ల ఆత్మనిర్భర్ మిషన్ డొల్లదనం బహిర్గతమైందని అన్నారు. ఇందుకు కేటాయించినది రూ.వెయ్యి కోట్లు మాత్రమేనన్నారు. వచ్చే నాలుగేళ్ల కోసం ధరల స్థిరీకరణకు హామీనిచ్చేలా పప్పుధాన్యాల సేకరణకు నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ దావాలలో కొత్తదనం లేదని ధవాలే వ్యాఖ్యానించారు. దీనిని బట్టి పంటోత్పత్తులను ఎంఎస్‌పీకి కొనుగోలు చేసే ఉద్దేశం ప్రైవేటు రంగానికి లేదని స్పష్టమవుతోందని ఆయన అన్నారు. తక్కువ రాబడిగల 100 జిల్లాల కోసం ధన్ ధ్యాన్ క్రిషి యోజనను ప్రకటించారు, తద్వారా 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం ఉంటుందని చెప్పారు కానీ దీని కోసం ప్రత్యేకంగా కేటాయింపు ఇవ్వలేదని అశోక్ ధవాలే అన్నారు. ఉన్న పథకాలకే కొత్త రూపం ఇవ్వడం తప్ప రైతుల కోసం కేంద్రం చేస్తున్నదేమీ లేదని ఎద్దేవా చేశారు. రబ్బర్ ధర స్థిరీకరణకుగానీ వణ్యజీవుల సమస్య పరిష్కారానికీగానీ బడ్జెట్‌లో ఏమీలేదన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.